

మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


**ఉపకులాలన్నీ విశ్వబ్రాహ్మణులే**

విశ్వబ్రాహ్మణ కులంలోని ఉప కులాలన్నింటినీ ఒకటిగా పరిగణిస్తామని రాష్ట్ర సర్కార్ హైకోర్టుకు తెలిపింది. ప్రభుత్వ సర్వేలో వేర్వేరు సబ్ కేటగిరీలుగా ఉన్నా వాటిని ఒకే కులంగా పరిగణిస్తామని చెప్పింది. విశ్వబ్రాహ్మణుల ఉప కులాలను వేర్వేరు కులాలుగా పరిగణిస్తూ సర్వే నిర్వహించడం అన్యాయమంటూ విశ్వబ్రాహ్మిన్ అడ్వొకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సూరేపల్లి నంద ఇటీవల విచారణ చేపట్టారు.


సంపుటి 27, సంచిక: 167 | మంగళవారం | 03-12-2024 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00


పెచ్చరిల్లిన మతహింస... బిజెపి

# దుష్టపాలన ఫలితమే

మతహింస ప్రతిఘటనకు అభ్యుదయశక్తుల ఐక్యత అనివార్యం

సిపిఐ జాతీయ సమితి సమావేశ తీర్మానాలు ప్రకటించిన డి.రాజా

అదానీ అవినీతిపై జెపిసి ఏర్పాటుకు 10న నిరసనలు, డిమాండ్స్ డే




**న్యూఢిల్లీ :** బిజెపి దుష్టపరిపాలన ఫలితమే దేశంలో మతహింస పెచ్చరిల్లడానికి కారణమని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) నిశితంగా విమర్శించింది. దేశంలో, ఉత్తరప్రదేశ్‌లో రోజు రోజుకూ పెరుగుతున్న మత ఉద్రిక్తతలను ప్రతిఘటించేందుకు ప్రగతిశీల,అభ్యుదయశక్తులు అనివార్యంగా ఐక్యం కావాల్సిన అవసరం ఉందని పేర్కొంది. న్యూఢిల్లీలో సిపిఐ కేంద్ర కార్యాలయం అజయ్‌భవన్‌లో నవంబరు 28,29,30 తేదీలలో సిపిఐ జాతీయ సమితి సమావేశాలు జరిగాయి. జాతీయ కార్యవర్గ సభ్యుడు ప్రకాశ్ బాబు అధ్యక్షతన మూడురోజులు జరిగిన సమావేశంలో చేసిన పలు తీర్మానాలను,నిర్ణయాలను సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా సోమవారంనాడు పత్రికాగోష్టిలో వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ సంభాల్‌లో తలెత్తిన మతహింస పట్ల జాతీయ సమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జాతీయ సమితి సమావేశం ప్రధానంగా ఆరు తీర్మానాలను ఆమోదించింది. అదానీ గ్రూపు కంపెనీలలోఅవినీతి, తప్పిదాలు, క్రోనీ క్యాపిటలిజంను ప్రోత్సహించడంలో ప్రభుత్వపాత్రపై దర్యాప్తునకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటుచేయాలని కోరుతూ ఈనెల 10వ తేదీన

తరువాయి 2లో

**సెప్టెంబరు 21 నుంచి 25 వరకు**

**చండీగఢ్‌లో సిపిఐ జాతీయ మహాసభలు**

సిపిఐ 25వ జాతీయ మహాసభలను 2025 సెప్టెంబరు 21వ తేదీ నుండి 25వ తేదీ వరకు చండీగఢ్‌లో నిర్వహించాలని సిపిఐ జాతీయ సమితి సమావేశం నిర్ణయించింది. మహాసభలో పాల్గొనే ప్రతినిధుల ఎంపిక మార్గదర్శకాలకు ఆమోదం తెలిపింది. జాతీయ మహాసభలకుంటే ముందుగానే 2025 ఆగస్టు నెల వరకు అన్ని రాష్ట్రాల మహాసభలను పూర్తి చేయాలని నిర్ణయించింది.

## ఖమ్మంలో శతాబ్ది వేడుకల ముగింపు సభ

సిపిఐ శతాబ్ది సంవత్సర వేడుకల లోగోను ప్రధాన కార్యదర్శి డి.రాజా జాతీయ సమితి సమావేశాలలో ఆవిష్కరించారు. 1925 డిసెంబర్ 26వ తేదీన సిపిఐ వ్యవస్థాపక మహాసభలు జరిగిన ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లోనే డిసెంబర్ 26న సిపిఐ శతాబ్ది ఉత్సవాల ప్రారంభ సూచికగా సమావేశం నిర్వహించాలని జాతీయ సమితి నిర్ణయించింది. 2025 డిసెంబరు 26న సిపిఐ శతాబ్ది సంవత్సర వేడుకల ముగింపు వేడుకలను తెలంగాణలోని ఖమ్మంలో నిర్వహించాలని, భారీ ర్యాలీ, బహిరంగ సభ ఏర్పాటు చేయాలని సమావేశం తీర్మానించింది.

రైల్వే మంత్రిపై సిపిఐ సభా హక్కుల నోటీస్ 02



# తొలగిన ప్రతిష్టంభన

ప్రతిపక్షాల డిమాండ్‌లకు తలొగ్గిన ప్రభుత్వం

ఆయా అంశాలపై చర్చకు అంగీకారం

నేటి నుంచి యథావిధిగా పార్లమెంట్

వచ్చేవారం రాజ్యాంగంపై ప్రత్యేక చర్చ

**న్యూఢిల్లీ :** పార్లమెంటు సమావేశాలలో నెలకొన్న ప్రతిష్టంభనకు మంగళవారం నుంచి తెరపడనుంది. రాజ్యాంగ పరిషత్తు రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భారత రాజ్యాంగంపై ఈ నెల 13,14 తేదీలలో లోక్‌సభ, 16,17 తేదీలలో రాజ్యాసభలో చర్చించేందుకు ప్రభుత్వం, విపక్షాలు అంగీకరించాయి. అలాగే సంభాల్, బంగ్లాదేశ్ పరిణామాలను చర్చించేందుకు కూడా ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో పార్లమెంటు సమావేశాలు పట్టాలెక్కనున్నాయి. వారం రోజుల క్రితం సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి అదానీ లంచాల వ్యవహారం, మణిపూర్, సంభాల్ తదితర అంశాలపై చర్చకు విపక్షాలు పట్టుబట్టాయి. రోజు ఉభయ సభలు ప్రారంభమైన వెంటనే ఈ మేరకు డిమాండ్ చేస్తున్నాయి. అయితే, అధికార పక్షం ప్రతిపక్షాల వాదన వినకుండానే సభలను కొద్దిసేపటికే వాయిదా వేయిస్తూ వస్తోంది. కాగా సోమవారం కూడా పార్లమెంటు సమావేశం ప్రారంభమైన వెంటనే అదానీపై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో ఉభయ సభలు వాయిదాపడ్డాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వైపు నుంచి ప్రతిపక్షాలతో అనధికార చర్చలు జరిగాయి. ఫలితంగా లోక్‌సభలో వివిధ పార్టీల నాయకులతో సభ వాయిదా పడిన తరువాత స్పీకర్ ఓం బిర్లా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వివిధ పక్షాల

తరువాయి 2లో

ఏడాదిలోనే వైద్యశాఖలో

# 14 వేల పోస్టులు

- భర్తీ చేయడం స్వతంత్ర భారతంలో ఇదే తొలిసారి
- త్వరలో మరో 6500 మందిని నియమిస్తాం
- పోటీ పరీక్షలను వాయిదా వేసేందుకు కొన్ని శక్తులు ప్రయత్నించాయి
- రాష్ట్ర ప్రభుత్వంపై చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు





**ప్రజాపక్షం/హైదరాబాద్**

రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ప్రజల కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపైన ఏడాది కాలంలోనే కొందరు చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలని, ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిని కర్రు కాల్చి వాత పెట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశంలో 11 ఏళ్లుగా కుర్చీలో కూర్చొని, నల్ల చట్టాలను తీసుకొచ్చి, రైతులకు క్షమాపణ చెప్పిన వారు ఒకరైతే, మరోవ్యక్తి పదేళ్ల రాష్ట్రాన్ని పాలించి ఫామ్‌హౌస్‌లో పండుకొని, వరి వేసుకుంటే ఉరి అని చెప్పారని, వీరిద్దరూ కలిసి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ ప్రయత్నాలను తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉన్నదని సిఎం పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే 50వేలకు పైగా ఉద్యోగ నియామకాలు చేపట్టడం, అందులోనూ కేవలం ఒక వైద్య ఆరోగ్య శాఖలోనే దాదాపు 14 వేల ఉద్యోగాల భర్తీ చేయడం దేశానికి స్వాతంత్ర్య వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ దేశంలో ఇదే మొదటి సారి అని సిఎం ప్రకటించారు. త్వరలోనే వైద్య

తరువాయి 2లో

మహిళా కానిస్టేబుల్

## దారుణ హత్య

తమ్ముడే హత్య చేసిన వైనం

ప్రేమా వివాహమా.. ఆస్తి కోసమా..?

పోలీసుల అదుపులో నిందితుడు

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం/యాచారం**




కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తున్న సొంత అక్కను నరికి చంపి హత్య చేసిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి ఇబ్రహీంపట్నం సిఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయపోల్ గ్రామానికి చెందిన కోంగర మాసయ్య కూతురు నాగమణి (28) హయత్‌నగర్ పిఎస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. నాగమణి గత నెల రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్‌ను

తరువాయి 2లో

సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని వాజేడు

## ఎస్‌ఐ ఆత్మహత్య



**వాజేడు:** ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న రుద్రారపు హరీశ్ (29) సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గోదావరి సమీపంలోని ఫెరియాడో రిసార్ట్ గదిలో సోమవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న వెంటాపురం సిఐ కుమార్ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ములుగు జిల్లా ఎస్‌పి డాక్టర్ శబరీశ్ రిసార్ట్‌కు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌పి తెలిపారు. మృతుడి స్వస్థలం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం వెంకటేశ్వర్లపల్లి. వ్యక్తిగత కారణాలతో హరీశ్ ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.

డ్యూటీలో చేరేందుకు వెళ్తూ

## మృత్యు ఒడికి...



**బెంగళూరు :** శిక్షణ పూర్తి చేసుకొని డ్యూటీలో చేరేందుకు వెళ్తున్న ఓ ఐపిఎస్ ఆఫీసర్‌ను మృత్యువు వెంటాడింది. రోడ్డు ప్రమాదంలో సదరు ఆఫీసర్ ప్రాణాలు కోల్పోయారు. విధుల్లో చేరాల్సిన అతను విగతజీవిగా మార్చురీలో చేరాడు. ఈ ఘటన కర్ణాటక రాష్ట్రంలో చోటు

తరువాయి 2లో



# రైతులపైకి లారీ



రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఘోర రోడ్డు ప్రమాదం

నలుగురికి తీవ్రగాయాలు

## నలుగురి దుర్మరణం

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి**

రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం హైదరాబాద్ – బీజాపూర్ రహదారిపై ఉన్న చేవెళ్ల మండలం ఆలూరు గేట్ వద్ద లారీ డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో ఆర్‌టిసి బస్సును ఓవర్‌టేక్ చేయబోయి రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తున్న రైతులపైకి దూసుకుపోయింది. దూసుకొస్తున్న లారీని చూసి రైతులతో పాటు కూరగాయలు కొనుగోలు చేస్తున్న వారంతా భయంతో పరుగులు తీశారు. వ్యాపారులపైకి దూసుకెళ్లిన లారీ చెట్టును ఢీకొట్టు ఆగింది.లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కొని తీవ్రగాయాలు పాలవ్వడంతో అతడిని బయటకు తీసి చికిత్సకోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. లారీ సృష్టించిన బీభత్సంలో ఆలూరుకు చెందిన విద్యార్థి దామరగిద్ద

తరువాయి 2లో

మృతదేహాలను

## భద్రపర్చండి

ఏటూరు నాగారం ఎన్‌కౌంటర్ ఘటనలో హైకోర్టు ఆదేశం

విషపదార్థాల ప్రయోగం దుష్ప్రచారం : డిజిపి

**హైదరాబాద్ :** ములుగు జిల్లా ఏటూరు నాగారంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని పౌరహక్కుల సంఘం తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. భోజనంలో మత్తుపదార్థాలు కలిపి మావోయిస్టులను కస్టడీలోకి తీసుకున్నారని, చిత్రహింసలకు గురిచేసి కాల్చిచంపారని న్యాయస్థానానికి తెలిపారు. మావోయిస్టుల మృతదేహాలపై తీవ్ర గాయాలు ఉన్నాయని న్యాయవాది కోర్టులో వాదించారు. కనీసం వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు చూపించకుండా

తరువాయి 12లో

## అలకవీడని ఏక్‌నాథ్ షిండే?

సోమవారం జరగని మహాయుతి సమావేశం

ఢిల్లీకి ఎన్‌సిపి నేత అజిత్ పవార్

రేపు బిజెపి శాసనభాపక్ష సమావేశం

బిజెపి కేంద్ర పరిశీలకులుగా నిర్మలాసీతారామన్, విజయ్ రూపానీ



**ముంబాయి :** ఒకవైపు మహారాష్ట్రలో తమ పార్టీ నుంచి ముఖ్యమంత్రిని చేయాలని బిజెపి అధిష్టానం అడుగులు వేస్తుంటే, మరోవైపు మహాయుతి కీలక భాగస్వామి శివసేన మాత్రం తన అసంతృప్తిని కొనసాగిస్తూనే ఉంది. మంగళవారం నాడు ముంబాయిలో మహాయుతి సమావేశమవుతుందని భావించినప్పటికీ, ఆపద్ధర్మ సిఎం ఏక్‌నాథ్ షిండే తన అపాయింట్‌మెంట్‌లన్నీ రద్దు చేసుకోవడంతో మహారాష్ట్ర సిఎం పదవిపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. మహాయుతిలో మరో భాగస్వామ్య పక్ష నాయకుడు అజిత్ పవార్ హుటాహుటిన ఢిల్లీకి వెళ్ళారు. బిజెపి పిలుపు మేరకే ఆయన పదవుల పంపకం విషయంలో చర్చించేందుకు ఢిల్లీకి వెళ్ళినట్లు తెలిసింది. ఎన్నికల్లో మహాయుతి ఘన విజయం సాధించి పది రోజులవుతున్నప్పటికీ ముఖ్యమంత్రి పేరు ఇంకా తేలలేదు. గత గురువారం ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఏక్‌నాథ్ షిండే, బిజెపి, ఎన్‌సిపిలకు చెందిన డిప్యూటీ సిఎంలు దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్‌లు సమావేశమయ్యారు. అది పూర్తవ్వగానే ఒకటి , రెండు రోజుల్లో ముంబాయిలో మహాయుతి కూటమి సమావేశమై ముఖ్యమంత్రిని నిర్ణయిస్తుందని షిండే ప్రకటించారు. కానీ, నాలుగైదు రోజులు గడిచినా కూటమి సమావేశం జరగకపోవడంతో మహాయుతిలో

తరువాయి 12లో

## ఢిల్లీ-నోయిడా ‘రణరంగం’

రైతుల నిరసన కవాతుకు ముందే భారీసంఖ్యలో బారికేడ్లు-నెట్టిపారేస్తున్న నిరసనకారులు

సరిహద్దులో తనిఖీలు, నిఘా కోసం డ్రోన్ల ఏర్పాటు

తీవ్రస్థాయిలో ట్రాఫిక్ రద్దీ



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో జరుగనున్న రైతుల ఆందోళన బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టిస్తోంది. ఊహించని రీతిలో రైతుల నిరసనజ్వాలలు విస్తరిస్తున్నాయి. రైతుల నిరసన కవాతును దృష్టిలో పెట్టుకుని పోలీసులు బహుళ బారికేడ్లను ఏర్పాటుచేశారు. అయితే ఈ నిరసన ప్రదర్శనకు ముందే రైతుల ప్రదర్శనలు పోలీలను కలవరపరుస్తోంది. దీంతో ఢిల్లీనోయిడా సరిహద్దును దాటే ఏరియాలో ట్రాఫిక్ స్తంభించి ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలిగింది. రైతులు దాద్రినొయిడా సరిహద్దును అనుసంధానించే మహామయ ఫ్లై ఓవర్‌పై నిరసన తెలిపేందుకు రైతులు గుమిగూడారు. భూమి కేటాయింపు, భూసేకరణ కోసం తీసుకున్న

తరువాయి 12లో

ఐఎఎల్ రాష్ట్ర అధ్యక్షులుగా

## బొమ్మగాని ప్రభాకర్

- ప్రధాన కార్యదర్శులుగా ఉదయభాస్కర్, భీమనాథ్ శ్రీనివాస్, ఎ.వి.కృష్ణారావు
- హనుమకొండలో జరిగిన రాష్ట్ర మహాసభలో 75 మందితో కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**ప్రజాపక్షం / హైదరాబాద్**



ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) రాష్ట్ర అధ్యక్షులుగా బొమ్మగాని ప్రభాకర్, ప్రధాన కార్యదర్శులుగా యనమోలు ఉదయభాస్కర్, భీమనాథ్ శ్రీనివాస్, ఎ.వి.కృష్ణారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హనుమకొండలో శని, ఆదివారాలలో

తరువాయి 2లో

## పురోగతి లేని చర్చలు

- విభజనాంశాలపై ఎపి, తెలంగాణ సిఎస్‌ల భేటీ
- తేలని విద్యుత్ బకాయిల వివాదం
- 9,10 షెడ్యూలు సంస్థల అంశాలూ వాయిదా
- మూడింటిపై కుదిరిన అంగీకారం




**అమరావతి :** రాష్ట్ర పునర్విభజన అంశాలపై ఉభయ తెలుగురాష్ట్రాల మధ్య జరిగిన చర్చల్లో ఆశించినంత పురోగతి కానరాలేదు. కేవలం చిన్నపాటి మూడు అంశాలపై మాత్రమే ఏకాభిప్రాయానికొచ్చారు. మిగిలిన అంశాలన్నీ దాదాపు మరలా వాయిదా పడ్డాయి. గతంలో రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డి ప్రజా భవన్ వేదికగా సమావేశమై మూడంచెల చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవాలని నిర్ణయించుకున్న విషయం తెల్సిందే. దీనిలో భాగంగా ఎపి, తెలంగాణా సిఎస్‌ల నేతృత్వంలో తొలిసారి సోమవారం మంగళగిరి ఎపి ఐఐసి భవనంలో ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారుల కమిటీ సమావేశం జరిగింది. దాదాపు రెండు గంటలకు పైగా సాగిన ఈ సమావేశంలో మూడు అంశాలపై అంగీకారానికి రాగా, కీలకమైన విద్యుత్ బకాయిల అంశంపై పంచాయితీ మాత్రం ఎటూ తేలలేదు. రూ.861 కోట్ల మేర లేబర్ సెస్‌ను ఎపి, తెలంగాణల మధ్య పంపకానికి అంగీకారం కుదిరింది. పన్నులు పంపకాలపై ఇరు రాష్ట్రాల శాఖల

తరువాయి 12లో

# రైల్వే మంత్రిపై సిపిఐ సభా హక్కుల నోటీస్



**న్యూఢిల్లీ :** కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌పై సిపిఐ రాజ్యసభ పక్ష నాయకు లు పి.సందోశ్ కుమార్ సభా హక్కుల ఉల్లంఘణ నోటీసు ఇచ్చారు.సభను తప్పుదోవపట్టించే విధంగా ఆయన శాఖ సమాచారం ఉన్నదని ఆరోపిస్తూ ఈ నోటీ సు సమర్పించారు. రైల్వే కార్మికుల భద్రతపై సిపిఐ ఎంపి పి.పి.సునీర్ అడిగిన ప్ర శ్నకు స్పందిస్తూ 2014 –17 నుంచి 2023–24 వరకు పదేళ్ళ కాలంలో 65 మంది చనిపోయారని, 569 మంది గా యపడ్డారని సమాధానమిచ్చారు. ఇలాం టి ప్రశ్నకే గత ఏడాది డిసెంబర్ 8న రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు గత ఐదేళ్ళలో (2019–20 నుంచి 2023 నవంబర్ 27 వరకు )రైల్వే పట్టాల మరమ్మతు పనులు చేస్తుండగా సంభవించిన రైల్వే ప్రమాదాలలో 361 మంది రైల్వే కార్మికులు మరణించినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే, సోమవారం నాడు ఇదే అంశంపై అడిగిన ప్రశ్నకు మంత్రి రాజ్యసభకు పూర్తి భిన్నమైన అంకెలను ఇచ్చారని సిపిఐ ఒక ప్రకటనలో తెలిపింది. గత మూడేళ్ళలో నిర్మాణం, నిర్వహణ, తనిఖీ లేదా కప్లింగ్ సందర్భంగా రెగ్యులర్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు సహా ఎంత మంది మరణించారు, ఎందరు గాయపడ్డారో జోన్‌ల వారీగా వివరాలు తెలియజేయాలని సునీర్ ప్రశ్న వేసారు. ''65 మంది చనిపోయారని మంత్రిత్వ శాఖ సమాధానం రాజ్యసభలో 2023 డిసెంబర్‌లో అంగీకరించిన సంఖ్యకు పూర్తి విరుద్ధమ'ని సిపిఐ ప్రకటనలో పేర్కొంది. గతేడాది డిసెంబర్ 8న ఎంపి ఎ.ఎ.రహీమ్ వేసిన లిఖిత ప్రశ్నకు రైల్వే మంత్రిత్వ శాఖ రాజ్యసభకు అందజేసిన సమాచారం ప్రకారం గడిచిన ఐదేళ్ళలో (2019–20 నుంచి 2023 నవంబర్ 27 వరకు) 361 మంది రైల్వే కార్మికులు మరణించినట్లు సమాధానంలో ఉంది. గడిచిన పదేళ్ళలో ఎంత మంది రైల్వే కార్మికులు మరణించారని వేసిన సిపిఐ ఎంపి పి.పి.సునీర్ వేసిన ప్రశ్నకు 65 మందే చనిపోయినట్లు తెలిపారని, ఇది ఐదేళ్ళలో మరణించిన వారి సంఖ్య (361) కంటే పదేళ్ళలో చాలా తక్కువగా ఉందని సిపిఐ తెలిపింది. రాజ్యసభకు రైల్వే మంత్రిత్వశాఖ మరణించిన రైల్వే కార్మికుల సంఖ్యపై ఇచ్చిన సమాచారంలో తీవ్రమైన తేడా ఉందని ఎంపి సందోష్ కుమార్ అన్నారు. ఇంతటి గంభీరమైన అంశంపై రైల్వే మంత్రిత్వ శాఖ నిర్లక్ష్యంగా సమాచారం ఇచ్చిందని అన్నారు. కార్మికుల భద్రత వంటి గంభీరమైన అంశంపై సభను తప్పుదోవ పట్టించే విధంగా సమాచారం ఇచ్చినందున రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వ్యతిరేకంగా సభా హక్కుల ఉల్లంఘణ నోటీసు ఇచ్చినట్లు వెల్లడించారు.

## రైతులపైకి దూసుకెళ్లిన లారీ

(మొదటి పేజీ తరువాయి)

కృషణ(19)తోపాటు రైతులు నక్కలపల్లి రాములు (50), శ్యామల సుజాత (42) మరో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాగా మరో నలుగురు తీవ్ర గాయాలకు గురైనారు. మృత దేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి, గాయపడిన వారిని హైదరాబాదులోని ఆసుపత్రులకు తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో మృతుల సంఖ్యపెరిగే అవకాశం వుంది. దాదాపు వంద మీటర్ల దూరం నుంచే లారీ అదుపు తప్పిన విషయాన్ని గమనించిన కూరగాయల వ్యాపారులు పరుగులు పెట్టారు. రంగంలోకి దిగిన పోలీసులు కూలిన చెట్టును జెసిబితో పక్కకు తొలగించారు. రోడ్డు ప్రమాదంలో చనిపోయిన స్థలంలో, మార్చురీ వద్ద రైతుల బంధువులు, కుటుంబ సభ్యులు రోదనలు కన్నీళ్లు పెట్టిస్తున్నాయి.

**ఓదార్చాన నాయకులు**

రోడ్డు ప్రమాదం జరిగిన సంఘటన నుంచి తెలుసుకున్న వెంటనే చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ వద్దకు ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి, బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఓదార్చా పట్లోళ్ల కార్తిక్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన బీమ్ భరత్, మాజీ ఎమ్మెల్యే రత్నం, తదితరులు సంఘటన గురించి తెలుసుకుని, మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. కాగా ఘటనా స్థలానికి సుమారు కిలోమీటరు దూరంలోనే ఆదివారం కారు, లారీ ఢీకొన్న ఘటనలో బిడిఎల్ ఉద్యోగి,అతని భార్య మృతి చెందారు.

## దుష్టపాలన ఫలితమే

(మొదటి పేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా నిరసనలు జరపాలని, అదేరోజును డిమాండ్స్ డేగా పాటించాలని సమావేశం తీర్మానించింది. దేశవ్యాప్తంగా నిరసనలు జరపాలని, అదేరోజును ప్రపంచ మానవహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'డిమాండ్స్ డే'గా కూడా పాటించాలని సమావేశం పిలుపునిచ్చింది. దేశంలో పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, అసమానతలతో పాటు స్థూల జాతీయోత్పత్తి క్షీణత వంటి ఆర్థిక సమస్యలు ప్రస్తావిస్తూ డిమాండ్స్ డేను నిర్వహించాలని, దేశంలో బిజెపి దుష్టపరిపాలన, క్షీణిస్తున్న ఆర్థిక పరిస్థితులపై ప్రజలను చైతన్యవంతులను చేసే ప్రచారంగా ఈ నిరసన దినాన్ని పాటించాలని తీర్మానం చేశారు. మణిపూర్ పరిస్థితులపై పార్లమెంటులో చర్చ జరపాలనీ, సాయుధబలగాల ప్రత్యేక అధికారాల చట్టం (ఎఎఫ్‌ఎస్‌పిఎ)ను ఉపసంహరణకు అత్యున్నత చట్టసభల్లో డిమాండ్ చేయాలని సమావేశం తీర్మానించింది.

**ఢిల్లీలో నిర్మాణ కార్మికులకు ఆర్థిక సహాయం**

ఢిల్లీలో కాలుష్యాన్ని అరికట్టేందుకు నిర్మాణ కార్యకలాపాలపై నిషేధం విధించటంతో అక్కడ నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారు. వారు ఉద్యోగాలు, వేతన నష్టాలకు గురవుతున్నారు. అందువల్ల నిర్మాణ కార్మికులకు తగిన ఆర్థిక సహాయం చేయాలని జాతీయ సమితి డిమాండ్ చేస్తూ తీర్మానం చేసింది.

**మణిపూర్ ప్రభుత్వం దిగిపోవాలి**

మణిపూర్‌లో జరుగుతున్న పరిణామాల్లో ఎలాంటి మార్పులేదు. ఉద్రిక్తతలు యథాతథంగా కొనసాగుతున్నాయి. ఇప్పటివరకూ 60,000 మంది పైగా ప్రజలు శరణార్థి శిబిరాల్లో తలదాచుకున్నారు. మణిపూర్‌లో శాంతి భద్రతలు రోజురోజుకూ క్షీణించిపోతున్నాయి.ఈ పరిణామాలన్నీ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని స్పష్టంగా తెలుస్తున్నది. అందువల్ల మణిపూర్ ప్రభుత్వం రాజీనామా చేయాలని కూడా సమావేశం తీర్మానించింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎంఎన్‌ఆర్‌ఇజిఎ) పథకం అమలులో ఎన్నో లొసుగులు, లోపాలు ఉన్నాయి. ఈ పథకం కింద ఉన్న అర్హులైనవారిజాబితా నుండి లక్షలాదిమంది కార్మికుల పేర్లు తొలగించారు. అదేవిధంగా ఆధార్‌కార్డుల్లో తలెత్తిన సమస్యలవల్ల వేలాదిమంది కార్మికులకు వేతనాలు ఇవ్వడానికి తిరస్కరిస్తున్నారు. ఈ లొసుగులన్నింటినీ సరిదిద్దాలి. ఈ పథకం కింద కార్మికులకు రోజుకు ఒక్కొక్కరికీ రూ. 700 లు వంతున సంవత్సరానికి కనీసం 200 రోజులు పని ఇవ్వాలని సమావేశం తీర్మానం చేసింది.

**బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై మతహింస**

బంగ్లాదేశ్‌లో హిందువులు, ఇతర మైనారిటీ వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఇటీవల చెలరేగుతున్న హింసాత్మక ఘటనలపట్ల సిపిఐ జాతీయ సమితి సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. విద్వేషం రెచ్చగొట్టి కయ్యానికి కాలుదువ్వే ఈ విధమైన చర్యలు కేవలం లౌకిక సూత్రాలతోపాటు, సమానత్వం, న్యాయాలను ఉల్లంఘించడం మాత్రమేకాదు, బంగ్లాదేశ్ భిన్నమత సమాజ సహజీవన స్థిరత్వానికీ, మతసామరస్యతకూ కూడా పెద్ద బెడదగా మారుతుంది. అందువల్ల బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను ఆసరాగా చేసుకుని మనదేశంలో నిరసనల ముసుగులో మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకు మతోన్మాదశక్తులు లేదా అధికారపార్టీ చేసే ఎలాంటి ప్రయత్నాలనైనా అన్ని ప్రగతిశీల,అభ్యుదయ,లౌకికవాద శక్తులు వ్యతిరేకించాలని సిపిఐ జాతీయ సమితి సమావేశం మరో తీర్మానంలో పిలుపు ఇచ్చింది. పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు కూడా ఏవిధమైన మతఘర్షణలు జరగకుండా చూడాలని, అప్రమత్తంగా వ్యవహరించి వాటిని నివారించాలని సమావేశం కోరింది.

అదేవిధంగా, దేశంలో ప్రాజెక్టుల నిర్మాణాల కారణంగా నష్టపోయే ప్రజలకు పునరావాసం కల్పించాలని, ఉత్తరాఖండ్‌లో క్రూర జంతువుల బారిన పడి తీవ్రంగా నష్టపోయిన రైతులకు సహాయం అందించాలని కూడా సమావేశం తీర్మానాలు చేసింది.

# బైడెన్ పుత్రోత్సాహం: ట్రంప్ ప్రశ్నాస్త్రాలు



### ఒక్క కలంపోటుతో కొడుక్కి క్షమాభిక్ష



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తన కుమారుడు చేసిన తప్పులను ఒక్క కలంపోటుతో క్షమించేశారు. కుమారుడు హంటర్ బైడెన్ అక్రమ ఆయుధాల కొనుగోలు కేసులో దోషి అని న్యాయస్థానం తేల్చినప్పటికీ జో బైడెన్ మాత్రం క్షమాభిక్ష ప్రసాదిస్తూ ఒక ఫైలుపై సంతకం చేశారు. దీంతో దేశాధ్యక్షుడుగా ఎన్నికైన డోనాల్ ట్రంప్ ఆయనపై ప్రశ్నాస్త్రాలు సంధించారు. పైగా సొంతపార్టీ నుండి కూడా బైడెన్ నిర్ణయంపై విమర్శలు వెల్లువెత్తాయి. ''మీ కొడుక్కి క్షమాభిక్ష పెట్టుకుంటే మరి జైలులో మగ్గుతున్న నా కార్యకర్తలు, అభిమానుల సంగతేమిటని బైడెన్‌ను ట్రంప్ నిలదీశారు. జో బైడెన్ తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. దీనిని న్యాయవిరుద్ధమైన చర్యగా పేర్కొన్నారు. హంటర్ బైడెన్ గనుక తప్పు చేయకపోతే మరి క్యాపిటల్ భవనంపై దాడికేసులో శిక్షకు గురై జైలులో ఉన్న 'తనవాళ్ళు' సంగతి ఏమిటని ప్రశ్నించారు. 2021 జనవరి ఆరోతేదీన క్యాపిటల్ భవనంలో జోబైడెన్ విజయాన్ని ధృవీకరించి అధ్యక్షుడుగా ఖరారు చేసే తీర్మానంపై సంతకాలు చేసేందుకు కాంగ్రెస్‌పార్టీ సమావేశం జరుగుతుండగా ఉత్తర అమెరికాకు చెందిన పచ్చిమితవాదసంస్థ, నయా ఫాసిస్టు ఉగ్రవాద సంస్థ ''ప్రౌడ్ బోయిస్'' ఛైర్మన్, డెమొక్రటిక్‌పార్టీకి చెందిన హెన్రీ ఎన్రిక్ తరియో (40) నాయకత్వంలో వేలాదిమంది సమావేశ మందిరంలోకి దూసుకువెళ్ళారు. విధ్వంసం సృష్టించారు. ఈ కేసులో తరియోకు దేశద్రోహం, కుట్ర, కాంగ్రెస్ సమావేశానికి ఆటంకం కలిగించాడన్న నేరాలపై 23 ఏళ్ళు శిక్ష విధించారు. అతడితోపాటు మరో 1500 మంది కూడా ఆనాడు అరెస్టు అయ్యారు. హంటర్ బైడెన్‌కు క్షమాభిక్ష పెట్టిన తర్వాత 'వీరికి ఎందుకు న్యాయం జరగలేదు?' అని ట్రంప్ ప్రశ్నిస్తున్నారు.

న్యాయస్థానం ప్రక్రియలో తాను జోక్యం చేసుకోబోనని, చట్టం తనపని తాను చేస్తుందని ఐదునెలల క్రితం ప్రకటించిన దేశాధ్యక్షుడు బైడెన్ మాటతప్పి కుమారుణ్ణి దోషవిముక్తుణ్ణి చేయడంతో ఆయన తీవ్ర విమర్శలకు గురవుతున్నారు. ఒకవైపు ట్రంప్ అధ్యక్షుడుగా ఎన్నికైన వెంటనే ఆయనపై హష్ మనీ కేసులు, ఇతరకేసులను ఆయన పదవీకాలం పూర్తయ్యేవరకూ నిరవధికంగా వాయిదావేస్తూ న్యాయస్థానం కీలక ప్రకటన చేసిన కొద్దిరోజులకు బైడెన్ కూడా తన కుమారుడిపట్ల పక్షపాతం చూపించి ఏకంగా క్షమాభిక్ష పెట్టేశారు. అమెరికా ప్రజలు తనను అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నానన్నారు. అక్రమంగా ఆయుధాలు కలిగి ఉండటం, డ్రగ్స్‌కు ఎడిక్ట్ కావడం, కోట్లాదిరూపాయలు పన్నుల ఎగవేత వంటి అభియోగాలపై హంటర్ బైడెన్ కోర్టు విచారణలు ఎదుర్కొన్నారు. గడచిన జులైలోనే అక్రమ ఆయుధాలకేసులో న్యాయస్థానం హంటర్ బైడెన్ దోషి అని క్లారిటీ ఇచ్చింది. అతడికి శిక్ష పడేలోపే దేశాధ్యక్షుడు క్షమాభిక్ష ప్రకటించారు. కాగా కొలరాడోకు చెందిన డెమొక్రటిక్‌పార్టీ గవర్నర్ జరెడ్ పొలిస్ ఒక ప్రకటన విడుదల చేస్తూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం పదవి నుండి వైదొలగుతున్న బైడెన్‌కు, డెమొక్రటిక్‌పార్టీకీ కూడా కళంకం తెస్తుందని ఆయన విమర్శించారు. బైడెన్ రాజకీయ జీవితం ముగింపు దశలో ఉన్న తరుణంలో ఆయన మూల్యం చెల్లిస్తున్నారని విమర్శలు చెలరేగాయి.

ప్రపంచం

# గినియా ఫుట్‌బాల్ మ్యాచ్‌లో హింస

### పిల్లలు సహా 100 మందికిపైగా మృతి



**ఎన్‌జెరికోర్:** ఆఫ్రికాదేశం గినియాలో స్థానిక జట్లమధ్య ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంగా అభిమానులమధ్య హింసాత్మక ఘర్షణ, అనంతరం తొక్కిసలాట జరిగింది. దీంతో 100 మందికిపైగా మరణించారు. అనేక మంది ఆసుపత్రులలో చికిత్సపొందుతున్నారు. గినియా ప్రభుత్వం సోమవారం నాడు ఈ మేరకు ఒక ప్రకటన చేసింది. గినియా సైనిక నాయకుడు మామదీ దౌమ్ బౌవ్య జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ ఫుట్‌బాల్ మ్యాచ్ చివరకు హింసకు దారితీసింది. ఈ ఘటనపై గినియా ప్రధానమంత్రి అమదౌ ఔరీ బా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా ఆయన ఒక పోస్టింగ్ పెట్టారు. ఈ హింసాత్మక దృశ్యాల వీడియో కూడా సామాజిక మాధ్యమాల్లో వచ్చింది. రిఫరీ తీసుకున్న వివాదాస్పద నిర్ణయంతో ఆదివారం మధ్యాహ్నం అభిమానుల మధ్య మొదట తీవ్ర వాగ్వాదం ప్రారంభమైంది. హింసకుముందు రిఫరీ విధానాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేస్తూ అనేకమంది గ్రౌండ్‌లోకి దూసుకువెళ్ళడం వీడియోల్లో కనిపించింది. పెనాల్టీ నిర్ణయం ఘర్షణకు దారితీసింది.ఈ హింసలో ఏడుగురు మరణించగా తర్వాత ప్రేక్షకులు భయంతో పరుగులు తీశారు. ఎత్తుగా గోడలమీదనుండి దూకి పారిపోయేందుకు అనేకమంది ప్రయత్నం చేశారు. దీంతో తొక్కిసలాట జరిగింది. పిల్లలుసహా 100 మందిపైగా మరణించారు. పశ్చిమ ఆఫ్రియాలోని రెండో అతిపెద్ద నగరం ఎన్‌జెరికోర్‌లోని స్టేడియం భారీసంఖ్యలో అభిమానులతో నిండిపోయింది. లబే–ఎన్‌జెరికోర్ స్థానిక ఫుట్‌బాల్ జట్లమధ్య ఈ మ్యాచ్ జరిగింది. దీంతో రెండు జట్లకు చెందిన అభిమానులు స్టేడియంకు భారీసంఖ్యలో తరలివచ్చారు. రెండు జట్లమధ్య ఒక గోల్‌కు సంబంధించి రిఫరీ ఇద్దరి వాదనలూ విన్నతర్వాత పెనాల్టీ విధించి తీసుకున్న వివాదాస్పద నిర్ణయంతో పరిస్థితి అదుపుతప్పింది. అభిమానులు రాళ్ళు రువ్వుకున్నారు. పోలీసులు మొదట పరిస్థితి అదుపు చేసేందుకు బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. 2021లో దేశాధ్యక్షుడు అల్ఫా కాండే ప్రభుత్వాన్ని కూల్చివేసి సైన్యం అధికారం చేపట్టింది. ఆఫ్రికాలో ప్రభుత్వాలు ఏర్పాటుచేయడంలో జాప్యం జరుగుతూ ఉండటంతో, మాలి, నిగర్, బుర్కినాఫాసో వంటి దేశాలలో సైనికులు అధికారం చేపడుతున్నారు. దీంతో పౌరసమాజం అల్లకల్లోలమవుతున్నది.

# వర్తమానానికి అనుగుణంగా చైనాలో మార్క్సిజం: జిన్‌పింగ్ ఉద్ఘాటన



**బీజింగ్ :** వర్తమాన ప్రాపంచిక పరిస్థితులకు, చైనాలో ఉన్న దేశీయ పరిస్థితులకు అనుగుణంగా మార్క్సిజాన్ని అనుసరించాలని ఆ దేశ అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ నొక్కి చెప్పారు.''కొత్త యుగానికి అనుగుణంగా మార్క్సిజం అధ్యయనం–సిద్ధాంత వర్తింపు'' అనే ప్రాజెక్టుకు సంబంధించి జరిగిన ఒక సదస్సులో జిన్‌పింగ్ మాట్లాడారు. ఈ ప్రాజెక్టును 20 సంవత్సరాల క్రితమే ప్రారంభించారు. చైనా కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి, చైనా సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఛైర్మన్ బాధ్యతలు నిర్వహిస్తున్న జిన్‌పింగ్ ఈ ప్రాజెక్టులో కీలకపాత్ర పోషిస్తున్నారు. సిద్ధాంత అధ్యయనం, పరిస్థితులకు అనుగుణంగా వర్తింపజేసే విషయంలో మార్గదర్శకత్వం వంటి విషయాలపై మాట్లాడారు. మార్క్సిజాన్ని వర్తింపజేసేందుకు ప్రజలలో సైద్ధాంతిక అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని జిన్‌పింగ్ అన్నారు. ఈ విషయంలో పార్టీ అనుసరిస్తున్న నవీన పద్ధతులను ప్రజలు అర్థం చేసుకునేందుకు, వారిలో అవగాహనపెంచేందుకు సైద్ధాంతిక పరిశోధనపైన ప్రజలకు సమాచారాన్ని చేరవేసే విధానాలపైన ఎక్కువగా కృషి చేయాలని కోరారు. మౌలికంగా చైనా దేశ లక్షణాలు, ప్రత్యేకమైన వాస్తవాలు, చైనా సంస్కృతితో మార్క్సిజంలోని మౌలిసూత్రాలను సమీకృతం చేసేందుకు ప్రాధాన్యం ఇవ్వాలన్న విషయాన్ని ఆయన తన ప్రసంగంలో పదే పదే నొక్కి చెప్పారు. చైనా తాత్వికత, సాంఘిక విజ్ఞానశాస్త్రాలకు ఒక సర్వస్వతంత్ర జ్ఞానవ్యవస్థ సత్వరాభివృద్ధి అత్యంత ముఖ్యమైన విషయమని ఆయన చెప్పారు. చైనా కమ్యూనిస్టుపార్టీ సెంట్రల్ కమిటీ సెక్రటేరియట్ సభ్యుడు సియా క్వీ సదస్సులో మాట్లాడుతూ, చైనాలో ఉన్న విలక్షణమైన వాస్తవాలతో ముడిపడిన సమస్యల పరిష్కారానికి మార్క్సిజంలోని మౌలిక సూత్రాల అధ్యయనం చేయాలని, ఈ అధ్యయనంపైనే ఎక్కువ దృష్టి పెట్టాలని కోరారు. గడచిన శుక్రవారం ఈ సమావేశం జరిగింది.

**పేదరికంపై పోరాటానికి చైనా ప్రణాళిక**

ఆకలి, పేదరికంపై పోరాటం చేసే ప్రపంచదేశాల కూటమిలో భాగస్వామ్యం కావాలని చైనా తన నిర్ణయాన్ని జి–20 సమావేశంలో తెలియజేసిందని, ఇందుకు సంబంధించిన ఒక ప్రణాళికను చైనా రూపొందించిందని చైనా అధికార వార్తాసంస్థ పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ఆకలి,పేదరికాలపై పోరాడేందుకు ఇప్పటికే శాస్త్రీయంగా రుజువైన ప్రభుత్వ విధానాలను, సామాజిక సాంకేతిక విధానాలను అమలు చేయడానికి వనరుల సేకరణ, అమలు కార్యాచరణ వివేచనపై , చొరవచూపించి ఒక ప్రణాళిక రూపొందించిందని పేర్కొంది.

ఈ విషయంలో చైనాకు ఉన్న చిత్తశుద్ధి ఏమిటో ప్రపంచవ్యాప్తంగా అమలు చేస్తున్న అనేక ప్రాజెక్టులే తార్కాణమని కూడా పేర్కొంది. ప్రపంచంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించామని 2021లో చైనా ప్రకటించింది. ఈ విధంగా బహిరంగ ప్రకటన చేసిన ఏకైక దేశం అదొక్కటే. ఈ విషయంలో చైనాకు ఉన్న అనుభవం, విజయం పేదరిక నిర్మూలనలో ప్రపంచదేశాలకు ఒక స్ఫూర్తిగా దోహదపడటమే కాకుండా, పేదరిక నిర్మూలనకు విలువైన సలహాలను, అనుభవాలను కూడా పంచిపెడుతుంది.

## 14 వేల పోస్టులు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్య శాఖలో మరో 6500 మందిని నియమించనున్నట్టు వెల్లడించారు. 'ప్రజాపాలన .. ప్రజా విజయోత్సవాలులో భాగంగా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన 'ఆరోగ్య ఉత్సవాలను ' డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సిఎం రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 213 నూతన అంబులెన్సులను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను సిఎం సందర్శించారు. ఆ తర్వాత 16 నర్సింగ్ కళాశాలను, రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లాల్లో ట్రాన్స్ జెండర్లకు 32 'మైత్రి ట్రాన్స్ క్లినిక్'లను ఆన్‌లైన్‌లో సిఎం ప్రారంభించారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు,ఫుడ్‌సెఫ్టీ ఆఫీసర్లకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ప్రయోజనాలు చేసే పనిలో తాము నిమగ్నమయ్యామని, తాను పనిపైన ఏకాగ్రత పెట్టానని, ఆ పనిని ఆపి ఇటు తిరిగితే అందరి పని చెబుతానని, అయితే తన పనిని ఆపితే, రాష్ట్రానికి నష్టం జరుగుతుందని అన్నారు.

**పదేళ్లలో అద్భుతాలు జరుగుతాయా...? :** గత పాలనలో వైఫల్యం చెందిన వాటిని సరిదిద్దుకుంటూ ముందుకెళ్తున్నామని, పది నెలల్లోనే అద్భుతాలు జరుగతాయా? అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉన్న గత సిఎం కనీసం 'జయ..జయహే' తెలంగాణ గానాన్ని కూడా ప్రజలకు అంకితం చేయలేకపోవడం ద్రోహం కాదా ? అని నిలదీశారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా ఆయనకు రాలేదా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చలేదని, ఉద్యోగులు, రైతుల సమస్యలను పట్టించుకోలేదని, తెలంగాణ సంస్కృతిని భద్రపర్చడంలో వైఫల్యం చెందిందని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం శాఖల వారీగా సమీక్షించి ఖాళీ పోస్టులను భర్తీ చేస్తుందని తాము ఆశించామని, కానీ పోటీపరీక్షలకు చెందిన ప్రశ్నపత్రాలను జిరాక్స్ సెంటర్లలో అమ్ముకున్నారని, గ్రూప్ పరీక్షలను వాయిదా వేశారని విమర్శించారు.

**రాజకీయ ప్రేరేపిత కృతిమ ఆందోళనలు చేపట్టారు**

డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేసినప్పుడు పరీక్షలు వాయిదా వేపించేందుకు కొందరు రాజకీయ ప్రేరేపిత కృతిమ ఆందోళనలు చేపట్టారని సిఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఇప్పటికే గత పదేళ్ల కాలంలో పోటీ పరీక్షలు వాయిదా వేశారని, మరోసారి పరీక్షలు వాయిదా వేస్తే నిరుద్యోగుల జీవితకాలం, సన్నగిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ల్‌సుఖ్‌నగర్, అశోక్‌నగర్ కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరిగితే అత్యంత విలువైన వయసు పోతుందని, 21 నుంచి 35 ఏళ్ల వయసులోనే భవిష్యత్‌పై నిర్ణయం తీసుకోవాలని, అలా చేయకపోతే 12 ఏళ్ల వయసు కాలగర్భంలో కరిగిపోతుందని సిఎం ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే తాము పట్టుదలతో పరీక్షలను నిర్వహించి, నియామకాలను చేపట్టామని వివరించారు. 13 ఏళ్ల తర్వాత గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించామని, కానీ ఈ పరీక్షలను కూడా వాయిదా వేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, గుడ్డుమీద ఈకలు పీకేందుకు రకరకాల వాదనలు వినిపించినప్పటికీ, అత్యున్నత న్యాయస్థానం వారి వాదనలను సమర్థించలేదని అన్నారు. టిజిపిఎస్‌సి ఛైర్మన్ మహేందర్ రెడ్డి దీక్షతో పరీక్షలను నిర్వహించారన్నారు. ప్రస్తుతం టిజిపిఎస్‌సి చైర్మన్ పదవిని ఒక నిరుపేద కుటుంబానికి చెందిన ఐఎఎస్ అధికారిని నియమించామని,తద్వారా ఆయన చిత్తశుద్ధితో పరీక్షలు నిర్వహించే అవకాశాలు ఉంటాయని వివరించారు. గత ప్రభుత్వం టిజిపిఎస్‌సిని రాజకీయ పునరావాస కేంద్రంగామార్చిందని, ఒక ఆర్‌ఎంపిని టిజిపిఎస్‌సి సభ్యునిగా నియమించారని, ఆ అధికారి గ్రూప్ అధికారులను ఎలా నియమిస్తారని ప్రశ్నించారు.

**సన్న వడ్లకు రూ.500ల బోనస్ ఇస్తాం**

తమ ప్రభుత్వాన్ని ఎవరు అడ్డుకున్నప్పటికీ, కాళ్లల్లో కట్టెలు పెట్టినా, రాబోయే పదేళ్ల పాటు తామే అధికారంలో ఉంటామని, సన్న వడ్లు పండించిన రైతులకు రూ. 500ల బోనస్ ఇస్తామని సిఎం రేవంత్ రెడ్డి హామీనిచ్చారు. సన్నవడ్లకు రూ.500ల బోనస్ ఇవ్వడం ద్వారా తనకు రూ. 30వేల ఆదాయం అదనంగా వచ్చిందని ఒక కౌలు మహిళా రైతు ఆనందం వ్యక్తం చేసిందన్నారు. రూ. 21వేల కోట్లతో రైతు రుణమాఫీ చేశామని, రైతుల ఖాతాలో కాసులు గలగల అంటుంటే కొంత మంది గుండెల్లో పిడుగు పడి, ఫామ్‌హౌస్‌లో ఉన్నవారు బాధపడుతున్నారని, ఆ బాదకు మందు లేదని ఎద్దేవా చేశారు. రైతులకు సంక్రాంతి తర్వాత రైతుభరోసా ఇస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు.

**ఈ వార్తను బాక్స్‌లో వాడుకోగలరు**

సర్పంచ్ ఎన్నికల్లో దూ.దూ బస్వన్నలు వస్తారు..: సిఎం సంక్రాంతి పండగ ముందు గంగిరెద్దులు దూ..దూ బస్వన్నలతో వచ్చినట్టు, రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో కొందరు దూ..దూ బస్వన్నలు వస్తారని, వారి జోలెలో బిక్ష పడగానే వెళ్లిపోతారని, వారికి ఓట్లు తప్ప, రైతులు, ప్రజల కష్టాలు తెలియదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజలను ఆదుకోవాలనే ఆలోచన కూడా వారికి రాదని, వారు ఎన్ని సన్నాయిలు నొక్కినా, గంగిరెద్దులతో ఎన్ని దండాలు పెట్టించినా, వారి లక్ష్యమంతా సర్పంచ్ ఎన్నికల్లో ఓట్లు తప్ప, వారికి ఏదీ పట్టబోదని తెలిపారు. ఈ నెల 7,8,9న తెలంగాణ రాష్ట్ర ఉత్సవాలను రంగ రంగ వైభోవంగా నిర్వహించుకోబోతున్నామన్నారు. ఈ సందర్భంగా చేపట్టే 'తెలంగాణ కార్నివాల్ 'లో వంటలను ఆస్వాదించాలని, తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి ఎలుగెత్తి చాటుదామని, మన కళలు, కళాకారులు గొప్పతనాన్ని చాటాలని, తెలంగాణ అంటేనే ఇదిరా అనేలా చేస్తామని, ఈ ఉత్సవాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.

**బిజెపి, బిఆర్‌ఎస్‌లను దూరంగా పెడితేనే రాష్ట్రం బాగుపడుతుంది : భట్టి విక్రమార్క**

భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ అభివృద్ధిని చూసి తట్టుకోలేకనే ప్రజలను రెచ్చగొట్టి, రాజకీయంగా బతకాలని ప్రయత్నిస్తున్నారని,బిజెపి,బిఆర్‌ఎస్‌ను దూరంగా పెడితేనే రాష్ట్ర బాగుపడుతుందని అన్నారు. అడడ్డగోలుగా ప్రజలను రెచ్చగొట్టాలని ప్రయత్నిస్తే, చూస్తూ ఉరుకునేందుకు తాము సిద్ధంగా లేమని హెచ్చరించారు. వైద్యం, విద్య రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కళ్ల లాంటివని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖకు ప్రతి నెలా టంచనుగా నిధులను విడుదల చేస్తున్నామని, వైద్య ఆరోగ్య శాఖపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గత పదేళ్లు ఆరోగ్యశ్రీని, ప్రభుత్వ ఆస్పత్రులను, నియామకాలను, మందులను పట్టించుకోలేదని, ప్రజా ఆరోగ్యాన్ని గాలికి వదిలి పెట్టి, ఇప్పుడు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండపిడ్డారు. ప్రభుత్వం చేపడుతున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి తట్టుకోలేక అధికారం కోల్పోయినవారు రోడ్లపైకి వస్తున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందని ప్రశ్నించారు. రకరకాల హామీలతో అధికారం లోనికి వచ్చిన బిజెపి, వాటిని అమలు చేయకుండా, రాష్ట్ర ప్రభుత్వ ఏడాది పాలనలోనే వారు రోడ్లపైకి వస్తున్నారని దుయ్యబట్టారు. దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలోని వ్యాదులకు 22 శాతం వైద్య ఖర్చులను పెంచామన్నారు. ప్రైవేటు ఆస్పత్రులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి చట్టాన్ని అమలు చేయాలని సూచించారు. రాబోయే కాలంలో మరో 70,80 అంబులెన్సులను తీసుకొస్తామని, ఎమర్జెన్సీ సమయాన్ని పది నిమిషాలకు తీసుకొస్తామన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులనూ భర్తీ చేస్తామని హామీనిచ్చారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆరోగ్యకరంగా ఉండేలా ప్రజలు కూడా తమ ఆహార అలవాట్లను మార్చుకోవాలని సూచించారు.

## తొలగిన ప్రతిష్టంభన

(మొదటి పేజీ తరువాయి)

నాయకులతో స్పీకర్ ఓం బిర్లా సమావేశమయ్యారు. ఈ భేటీకి గౌరవ్ గొగొయ్(కాంగ్రెస్), టి.ఆర్.బాలు(డిఎంకె), కల్యాణ్ బెనర్జీ(టిఎంసి), కేంద్ర మంత్రులు కిరెన్ రిజిజూ, అర్జున్ మేఘ్‌వాల్‌లు హాజరయ్యారు. రాజ్యాంగం సభ ఆమోదం తెలిపి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక చర్చ జరగాలని స్పీకర్ సమావేశానికి హాజరైన ప్రతిపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. దీనికి అధికార పక్షం అంగీకారం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజూ మీడియాకు వెల్లడించారు. మంగళవారం నుంచి సమావేశాలు సాఫీగా సాగుతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న అంశాలపై చర్చించే విషయం గురించి ప్రస్తావించగా, నిబంధనల ప్రకారం వాటిపై నిర్ణయం ఉంటుందని కిరెన్ రిజిజూ వెల్లడించారు. సంభాల్ ఘటనను లేవనెత్తేందుకు సమాజ్‌వాదీ పార్టీకి, షేక్ హసీనా ప్రభుత్వ పడిపోయిన తరువాత బంగ్లాదేశ్‌లో చోటు చేసుకుంటున్న పరిణామాలను లేవనెత్తేందుకు తృణమూల్ కాంగ్రెస్‌కు అవకాశం కల్పించనున్నట్లు సమాచారం.

**సభ నడవాలని ప్రభుత్వానికే లేదు : కాంగ్రెస్**

పార్లమెంటు సమావేశాలు నడవాలని ప్రభుత్వానికే లేదని, అందుకే అదానీ, సంభాల్, మణిపూర్ అంశాలపై చర్చ పెట్టకుండా పారిపోతుందని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ ఆరోపించారు. సోమవారం ఉభయ సభలు వాయిదా పడ్డాయిని, ఇండియా కూటమి పార్టీలు తక్షణమే అదానీ, మణిపూర్, సంభాల్, అజ్మేర్ అంశాలపై తక్షణమే చర్చించాలని కోరుతూ నోటీసులు ఇచ్చాయని, కాని సభలో ఆందోళన చేయలేదని, నినాదాలు ఇవ్వలేదని, కానీ, మోదీ ప్రభుత్వానికి పార్లమెంటు నడవడం ఇష్టం లేదని విమర్శించారు. రాజ్యాంగాన్ని ఆమోదించి నవంబర్ 26న 75 సంవత్సరాలైన సందర్భంగా రాజ్యాంగంపై చర్చ జరపాలని ఇండియా కూటమి పార్టీలు కోరాయని గుర్తుచేశారు.

## బొమ్మగాని ప్రభాకర్

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన ఐఎఎల్ రాష్ట్ర ద్వితీయ మహాసభలలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. రాష్ట్ర కమిటీలో పోట్ల మాధవరావును శాశ్వత ఆహ్వానితులుగా తీసుకున్నారు. ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కె.వి.ఎల్., దుస్సా జనార్ధన్, ఎం.ఆదిరెడ్డి, పి.పట్టాభి, పి.రాములు, గుర్రం రాజశేఖర్ రెడ్డి, కె.నాగేశ్వరరావు, రహీం ఎన్నికయ్యారు. అలాగే రాష్ట్ర కార్యదర్శులుగా ఓరుగంటి శేషగిరిరావు, డి.జయశ్రీనివాస్, బొమ్మగాని శ్రీనివాస్, బాగం మాధవరావు, బి.పరమేశ్ గౌడ్, గంజి గణేశ్, ఎస్.కె.లతీఫ్, బత్తిని రాము, గట్టు నరసింహారావు, అనంతరెడ్డిలను ఎన్నుకున్నారు. వివిధ జిల్లాల ప్రాతినిధ్యంలో మొత్తం 75 మందితో ఐఎఎల్ నూతన రాష్ట్ర కమిటీ ఎన్నికైంది. మహాసభకు 385 మంది ప్రతినిధులు, 80 మంది పరిశీలకులు హాజరయ్యారు. న్యాయవాదులు రక్షణ చట్టం తీసుకురావాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదులు సంక్షేమానికి నిధులు కేటాయించాలని, బార్ అసోసియేషన్ హాల్‌లను ఆధునీకరించాలని, న్యాయవాదులకు ప్రత్యేకించి మహిళా న్యాయవాదులకు సౌకర్యాలు కల్పించాలని, క్రెచ్‌లను ఏర్పాటు చేయాలని, జూనియర్ న్యాయవాదుల స్టయిఫండ్ మొత్తాన్ని పెంచాలని, సీనియర్ న్యాయవాదులకు పెన్షన్ పథకం ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టులను భర్తీ చేయాలని, కేసులు, జనాభా ప్రాతిపదికన జడ్జి పోస్టులను పెంచాలని, సామాజిక న్యాయం పాటించాలని, న్యాయవాదుల నుంచి జిపి, పిపి నియామకాలలో ప్యానల్ పోస్టింగ్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ ఐఎఎల్ రాష్ట్ర మహాసభ పలు తీర్మానాలు చేసింది. దేశం , రాజ్యాంగ పరిరక్షణ, న్యాయవాదుల సంక్షేమం, రక్షణ లక్ష్యాలతో ఐఎఎల్ ముందుకు సాగుతుందని పిలుపునిచ్చింది.

## మృత్యు ఒడికి...

(మొదటి పేజీ తరువాయి)

చేసుకుంది. మధ్యప్రదేశ్‌కు చెందిన హర్ష వర్ధన్ (26) సివిల్స్‌లో మంచి ర్యాంక్ సాధించి ఐపిఎస్ ఎంచుకున్నారు. కర్ణాటక కేడర్‌లో ఐపీఎస్‌కు ఎన్నికైన అతను.. మైసూరులోని కర్ణాటక పోలీస్ అకాడమీలో తన నాలుగు వారాల శిక్షణను పూర్తి చేసుకున్నారు. ఈ క్రమంలో హసన్ జిల్లాలో ప్రొబేషనరీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా అతనికి తొలి పోస్టింగ్ వచ్చింది. సోమవారం డ్యూటీలో రిపోర్ట్ చేయాల్సి ఉంది. దీంతో అతను ఆదివారం రాత్రి అక్కడికి పయనమయ్యారు. ఇంతలో మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో వెంటాడింది. సోమవారం తెల్లవారుజామున ఆయన ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. కారు టైరు ఒక్కసారిగా పేలింది. అనంతరం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఇంటిని, ఆపక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో హర్ష వర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అయితే, ప్రమాద తీవ్రత కారణంగా అతను చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. డ్రైవర్ మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

## దారుణ హత్య

(మొదటి పేజీ తరువాయి)

ప్రేమ వివాహం చేసుకుంది. సోమవారం ఉద యం రాయపోల్ గ్రామం నుండి నాగమణి విధుల నిమి త్తం హయత్‌నగర్ బయలుదేరింది. ప్రేమ వివాహం నచ్చని నాగమణి తమ్ముడు పరమేశ్ అమెపై కక్ష్యకట్టాడు. ఈ క్ర మంలోనే నాగమణి స్కూటీపై వెళ్తుండగా రాయపోల్ కరెంటు జంక్షన్ వద్ద కారుతో వేగగంగా ఢికోట్టాడు. స్కూటీపై నుండి కింద పడిన అక్కను అక్కిక్కక్కడే అత్యంత కిరాతకంగా నరికి చంపాడు. ఈ విషయం నియోజకవర్గం లో సంచలనం రెపింది. నిందితుడు పరమేశ్ ఇబ్రహింపట్నం పోలీస్‌స్టేషన్‌లో లోంగిపోయాడు. కాగ ప్రే మ వివాహమే కారణమా లేక ఆస్థి కోసమే ఈ అత్య చేశా డా అనే విషయాల పై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గత 15 రోజుల క్రితం ఆస్థి విషయంలో గోడవ జరిగినట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో..

# తెలుగు విశ్వవిద్యాలయం పనిచేస్తుంది

నూతన క్యాంపస్ ప్రారంభంలో పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్ బాబు

విశ్వవిద్యాలయ అభివృద్ధికి రూ.కోటి విరాళం అందించిన పద్మభూషణ్ వరప్రసాద రెడ్డి

ఘనంగా సన్మానించిన పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ





**ప్రజాపక్షం / హైదరాబాద్ / దుండిగల్ :** అంతర్జాతీయ స్థాయిలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పనిచేస్తుందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. హైదరాబాద్ శివారు బాచుపల్లిలో నిర్మించిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నూతన క్యాంపస్‌ను సోమవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. 100 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఏర్పాటైన ఈ యూనివర్సిటీ నిర్మాణానికి ఇప్పటి దాకా రూ.35కోట్లు వ్యయం చేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం 39వ వ్యవస్థాపక దినోత్సవాలను కూడా మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. విశ్వవిద్యాలయ విద్యార్థులకు కంప్యూటర్ల వినియోగంలో ప్రావీణ్యం కోసం 100 కంప్యూటర్లను కేటాయించనున్నట్టు శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. కృత్రిమ మేథలో విద్యార్థులు ప్రావీణ్యం సంపాదించుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులు డిగ్రీలు పూర్తి చేసుకునేలోగా వారికి ఇష్టమైన రంగంలో నైపుణ్య శిక్షణ అందిస్తామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపైనే సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల వారసత్వాన్ని భావితరాలకు అందించే లక్ష్యంతోనే తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పద్మభూషణ్ వరప్రసాద రెడ్డికి విశిష్ట పురస్కారంను మంత్రి శ్రీధర్ బాబు అందజేశారు. పురస్కారంతో పాటు లక్ష రూపాయల నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అభివృద్ధికి వరప్రసాదరెడ్డి కోటి రూపాయల విరాళం ప్రకటించి చెక్కును యూనివర్సిటీ ఉప కులపతికి అందించారు. విశ్వవిద్యాలయం విద్యార్థుల చిత్రలేఖనం ప్రతిభను అమెరికా, మలేషియా దేశాల్లో ఏర్పాటు చేసిన ప్రదర్శనల్లో చూశామని, ఇప్పటిదాక విశ్వవిద్యాలయ కీర్తిని చాటుతూ, తెలుగు భాష ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటుతూ వచ్చిన మహనీయులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతి నిత్యానందరావు నేతృత్వంలో ఇంకా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపాలిటి మేయర్ కొలను నీలాగోపాల్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ గౌతం పొట్రు, అడిషనల్ కలెక్టర్ రాధిక, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎండి సాబేర్ అలీలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రేపు పెద్దపల్లిలో సిఎం సభ

## 'యువ వికాసం'పై సిఎస్ సమీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పెద్దపల్లిలో బుధవారం నిర్వహించే 'యువ వికాసం' సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై దాదాపు 9000 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందచేస్తారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి తెలిపారు. ఈ సభా ఏర్పాట్లపై సోమవారం సంబంధిత అధికారులు, జిల్లా కలెక్టర్లతో శాంతికుమారి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా విజయోత్సవాలలో భాగంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో యువత కై ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ సభలో ఇటీవల గ్రూప్ ఫోర్‌తో పాటు ఎంపికైన సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, సింగరేణిలో ఉద్యోగాలు పొందిన వారికి ముఖ్యమంత్రి నియామక పత్రాలను అందచేస్తారని వివరించారు. ఈ సభలోనే స్కిల్ యూనివర్సిటీలో భాగస్వామ్యమయ్యే ఏడు ఏజెన్సీలతో ఒప్పంద పత్రాలపై సంతకం, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ప్రారంభోత్సవం, సిఎం కప్ ప్రారంభంలతో పాటు వందలాది కోట్ల రూపాయల విలువైన అనేక కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వెల్లడించారు. వివిధ రంగాల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలను తెలియచేసే దాదాపు పలు స్టాళ్లను ఈ సభా వేదిక వద్ద ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ సభకు హాజరయ్యేవారికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. బస్సుల్లో వచ్చే వారు మధ్యాహ్నం రెండున్నర గంటలకు వేదిక వద్దకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

## ప్రపంచ పారిశ్రామిక పెట్టుబడులకు

# ఆకర్షణ శక్తిగా తెలంగాణ

* వ్యాపార అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తాం

* సిద్దిపేట జిల్లా బండతిమ్మాపూర్‌లో 2091 కోట్లతో నిర్మించిన కోకకోలా ఫ్యాక్టరీని ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి





**ప్రజాపక్షం/ సిద్ధిపేట ప్రతినిధి :** హిందూస్థాన్ కోకాకోలా బెవరేజేస్ (హెచ్‌సిసిబి) అత్యాధునిక గ్రీన్ ఫీల్డ్ ఫ్యాక్టరీని సిద్దిపేట జిల్లా బండ తిమ్మాపూర్‌లో సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. 2091 కోట్ల పెట్టుబడిలో 49ఎకరాల్లో ఫ్యాక్టరీని నిర్మించనున్నారు. తెలంగాణ వ్యాప్తంగా 3798 కోట్ల పెట్టుబడితో పాటుగా వెయ్యి మందికి ఉపాధి కల్పించేందుకు హెచ్‌సిసిబి అవకాశం కల్పించనుందన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఫ్యాక్టరీ ప్రతినిధులతో కలసి కంపెనీని పరిశీలించారు. కంపెనీ అన్ని విభాగాలను కలియతిరిగి పరిశీలించిన అనంతరం కార్మికులతో సిఎం రేవంత్‌రెడ్డి ముచ్చటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సిఎం ఎనుమల రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బండతిమ్మాపూర్ హెచ్‌సిసిబి పెట్టుబడులు, ప్రపంచ పారిశ్రామిక పెట్టుబడులకు ఆకర్షణ శక్తిగా వెలుగొందుతున్న తెలంగాణ ఖ్యాతి నొక్కి చెపుతుందన్నారు. వ్యాపార అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించేందుకు తాము కట్టుబడి ఉన్నట్లు వెల్లడించారు. సమగ్ర విధానం అనుసరిస్తున్న హెచ్‌సిసిబిని తాము ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. ఇది ఉద్యోగాలను తెస్తుందని, కమ్యూనిటీలను ఉద్ధరిస్తుందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి గణనీయంగా దోహదపడుతుందన్నారు. రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ బండితిమ్మాపూర్‌లో హెచ్‌సిసిబి పెట్టుబడులు పారిశ్రామిక అభివృద్ధి, పర్యావరణం కలసి ఎలా సాగుతాయని అనే దానికి ఒక ప్రధాన ఉదాహరణగా నిలుస్తాయన్నారు. ఈ అత్యాధునిక గ్రీన్‌ఫీల్డు ఫ్యాక్టరీ తెలంగాణ పారిశ్రామిక ప్రకృతి దృశ్యానికి ప్రధాన జోడింపుగా నిలుస్తుందన్నారు. ఈ ప్రాంతం కోసం పర్యావరణ అనుకూల వృద్ధి, సంపదకు తోడ్పడుతుందన్నారు. రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బండతిమ్మాపూర్ హెచ్‌సిసిబి గ్రీన్‌ఫీల్డ్ సదుపాయం పారిశ్రామిక పురోగతి, సమాజ అభివృద్ధికి మధ్య సమన్వయానికి ఉదాహరణగా నిలుస్తుందన్నారు. నైపుణ్యం కలిగిన ఉపాధిని సృష్టించటం, యువత, మహిళలు, గ్రామీణ వర్గాలకు సాధికారత కల్పించే కార్యక్రమాల్లో ఏకీకృతం చేయటం ద్వారా ఈ పెట్టుబడి పర్యావరణ అనుకూల, సమ్మిళిత వృద్ధికి కేంద్రంగా తెలంగాణ స్థానాన్ని బలోపేతం చేస్తుందన్నారు. రాష్ట్ర ఆటవీశాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ పర్యావరణ అనుకూల పారిశ్రామిక వృద్ధికి ఇది గొప్ప ఉదాహరణ అన్నారు. పునరుత్పాదక ఇంధనం, నీటి పునర్వినియోగం వంటి పర్యావరణ అనుకూల సాంకేతికతలను ఏకీకృతం చేయటం ద్వారా, ఈ ఫ్యాక్టరీ తెలంగాణ పర్యావరణ బాధ్యత కలిగిన తయారీకి ఒక ప్రమాణానికి నిర్దేశిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హిందూస్థాన్ కోకాకోలా బెవరేజేస్ సిఇఒ జువాన పాబ్లో రోడిగ్జ్ మాట్లాడుతూ హెచ్‌సిసిబి వృద్ధి ప్రయాణంలో ఈ ఫ్యాక్టరీ ఏర్పాటు ముఖ్యమైన అడుగు అన్నారు. తెలంగాణ పట్ల మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, పోలీస్ కమిషనర్ అనురాధ, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డిది రెండు నాల్కల ధోరణి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిఎం రేవంత్‌రెడ్డిని నమ్మితే అన్న వస్త్రానికి పోతే, ఉన్న వస్త్రం పోయినట్టుగా మారిందని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. ప్రజలకు మాటిస్తే నిలబెట్టుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి రెండు నాల్కల వైఖరికి నిలువెత్తు నిదర్శనమన్నారు. జనవరి 17 తర్వాత రైతు బంధు ఇస్తానని చెబుతున్న సిఎం రేవంత్ రెడ్డి, ఈ ఏడాది పాటు ఏంచేశారని ప్రశ్నించారు. ఎల్ఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి రూ.15వేల కోట్లను ముక్కుపిండి వసూలు చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని, ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు నియమిస్తామని చెప్పి ఇవ్వలేదని, జాబ్ లెస్ క్యాలెండర్‌ను విడుదల చేశారని ఆయన ఆరోపించారు. ఏడాది పాలనలో కూల్చిన ఇళ్లే ఎక్కువగా ఉన్నాయని, కొత్తగా నిర్మించినవి ఒక్కటి కూడా లేదన్నారు. నాడు గ్రామానికి ఒక బెల్ట్ షాపు ఉంటే, ప్రస్తుతం గల్లీ గల్లీకి షాపులు వచ్చాయని తెలిపారు. కోకాకోలా కంపెనీకి కూడా కాళేశ్వరం నుండే నీళ్లు వస్తున్నాయన్నారు. గతంలో తమ ప్రభుత్వంలో ప్రకటనలు ఇస్తే ఎవరి సొమ్ము అని ప్రశ్నించిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఎవరి సొమ్ముతో ప్రకటనలు ఇస్తున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఏడాది పాలనలో నిర్బంధాలు, అణిచివేతలు, లాఠీఛార్జీలు, కంచెలు, ఆంక్షలు నిత్యకృత్యమయ్యాయని ఆరోపించారు. ప్రజాస్వామ్యం, రైతు బంధు, కెసిఆర్ కిట్లు ఇలా ఎన్నో మోసపోయామని తెలంగాణ ప్రజలకు ఈ ఏడాది కాలంలో అనుభవంలోకి వచ్చిందని హరీశ్ రావు అన్నారు.

# ఎఎన్ఎం పోస్టుల సంఖ్య పెంచాల్సిందే

పరీక్షకు అర్హత వయస్సు దాటిన వారికి న్యాయం చేయాలి

ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్

ఎన్‌హెచ్ఎం డైరెక్టర్ కార్యాలయం ముందు ధర్నా



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఇటీవల మెడికల్, హెల్త్ రిక్రూట్‌మెంట్ సర్వీసెస్ బోర్డ్ ప్రకటించిన ఎఎన్ఎంల పరీక్షకు సంబంధించి ఇప్పుడున్న 1931 పోస్టులకు అదనంగా పోస్టులను పెంచాలని, వయస్సు రీత్యా పరీక్షకు అర్హత లేని ఎన్‌హెచ్ఎం సిబ్బందికి 100 శాతం గ్రాస్ శాలరీతో పాటు రూ.10లక్షల లైఫ్‌టైమ్ గ్రాట్యుటీని ఇవ్వాలని ఎఐటియుసి రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ కోఠిలోని నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం జరిగిన రెండవ ఎఎన్ఎంల ధర్నాను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. గత 18ఏళ్లుగా ఎన్‌హెచ్ఎంలో అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న వారి సేవలను ప్రభుత్వం అనేక రకాలుగా ఉపయోగించుకుందన్నారు. ముఖ్యంగా కరోనా కష్టకాలంలో వారి సేవలను విశేషమైనవని, 18ఏళ్లు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసి చివరికి రిటైర్‌మెంట్ సమయంలో ఖాళీ చేతులతో ఆనెల జీతం మాత్రమే తీసుకుని ఇంటికి వెళ్లాల్సిన దయనీయమైన పరిస్థితి కాంట్రాక్టు ఉద్యోగులకు ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బేషరతుగా రెగ్యులర్ చేయాలని ఎఐటియుసి చేసిన పోరాటం ఫలితంగా నోటిఫికేషన్‌లో కొన్ని పోస్టులను పెంచినట్లు ఆయన గుర్తుచేశారు. రూ.4వేల జీతం నుండి పనిచేశారని, తొలి రోజుల్లో పూట కూడా గడవక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సంగతి మర్చిపోవద్దన్నారు. అతి తక్కువ వేతనంతో ప్రభుత్వానికి వారు చేసిన సేవల వల్లనే వారికి వెయిటేజీ ఇచ్చిందని, అది భిక్ష లేదా కరుణ ఏమాత్రం కాదని నరసింహ స్పష్టం చేశారు. కొంత మంది అప్లికేషన్ పూర్తిచేసే సమయంలో కొన్ని పొరపాట్లు చేశారని, వాటిని సరిదిద్దుకోవడానికి ఎడిట్ ఆప్షన్స్‌ను తక్షణమే ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రెండవ ఎఎన్ఎంల సంఘం(ఎఐటియుసి) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తోట రామాంజనేయులు, అధ్యక్షురాలు జక్కుల పద్మ, ప్రధాన కార్యదర్శి బోయిని శ్యామల, ఉపాధ్యక్షులు తస్వీర్ సుల్తానా, కె.పద్మ, సరోజ, సహాయ కార్యదర్శులు లత, గోపమ్మ, సంధ్య, హారతి పాల్గొన్నారు.



## మారుపాక అనిల్ కుమార్‌కు చాడ వెంకట్‌రెడ్డి పరామర్శ

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** దుండగుల దాడిలో గాయపడిన తెలంగాణ రాష్ట్ర దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్‌ను సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలనర్సింహ, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్ పరామర్శించారు. మరుపాక అనిల్‌కుమార్‌పై జరిగిన దాడి వివరాలను, ఆయన ఆరోగ్య పరిస్థితిని చాడ వెంకట్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. మారుపాక అనిల్‌కుమార్ త్వరగా కోలుకోవాలని చాడ వెంకట్‌రెడ్డి ఆకాంక్షించారు. డిహెచ్‌పిఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు జెరిపోతుల కుమారస్వామి, సహాయ కార్యదర్శి పుల్లూరి ఆంజనేయులు తదితరులు అనిల్‌కుమార్‌ను పరామర్శించారు.

# 110 కోట్ల ఉచిత బస్ జర్నీ టికెట్లు ఇచ్చాం

ఎంఎల్‌సి జీవన్‌రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 110 కోట్ల ఉచిత బస్ టికెట్లు ఇచ్చామని ఎంఎల్‌సి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతుందన్నారు. బిజెపి ఉనికిని కాపాడుకోవడానికి తమ ప్రభుత్వం పై చార్జ్ షీట్ విడుదల చేశారని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు.. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా అమలు చేస్తున్నారా..? అని ప్రశ్నించారు. కనీస మద్దతు ధర కల్పించాల్సింది కేంద్ర ప్రభుత్వం.. దీనిపై ఇప్పటివరకు స్పందన లేదన్నారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా సన్న వడ్లకి 500 బోనస్ ఇస్తున్నాం అని గుర్తు చేశారు. "మద్దతు ధరకి కి చట్టబద్ధత కల్పించడం లేదు.. మీరా రైతుల గురుంచి మాట్లాడేది.." అని బిజెపి నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కోటి కుటుంబాలు ఉచిత కరెంట్ రాయితీ పొందుతున్నారన్నారు. ఏడాదికి 20వేల కోట్ల రూపాయలు సంక్షేమ కార్యక్రమాలకి ఇస్తున్నామని, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా రుణమాపి చేస్తున్నారా..? అని అడిగారు. యుపి ప్రభుత్వం హయాంలో సోనియాగాంధీ జాతీయ స్థాయిలో రుణమాపి చేసిందన్నారు. జాతీయ స్థాయిలో రుణమాఫీ చేసి ఉంటే రాష్ట్రానికి 20 వెల కోట్లు అదా అయ్యేవని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఇతర హామీలని కూడా అమలు చేస్తామని స్పష్టం చేశారు.బిజెపి నల్లధనం తీసుకొచ్చి ప్రతి కుటుంబానికి 10 లక్షలు వేస్తామన్నారు. ఇంకా నల్లధనం పెరిగిపోయిందని, తాము రైతుల రుణమాపి గురుంచి మాట్లాడుతుంటే.. బిజెపి అంబానీ, అదానీ అంటుందిని ఎద్దేవ చేశారు. వాళ్ళకి చేసే మాపి రైతులకి చేయండి.. దేశానికి అన్నం పెట్టేది రైతు అని అన్నారు. పెట్రోలియం, డీజిల్ రూ.70 ఉంటే ఇప్పుడు 100 పైనే ఉందన్నారు. తాము అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు బిజెపి రాష్ట్రాల్లో అమలు చేయండి అని అన్నారు.

# అంబేద్కర్ రథం ఆపేవారు మనువాదులే..

ఎంఆర్ పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ




**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** అంబేద్కర్ సామాజిక న్యాయ పోరాట వారసులు మాదిగలేనని, ఆయన ఆశయాన్ని వ్యతిరేకించే కొంతమంది మనువాదులు కాక మరి ఇంకేం అవుతారని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ప్రశ్నించారు. దేశ అత్యున్నత వ్యక్తికి కనీస గౌరవం ఇవ్వాలనే సోయి లేని మాలలు అంబేద్కర్ ఆశయాలను కొనసాగించేందుకు అర్హులు కారని పేర్కొన్నారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణకు అన్ని పార్టీలు మద్దతు ఇస్తే ఎందుకు అడ్డుకొంటున్నారని ప్రశ్నించారు. 1975లో కాంగ్రెస్ పార్టీ పంజాబ్‌లో వర్గీకరణ అమలు చేయాలని ప్రక్రియను ప్రారంభించిందని గుర్తుచేశారు. అగ్ర కులాల్లో అంబేద్కర్ వాదులు పెరిగారని, మాలల్లో మనువాదులు ఎక్కువయ్యారని పేర్కొన్నారు. తమ వైఖరి మార్చుకోకపోతే బిసిలతో, దళితుల్లో ఉన్న 59 కులాల్లో మాలలు ఒంటరి వారు కావడం ఖాయమని, తస్మాత్ జాగ్రత్త అంటూ హెచ్చరించారు. అంబేద్కర్ రథాన్ని అడ్డుతగిలే వారందరూ మనువాదులేనని తెలిపారు. ఎస్‌సి వర్గీకరణ చేపట్టడం రాష్ట్రాలకు ఉన్నదని ఈ ఏడాది ఏడుగురు జడ్జిలతో కూడిన ధర్మాసనం రాజ్యాంగ బద్ధమైన తీర్పు ఇచ్చిందని చెప్పారు. అయినా బిల్లుకు అడ్డు తగిలే తమరు దేనికి ఒప్పుకొంటారో చెప్పాలని మాల నేతలను మంద కృష్ణ డిమాండ్ చేశారు. అంబేద్కర్ ఫలాలను అందరికీ అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగే వారసులు మాదిగలేనని మందకృష్ణ స్పష్టంచేశారు.


# ఇక మెరుపు వేగంతో ప్లాన్‌ల స్క్రూటినీ

వేగవంతంగా భవన, లేఔట్‌ల అనుమతులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇక భవన నిర్మాణ, లేఔట్ అనుమతులు జెట్ స్పీడ్‌లో మంజూరు కానున్నాయి. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే మెరపు వేగంతో ప్లాన్ స్క్రూటినీ విధానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. నిర్మాణ అనుమతుల మంజూరులో సులభతరంతో పాటు వేగవంతమైన ఏకీకృత విధానాన్ని తీసుకొచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేసేందుకు మున్సిపల్ శాఖ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తలమునకలయ్యారు. రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో, భౌతికంగా ఫైళ్ల ప్రక్రియ సాగుతుంది. కొత్త విధానంలో పూర్తి స్థాయిలో సాంకేతికతను వినియోగించి, మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే నిర్వహించనున్నారు. కొంత భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వినియోగించనున్నారు. భవన, లేఔట్ అనుమతుల్లో ఏకీకృత విధానాన్ని తీసుకువచ్చేందుకు నూతనంగా ఆన్‌లైన్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం భవనాలు, లేఔట్‌ల ప్లాన్‌ల స్క్రూటినీ రోజులు, గంటల తరబడి సమయం పడుతుంది. కొత్త విధానంలో నిమిషాల వ్యవధిలో స్క్రూటిని పూర్తి కానుంది. నిర్మాణ ప్రతిపాదిత స్థలం పరిశీలన(సైట్ విజిట్)ను ప్రస్తుతం అధికారులు వెళ్లి స్వయంగా పరిశీలించి, నమోదు చేసుకొని, తిరిగి కార్యాలయంలో అప్‌లోడ్ చేస్తున్నారు. సైట్ విజిట్ కోసం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందిస్తున్నారు. సైట్ విజిట్ సమయంలో ఈ యాప్ ద్వారా వివరాలు నమోదు చేసేందుకు అవకాశం కల్పించారు. దీంతో తిరిగి కార్యాలయంలో అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేకుండా ఉంటుంది. ప్రస్తుతం టిజి బిపాస్ ద్వారా అనుమతులు ఇస్తున్నారు. టిజి బిపాస్ పేరును తొలగించి, కొత్త పేరుతో కొత్త విధానం అమలు చేయనున్నారు. కొత్త అప్లికేషన్‌ను వచ్చే ఫిబ్రవరి 1వ తేదీన ప్రారంభించాలని నిర్ణయించారు. మొదట ప్రయోగాత్మకంగా జిహెచ్ఎంసిలో అమలు చేసిన అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి తేవాలనే యోచనలో అధికారులు ఉన్నారు. కొత్త విధానంపై అధికారులు, ఆర్కిటెక్ట్స్, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ తదితరులకు శిక్షణ ఇస్తారు.

**వారాల నుంచి నిమిషాలలో...**

మెరపు వేగంతో నిర్వహించే ప్లాన్‌ల స్క్రూటినీ విధానం అమల్లోకి రానుంది. వారాల సమయం పట్టే స్క్రూటినీ దీని ద్వారా నిమిషాల వ్యవధిలో పూర్తవుతోంది. రాష్ట్రంలోని అన్ని భవనాలు, లౌఔట్‌ల పర్మిషన్‌లకు ఒకటే విధానం అమల్లోకి రానుంది. నిబంధనలకు సంబంధించి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో కూడిన సహకారం అందించేందుకు అందుబాటులోకి తెనున్నారు. ఆగ్మెంటెడ్ రియాలిటీ ద్వారా త్రీడి విజువల్స్ చూడవచ్చు. ప్లాన్‌లు, ప్రణాళికలను మెరపు వేగంతో పరిశీలన జరుగుతోంది. దీనిని జిఐఎస్‌తో అనుసంధానం చేస్తారు.



స్మార్ట్ ఆటోమిషన్లు, రియల్ టైమ్ డాష్‌బోర్డులు, ఎస్ఎల్ఎ ట్రాకింగ్, పత్రాల నిర్వహణ వీటిలో అందుబాటులో ఉంటాయి. అలాగే సిటిజన్ పోర్టల్‌ను తీసుకొస్తున్నారు. సింగిల్ పోర్టల్, మొబైల్ యాక్సెస్, డెస్క్‌టాప్ యాక్సెస్, అన్ని భాషాలలో స్టేటస్ అప్‌డేట్స్ ప్రోగ్రెస్ ట్రాకింగ్ తదితర అంశాలు ఉంటాయి. అధికారులకు ప్రత్యేక పోర్టల్ ఉంటుంది. ఇందులో స్థల పరిశీలన యాప్‌ను వినియోగించుకోవచ్చు. జియో మార్కింగ్, స్థల పరిశీలన షెడ్యూలింగ్, నగదు లావాదేవిలు, ఇసైనింగ్ లాంటివి ఉంటాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు. ఆగ్మెంటెండ్ రియాలిటీ విజువలైజెషన్స్, కస్టమ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, నిబంధనలు తెలిపేందుకు యాప్, బ్లాక్ చెయిన్ లావాదేవీలు, డేటా కోపైలట్ లాంటి సాంకేతికతను వినియోగిస్తున్నారు. బిల్డర్లు, దరఖాస్తుదారులు ఏమైన నిబంధనలకు సంబంధించిన సందేహాలను వీటి ద్వారా సులువుగా తెలుసుకునేందుకు అస్కారం ఉంటుంది. బహుళ అంతస్తుల భవనాలకు ప్రస్తుతం ( పలు టవర్లు, ఒక్కొక్కదాంట్లో 40కి పైగా అంతస్తులు)ల ప్లాన్‌ల స్క్రూటిని ప్రస్తుతం 2030 రోజుల సమయం పడుతుంది. కొత్త విధానం అమల్లోకి వస్తే కేవలం 3 నిమిషాల్లో పూర్తవుతుంది. లేఔట్, గెటేడ్ కమ్యూనిటీ విల్లాలకు ప్రస్తుతం 1015 రోజుల సమయం పడుతుంది. కొత్త విధానంలో కేవలం 5 నిమిషాల్లో పూర్తవుతుంది. ఇక లేఔట్‌లలోని ఓపెన్ ప్లాట్లకు 78 గంటల సమయం పడుతుండగా, కొత్త విధానంలో కేవలం 1 నిమిషంలో మాత్రమే అవుతుంది. సాధారణ భవనాలకు గంట సమయం పడుతుండగా, కొత్తదాంట్లో ఒక్కనిమిషంలోస్క్రూటిన్పూర్తవుతుంది.

**తగ్గనున్న అనుమతుల మంజూరు సమయం..**

భవన నిర్మాణ అనుమతుల సమయాన్ని గణనీయంగా తగ్గించనున్నారు. తక్కువ సమయంలోనే అనుమతులు మంజూరు చేయనున్నారు. దరఖాస్తులు సమర్పించే సమయాన్ని వారాల నుంచి గంటలకు తగ్గించనున్నారు. నాన్ హైరైజ్ బిల్డింగ్స్‌కు ప్రస్తుతం 21 రోజుల నిర్ణీత గడువుగా ఉంది. దీన్ని కొత్త విధానంలో 15 రోజులకు కుదించనున్నారు. 90 శాతం దరఖాస్తుదారులు దీని పరిధిలోకే వస్తారు. నివాసయోగ్యత పత్రం(ఆక్యుపెన్సీ సర్టిఫికెట్) జారీ సమయం 15 రోజుల నుంచి 10 రోజులకు తగ్గనుంది. 600 చందరపు గజాల కంటే తక్కువ ఉన్న చిన్న భవనాలకు, లైసెన్డ్స్ ఆర్కెటిక్ట్స్ ద్వారా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయనున్నారు.

**ఆగ్మెంటెడ్ రియాలిటీతో భవనాలు, లేఔట్‌ల త్రీడి విజువల్స్..**

ఆగ్మెంటెడ్ రియాలిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని ఉపయోగిస్తారు. రియల్ ఎస్టేట్‌ను ప్రోత్సహించేందుకు ఎఆర్ కియోస్క్‌లు అందుబాటులోకి తేనున్నారు. సిటిజన్స్ తమ సొంత సిస్టమ్స్‌లో లేదా హెడ్సెట్‌లో, ఇంటరాక్టివ్ త్రీడి మోడల్స్ ద్వారా, భవన నిర్మాణం కంటే ముందుగానే, అది ఎలా ఉండబోతుందో అనుభూతి చెందుతారు. భవన నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో దృశ్యాలతో అంచనాలకు రాగలుగుతారు. కొత్త అప్లికేషన్ ఫిబ్రవరి 1వ తేదీన అమల్లోకి రానుంది.

ఫోకస్

# యువతరంగం

అమిత్ కుమార్ కటారియా.. హోదా ఐఎఎస్ అధికారి. కానీ, తీసుకుంటున్న జీవితం నెలకు ఒక రూపాయి మాత్రమే. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నందమూరి రామారావు కూడా ఒక రూపాయి జీతం తీసుకున్నారన్నది ఈ తరం వారికి తెలియక పోయి ఉండవచ్చు. అసలు జీతం తీసుకోకపోతే, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేయడంగా భావిస్తారు. అయితే, చట్టాలను అనుసరించి జీతం తగ్గించుకునే అవకాశం ఉంటుంది. అందుకే కొంత మంది లాంఛనంగా రూపాయి జీతం తీసుకొని సేవలు అందిస్తారు. ఆ జాబితాలోకే చేరుతారు హర్యానాలోని గుర్‌గావ్ నివాసి అమిత్ కటారియా. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన మన దేశంలోనే అత్యంత సంపన్న ఐఎఎస్ అధికారుల్లో ఒకరు. నిజానికి ఉద్యోగం చేయాల్సిన అవసరం ఆయనకు లేదు. కానీ, ప్రజలకు తనవంతు సేవలు అందించాలన్న తపనతో ఆయన యుపిఎస్‌సి పరీక్ష రాసి పాసయ్యారు. ఐఎఎస్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. 2015లో ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌కు కలెక్టర్‌గా ఉన్న సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ అక్కడ పర్యటించారు. ఆ సమయంలో కళ్లకు సన్‌గ్లాసెస్ ధరించిన అమిత్ కటారియా అందరి దృష్టినీ ఆకర్షించాడు. కానీ, ప్రభుత్వ ప్రొటోకాల్ సూత్రాలను ఉల్లంఘించాడని ఆ రాష్ట్ర సర్కారు ఆయనకు నోటీసులు జారీ చేసింది. ఈ వివాదంపై విచారణ ఇప్పటికీ కొనసాగుతున్నది. ప్రభుత్వ నోటీసు అందుకున్న తర్వాత కూడా అమిత్ కటారియా తన తీరు మార్చుకోలేదు. పారదర్శకతకు, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చి, వారికి ఆప్తుడయ్యారు. ఆర్‌కె పురంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేశారు. అనంతరం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) ఢిల్లీ అండర్ గ్రాడ్యుయేట కోర్సు అభ్యసించారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ పొందారు. 2003లో జరిగిన ప్రతిష్ఠాత్మక యుపిఎస్‌సి పరీక్షలో 18వ ర్యాంక్ సాధించారు. ఫలితంగా ఐఎఎస్‌లో చేరే అవకాశం లభించింది. అమిత్ కటారియా రియల్ ఎస్టేట్ రంగంలో పేరొందిన ప్రముఖ వ్యాపార కుటుంబం నుండి వచ్చారు, ముఖ్యంగా ఢిల్లీ, పరిసర ప్రాంతాలలో ఆయన కుటుంబ వ్యాపారం గణనీయమైన లాభాలను ఆర్జిస్తున్నది.. అనేక మీడియా నివేదికల ప్రకారం, ఆయన కుటుంబ సంపద కోట్లలో ఉంది. ఎంతో మంది ఆయా వ్యాపారాల్లో ఉద్యోగులుగా ఉన్నారు. అయినప్పటికీ, అమిత్ కటారియా ప్రజలకు సేవ చేసే ఉద్దేశంతో ఐఎఎస్‌ను కెరీర్‌గా ఎంచుకున్నారు. అనుకున్నది సాధించారు. ఇప్పుడు ప్రజలకు నిస్వార్థసేవలు అందిస్తున్నారు. ఇలాంటి నిజాయితీపరులైన అధికారులు మన దేశానికి ఎంతో అవసరం.

## యూత్ ఐకాన్స్

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

## హోదా.. ఐఎఎస్ అధికారి జీతం.. నెలకు ఒక రూపాయి!



# అడ్డంకులు అధిగమించి.. ఉన్నత శిఖరాలకు ఫ్లెమింగ్



ఈ కాలంలో యాంటీబయాటిక్స్ ఎన్నో వచ్చాయిగానీ, ఒకప్పుడు సర్వరోగ నివారిణిగా పెన్సిలిన్ ఒక్కటే ఉండేది. వందలు.. వేలు కాదు, లక్షలు.. కోట్ల మంది ప్రజలను కాపాడిన పెన్సిలిన్ ఆవిష్కర్త అలెగ్జాండర్ ఫ్లెమింగ్ మానవాళికి మహోపకారం చేశాడు. అయితే అతని జీవితం వడ్డించిన విస్తరేమీ కాదు. చిన్నతనంలోనే తండ్రి హ్యూగ్‌ను కోల్పోయాడు. తల్లి గ్రేసీ స్టిర్లింగ్ మోర్టన్ కుటుంబాన్ని పోషించడానికి నానా కష్టాలు పడేది. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో చదువు ఆగిపోయింది. ఉద్యోగంలో చేరి రోజులు వెళ్లతీయాల్సిన పరిస్థితి. అయితే, చదువు పట్ల అతని మక్కువ చెదరలేదు. 20 ఏళ్ల వయసులో మళ్లీ చదువు మొదలు పెట్టాడు. శాస్త్రవేత్తగా ఎదిగాడు. వెయ్యేళ్ల కాలంలోనే అతి గొప్ప ఆవిష్కరణగా చెప్పే తొలి యాంటీబయాటిక్ ఔషధం పెన్సిలిన్‌ను కనిపెట్టాడు. వేరే ప్రయోగం చేస్తుండగా జరిగిన చిన్న పొరపాటు వల్ల ఇది బయటపడడం విశేషం. పెన్సిలిన్ వల్ల క్షయ, న్యూమోనియా, టైఫాయిడ్ లాంటి ఎన్నో ప్రాణాంతక వ్యాధుల నుంచి మానవాళికి రక్షణ కలుగుతోంది. దీన్ని కనిపెట్టినందుకు ఫ్లెమింగ్ 1945లో నోబెల్ బహుమతిని పొందాడు. స్కాట్లాండ్‌లో 1881 ఆగస్టు 6న ఓ రైతు కుటుంబంలో ఎనిమిది సంతానంలో చివరివాడిగా పుట్టిన ఫ్లెమింగ్, ఏడేళ్ల వయసులోనే తండ్రిని కోల్పోయాడు. అమ్మ పొలం పనులు చేస్తుంటే అక్కడి బడిలోచదివిన అతడు, ఆపై లండన్‌లో ఉండే పెద్దన్న దగ్గరకు వెళ్లి హైస్కూల్‌లో చేరాడు. అయితే ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు మధ్యలోనే ఆపేసి షిప్పింగ్ కంపెనీలో గుమాస్తాగా చేరాడు. అనుకోకుండా ఆస్తి కలిసి రావడంతో తిరిగి ఇరవయ్యేళ్ల వయసులో చదువును కొనసాగించడం ప్రపంచానికెంతో మేలు చేకూర్చింది. సెయింట్ మేరీస్ కాలేజీలో వైద్య విద్యలో చేరి చురుగ్గా చదువుతూనే రైఫిల్ షూటింగ్, ఈత, వాటర్పోలో క్రీడల్లో బహుమతులు పొందుతూ ఉండేవాడు. డిగ్రీ పొందాక పరిశోధనల్లో నిమగ్నమయ్యాడు. మొదటి ప్రపంచ యుద్ధం మొదలవడంతో సైనికులకు చికిత్సలు చేసే బృందానికి నాయకత్వం వహించాడు. గాయాలకు సూక్ష్మ జీవుల వల్ల ఇన్ఫెక్షన్ సోకి చాలా మంది సైనికులు చనిపోవడాన్ని గమనించిన ఫ్లెమింగ్, యుద్ధానంతరం బ్యాక్టీరియాపై పరిశోధనలు చేయసాగాడు. వాటిలో భాగంగా 'స్టెఫైలోకోకి' సూక్ష్మ జీవులపై పరిశోధన చేస్తుండగా ఓ రోజున చిన్న పొరపాటు జరిగింది. ఆ బ్యాక్టీరియా ఉన్న పాత్రలను బల్లపై పెట్టి మర్చిపోయి ఇంటికి వెళ్లిపోయాడు. ఆ మర్నాడు వచ్చి చూస్తే బయటి వాతావరణం ప్రభావం వల్ల ఓ పాత్రలో నీలిరంగులో బూజులాంటి తెట్టు (ఫంగస్) కట్టి ఉండడం గమనించాడు. చిత్రంగా ఆ బూజు ఆశించినంత మేరా పాత్రలో సూక్ష్మ జీవులు నాశనమై కనిపించాయి. అంటే ఆ బూజులో సూక్ష్మ జీవులను చంపే పదార్థమేదో ఉందన్నమాట! దాంతో ఫ్లెమింగ్ దానిపై పరిశోధనలు చేసి చిన్న కుంచె లాగా ఉండే పదార్థాన్ని వేరుచేయగలిగాడు. లాటిన్లో పెన్సిలియమ్ అంటే చిన్న కుంచె అనే అర్థం ఉండడంతో దానికి 'పెన్సిలిన్' అని పేరు పెట్టాడు. దాన్ని 1928లో కనిపెట్టగా, మరిన్ని పరిశోధనలు చేసి ఓ మందుగా మార్చి వాడుకలోకి తీసుకు రావడానికి 17 సంవత్సరాలు పట్టింది. దీంతో యాంటీబయాటిక్ యుగానికి నాంది పలికినట్టయింది. ఫ్లెమింగ్ జీవశాస్త్రవేత్త మాత్రమేకాదు.. వైద్య రసాయన శాస్త్రవేత్త (ఫార్మకాలజిస్ట్) . ఈయన కనిపెట్టిన 'ఎంజైమ్ లైసోజైమ్' (1923 ), 'పెన్సిలిన్ (1928 )'అత్యద్భుత ఆవిష్కరణలుగా నిలుస్తున్నాయి.



# మేధో సంపత్తి హక్కుల రక్షణపై ఒప్పందం



ఇటీవల, సౌదీ అరేబియాలోని రియాద్‌లో జరిగిన డిప్లొమాటిక్ కాన్ఫరెన్స్‌లో భారత దేశంతోసహా ప్రపంచ మేధో సంపత్తి సంస్థ (డబ్ల్యుఐపిఒ) సభ్య దేశాలు పాల్గొని, డిజైన్ లా ఒప్పందాన్ని (డిఎల్‌టి) ఆమోదించాయి. విఐపిఒకు చెందిన గ్లోబర్ ఇన్నోవేషన్ ఇండెక్స్ (జిఐఐ) 2024లో ప్రస్తావించిన 133 ఆర్థిక వ్యవస్థలలో భారత్ 39వ స్థానంలో నిలిచింది. మధ్య ఆసియా, దక్షిణాసియాలోని 10 ఆర్థిక వ్యవస్థలు లేదా దేశాల జాబితాలో భారత్ నెంబర్ వన్‌గా ఉంది. మూడు ప్రధానమైన మేధో సంపత్తి హక్కులైన పేటెంట్లు, ట్రేడ్‌మార్క్‌లు, పారిశ్రామిక డిజైన్లలో భారత దేశం ప్రపంచంలోని 'టాప్ 10'లో చోటు సంపాదించుకుంది. గత ఏడాది 64,480 పేటెంట్ దరఖాస్తులతో మన దేశం ప్రపంచంలో 6వ స్థానాన్ని ఆక్రమించింది. భారత దేశ ట్రేడ్‌మార్క్ కార్యాలయం ప్రపంచ వ్యాప్తంగా 3.2 మిలియన్లకుపైగా ట్రేడ్ మార్క్ అములతో, రెండో అతిపెద్ద క్రియాశీలక రిజిస్ట్రేషన్లను కలిగిఉంది. దేశంలో పారిశ్రామిక డిజైన్ దరఖాస్తులు 2023లో 36.4 శాతం పెరిగాయి. భారత పేటెంట్ జిడిపి నిష్పత్తి గత దశాబ్దకాలంలో 144 నుండి 381 కి పెరిగింది, ఇది ఆర్థిక వృద్ధికి అనుగుణంగా ఐపి కార్యకలాపాల విస్తరణను సూచిస్తుంది. పేటెంట్–టు–జిడిపి అనేది పేటెంట్ కార్యకలాపాల ఆర్థిక ప్రభావానికి కొలమానంగా నిలుస్తుంది. కాగా, ప్రపంచ వ్యాప్తంగా పారిశ్రామిక డిజైన్ల రక్షణను క్రమబద్ధీకరించడానికి, సులభతరం చేయడానికి సమగ్ర ఫ్రేమ్‌వర్క్‌ను డిఎల్‌టి ప్రతిపాదిస్తుంది. అనవసరమైన బ్యూరోక్రాటిక్ అడ్డంకులను తొలగించి, డిజైనర్ల మేధో సంపత్తిని రక్షించుకోవడానికి మరింత సౌలభ్యాన్ని అందించే వ్యవస్థను రూపొందించడమే దీని లక్ష్యం. అన్ని రకాల డిజైన్ అప్లికేషన్స్ కోసం స్పష్టమైన, ఏకరీత మార్గదర్శకాలను రూపొందిస్తుంది. పారిశ్రామిక కార్యాలయాలకు డిజైన్‌ను సొచించడానికి దరఖాస్తుదారులు, డ్రాయింగ్‌లు, ఫొటోలు, వీడియోలు వంటి వివిధ ఫార్మాట్లను ఉపయోగించవచ్చు. ఒకే దరఖాస్తు ద్వారా ఒకటి కంటే ఎక్కువ డిజైన్లకు అనుమతిని పొందే అవకాశం ఉంటుంది. దరఖాస్తుదారులు ప్రాథమికంగా అవసరమైన వివరాలను సమర్పించడం ద్వారా, దానిని భద్రపరిచేందుకు అవకాశం కల్పించాలి. వాటిని పరిశీలించిన తర్వాత, పబ్లిక్ డిస్‌క్లోజర్ కోసం ఆరు నెలల నుంచి ఏడాది పాటు వేచి చూడాల్సిన అవసరం రావచ్చు. అయితే, ఆ గ్రేస్ పీరియడ్ కంటే ముందుగానే డిజైన్ల ఆమోదం లేదా తిరస్కరణ ప్రక్రియను పూర్తి చేస్తారు. బదిలీలు, లైసెన్సింగ్ వంటి పోస్ట్ రిజిస్ట్రేషన్ విధానాలను కూడా ఇందులో స్పష్టంగా పేర్కొన్నారు. కాబట్టి దరఖాస్తుదారులు ముందుగానే అన్ని కోణాల్లోనూ డిజైన్లపై అధ్యయనం చేసి, నిర్ణయం తీసుకోవడానికి వీలుంటుంది. పారిశ్రామిక డిజైన్ అనేది ఒక కళాసృష్టి. పారిశ్రామిక ఉత్పత్తిలో భాగస్వామ్యమైనప్పుడు, ట్రేడ్‌మార్క్ లోగోల రూపంలో అవి కీలకంగా మారతాయి. వీటిని ఎంత అందంగానూ, ఆకర్షణీయంగానూ తయారు చేసుకుంటే, అంత భారీ సంఖ్యలో వినియోగదారులను సంపాదించుకోవచ్చు. ఇంతటి కీలకమైన డిజైన్లను ఇతరులు ఎవరూ కాపీకొట్టకుండా మేధో సంపత్తి (ఐపి) కార్యాలయం నిర్దేశించిన ఫైలింగ్ విధానాన్ని అనుసరించాలి. ఒక ప్రాంతం లేదా ఒక దేశానికి పరిమితమైన డిజన్లకు పేటెంట్ హక్కులు పొందవచ్చు. అందుకు అనుగుణంగానే వాటి రక్షణకు చట్టపరమైన మద్దతు లభిస్తుంది. ప్రపంచ మేధో సంపత్తి సంస్థ (విఐపిఒ) ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో పని చేస్తుంది. అంతర్జాతీయ స్థాయి డిజైనింగ్, పేటెంట్, ట్రేడ్‌మార్క్ అంశాలను ఈ సంస్థ పర్యవేక్షిస్తుంది. ఇందులో 193 సభ్య దేశాలు ఉన్నాయి. భారత దేశం 1975లో విఐపిఒలో చేరింది. కాగా, యువ డిజైనర్లకు ఈ కొత్త ఒప్పందం అనుకూలంగా ఉంటుంది. పేటెంట్లు, ట్రేడ్‌మార్క్‌లకు సంబంధించిన లోగోలు, చిత్రాలను రూపొందించడం ఒక వృత్తిగా స్వీకరించవచ్చు.

## ఉద్యమాలకు ఊపిరి ప్రజాకళాకారులు

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్




**ప్రజాపక్షం/సూర్యాపేట :** ప్రజా ఉద్యమాలకు ఊపిరి ప్రజాకళాకారులను సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం బొమ్మగాని ధర్మభిక్షం భవన్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా స్థాయి శిక్షణ శిబిరాన్ని గన్నా చంద్రశేఖర్ ప్రారంభించి మాట్లాడారు. కళ ప్రజా చైతన్యానికి ఆయుధమన్నారు. సామాజిక రుగ్మతలపై యువతను చైతన్యం చేయాల్సిన బాధ్యత కళాకారులదే అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల పట్ల ప్రజలను చైతన్యం చేసేందుకు కళాకారులు తమ కలాలు, గళాలకు పదును పెట్టాలని చంద్రశేఖర్ అన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక న్యాయం అంచడానికి వామపక్ష ఉద్యమంలో ప్రజానాట్యమండలి బలోపేతం కావాలన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ప్రజానాట్యమండలి అధ్యక్షులు జంపాల యల్లయ్య, ప్రధాన కార్యదర్శి దొంతగాని సత్యనారాయణ, నాయకులు దూళిపాళ ధనుంజయ నాయుడు, గుండు వెంకటేశ్వర్లు, బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, చామల అశోక్, గోపనబోయిన వెంకటేశ్వర్లు, ఎడెల్లి శ్రీకాంత్, తొట్ల ప్రభాకర్, నంద్యాల రామిరెడ్డి, తాళ్ళ సైదులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న కార్మికుల సమస్యలు పరిష్కరించండి : ఎఐటియుసి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆర్‌డిఒ కార్యాలయం ముందు ఎఐటియుసి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షకు మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు భూక్య రమేష్ హాజరై మాట్లాడుతూ వంట కార్మికులకు జనవరి నుండి కోడిగుడ్ల బిల్లులు చెల్లించలేదన్నారు. ప్రతి పాఠశాలలో వంటషెడ్లుక వంటపాత్రలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. పురుగుల బియ్యం పంపించి, సకాలంలో కోడిగుడ్ల బిల్లు ఇవ్వక, వేతనాలు ఇవ్వక కార్మికులు మధ్యాహ్న భోజనం ఎలా పెడ్తారన్నారు. గ్యాస్ సిలిండర్, కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫర చేయాలని, ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా నెలసరి వేతనం రూ.10 వేలు ఇవ్వాలని. వంట కార్మికులకు గుర్తింపు కార్డులు, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలన్నారు. పాఠశాలలో 25 మంది విద్యార్థులకు ఒక వంట కార్మికురాలను నియమించాలన్నారు. ప్రభుత్వం స్పందించి మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పరిష్కారం అయ్యేంత వరకు పోరాటాలు చేస్తామని రమేష్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, మొనవ్వ చిట్యాల లక్ష్మి, హంస, మానస, ఉమా, ప్రమీలతో పాటు అన్ని మండల మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.



# కార్మిక హక్కులు హరిస్తున్న కేంద్రం

ఎఐటియుసి రాష్ట అధ్యక్షుడు యూసుఫ్




**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులు హరిస్తున్నదని ఎఐటియుసి రాష్ట అధ్యక్షుడు ఎండి యూసుఫ్ ఆరోపించారు. సోమవారం వరంగల్ శివనగర్‌లోని సిపిఐ కార్యాలయంలో వరంగల్ జిల్లా ఎఐటియుసి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతుల సమావేశానికి ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి పతాకావిష్కరణ చేసి పారంభించారు. శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా యూసుఫ్ హాజరై మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కార్మికుల హక్కులను తొలగించి యాజమాన్యాలకు అనుకూలంగా ఉండే నాలుగు కోడ్‌లు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిందన్నారు. ఈ కోడ్‌ల ప్రకారం కార్మిక వర్గం 8 గంటలకు బదులు 12 గంటలు పని చేయాలని, పర్మినెంట్ ఉద్యోగులను నిర్మూలించే విధంగా కాలపరిమితితో కూడిన ఉద్యోగాలు చేసే విధా నం కోడ్ ఉందన్నారు. చట్టబద్ధంగా సమ్మె చేసే పరిస్థితులు లేవని, నాలుగు కోడ్‌లు పూర్తిగా కార్మిక వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. వాటిని రద్దుచేసి, రద్దు చేసిన 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న ఖాళీలను పర్మినెంట్ విధానంలో నియామకాలు చేపట్టాలని కాంట్రాక్టు లేబర్ విధానాలు రద్దుచేసి, ఈ విధానాల్లో పనిచేసే వారిని పరిమితి ఉద్యోగులుగా గుర్తించాలని స్కీంవర్కర్‌గా పనిచేస్తున్న ఆశ, అంగన్వాడి, మధ్యాహ్నం భోజన కార్మికులను, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.10వేల పెన్షన్ గా చెల్లించాలని, అసంఘటిత కార్మిక సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలని, పెండిగ్‌లో ఉన్న 73 కనీస వేతన జిఒలను సవరించాలని, కిందిస్థాయి ఉద్యోగుల వేతనం నెలకు రూ.26వేలు పెంచాలని డిమాండ్ చేశారు. రైతులకు మద్దతు ధర చట్టం చేయాలని, ఉపాధి హామీ పథకం 200 రోజులకు పెంచి, రోజు వారు వేతనాన్ని రూ.600లకు పెంచాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, రేషన్ కార్డులు జారీ చేయాలని, రైతు బంధు పథకాన్ని అమలు చేయాలన్నారు. తరగతులకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి ఉమామహేష్ హాజరై క్లాసులు నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్ మియా, ఎఐటియుసి వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షులు పనస ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, వర్కింగ్ ప్రెసిడెంట్ దండు లక్ష్మణ్, డిప్యూటీ సెక్రటరీ గుంపల్లి మునీశ్వరుడు, ఎండి ఖాసీం, సహాయ కార్యదర్శి తాళ్లపల్లి జాన్ పాల్, దామెర కృష్ణ, అక్బర్ పాషా, బొట్ల శీను, మహిప్ పాషా, నల్లతీగల కుమార్, చిరంజీవి, మౌటం కుమార్, వసంత, సుప్రియా, బక్కయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు

## పంచాయతీ కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించండి

కలెక్టర్‌కు ఎఐటియుసి నాయకుల వినతి

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** గ్రామపంచాయతీ కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలు, దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎఐటియుసి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎఐటియుసి గౌరవ అధ్యక్షులు మునుగురి హనుమంతు, కార్యదర్శి ఎండి ఉస్మాన్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందికి 3 నెలలుగా వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేస్తూ, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దుచేయాలన్నారు. రూ.19వేలు కనీస వేతనం చెల్లించాలని, కార్మికులందరికీ ఇఎస్ఐ, పిఎఫ్, వారాంతపు, పండుగ, జాతీయ ఆర్థిక సెలవులు మంజూరు చేయాలని, సంవత్సరానికి 3 జతలు యూనిఫాం, సరిపడా చెప్పులు, సబ్బులు, నూనెలు ఇవ్వాలన్నారు. కరోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శిలుగా నియమించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెన్న మహేష్, గ్రామపంచాయతీ యూనియన్ అధ్యక్షులు బిట్కు రాములు, మోతి మహేష్, సతీష్, తిరుపతి, గంగు, నర్సు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆస్తులు కాపాడండి



సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి డిమాండ్




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** అక్రమదారులు నుంచి ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి డిమాండ్ చేశారు. సోమవారం ఎల్‌బి నగర్ జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్ కార్యాలయం ముందు సిపిఐ ఎల్‌బి నగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రచారి మాట్లాడుతూ జిహెచ్‌ఎంసిలో టౌన్ ప్లానింగ్, డిసి అధికారుల నిర్లక్ష్యంతో పలు డివిజన్‌ల్లో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్నయన్నారు. డిసి, ఎసిపిలకు పలు మార్లు వినతి పత్రాలు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. శివగంగ కాలనీలో సర్వే నెం 66/8లో, బొమ్మల గుడి నుండి వీరన్నగుట్ట పోయే దారిలో, సర్వే నెంబర్ 199/1లో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా జిహెచ్‌ఎంసి అధికారులు పట్టించుకోవడం లేదని, కాలనీవాసులు తెలిపినా చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అధికారులు మాముళ్ల మత్తులో ఉన్నారని ఆరోపించారు. ఇప్పటికయిన ప్రభుత్వ ఆస్తుల అక్రమణను అడ్డుకోకుంటే సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చిరించారు. అనంతరం ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్ కేశవ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ ఎల్‌బి నగర్ నియోజకవర్గ సహాయ కార్యదర్శి బాతరాజు నరసింహ, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు జిల్లా కార్యదర్శి ఫైమిద, హయత్ నగర్ మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి, సహాయ కార్యదర్శులు బోయపల్లి రాములు గౌడ్, కందుల సుధాకర్, మధ్రి శోభన్, బి. అరుణ్‌కుమార్ గౌడ్,ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు రమావత్ సక్రునాయక్, సరిత, అనిత, సౌజన్య, జ్యోతి, నాగరాజు, చెంది వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# పోరాట ఫలితమే కోచ్ ఫ్యాక్టరీ

స్థానికులకే ఉద్యోగ అవకాశాలు

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** భారత కమ్యూనిస్టు పార్టీ దశాబ్దాలుగా చేసిన పోరాటాల ఫలితంగానే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు సాధ్యమవుతున్నదని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అద్యక్షతన జరిగిన పార్టీ జిల్లా సమావేశానికి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గడిచిన నాలుగు దశాబ్దాలుగా వివిధ రూపాలలో సిపిఐ కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఎనలేని పోరాటాలు నిర్వహించిందన్నారు. నిరాహార దీక్షలు, సత్యాగ్రహాలు, అఖిల పక్ష పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలనే నినాదాన్ని ఎత్తుకున్నదే సిపిఐ అని, నాడు పార్టీ ముఖ్య నాయకులు మడత కాళిదాసు, బిఆర్ భగవాన్‌దాస్ నాయకత్వంలో సిపిఐ ఉధృతంగా పోరాటాలు నిర్వహించిందని, ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లి నాటి ప్రధాని పివి నర్సింహారావు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. కోచ్ ఫ్యాక్టరీని పూర్తిస్థాయిలో కాజీపేటలో ఏర్పాటు చేయాలని, స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు వేల్పుల సారంగపాణి, కొట్టెపాక రవి, బత్తిని సదానందం, మాలోతు శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# 300ఏళ్లలో ఎన్నడూ చూడని వర్షాలు.. వరదలు!



### తమిళనాడులో కొట్టుకుపోయిన కార్లు, బస్సులు!



**న్యూఢిల్లీ :** తమిళనాడు విల్లుపురం జిల్లాను ఫెయింజల్ తుపాను వణికించింది. ఆకస్మికంగా భారీ వర్షాలు కురవడం వల్ల కొన్ని జిల్లాల్లో వరదలు సంభవించాయి. లోతట్టు ప్రాంతాలు వరద నీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లు వరద ప్రవాహం ధాటికి వాగులుగా మారాయి. ఫలితంగా విల్లుపురం మీదుగా ప్రయాణించే అన్నీ రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. పరిస్థితులు చక్కబడిన తర్వాత సర్వీసులను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు. వరద ఉద్ధృతికి పలు వంతెనలు దెబ్బతిన్నాయి. తిరువణ్ణామలై జిల్లాలోని అరనిలో రహదారులు ధ్వంసమయ్యాయి. ఫెంగల్ బీభత్సం ధాటికి కృష్ణగిరి జిల్లాలో 3 దశాబ్దాల కాలంలో ఎన్నడూ చూడని భారీ వర్షాలు కురిశాయి. భయానక వరదలు సంభవించాయి. వ్యాన్లు, బస్సులు, కార్లు వరదలో కొట్టుకుపోయాయి. ఉత్నంగరై నుంచి కృష్ణగిరికి, తిరువణ్ణామలైకు ప్రయాణించే రహదారిపై భారీగా వరదనీరు నిలవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విల్లుపురం జిల్లాలోని తుపాను ప్రభావిత గ్రామాల్లోని ఇళ్లలోకి భారీగా వరద నీరు చేరగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సహాయక చర్యలు చేపట్టిన ప్రభుత్వం... ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి తగిన ఏర్పాట్లు చేసింది. విల్లుపురంలోని వరద పరిస్థితులను తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ సమీక్షించారు. శిబిరాల్లోని బాధితులతో మాట్లాడిన సిఎం వారికి సహాయ సామగ్రిని అందించారు. ఫెంగల్ తుపాను బలహీనపడి అల్పపీడనంగా మారినట్లు వాతావరణ విభాగం అధికారులు తెలిపారు. నీలగిరి, ఈరోడ్, కోయంబత్తూర్, దిండిగల్, కృష్ణగిరి సహా పలు ప్రాంతాల్లో భారీ వర్షసూచన ఉన్నట్లు పేర్కొన్నారు.

**ఆరెంజ్ హెచ్చరికలు జారీ**

అయితే బెంగళూరు సహా కర్ణాటకలోని మరికొన్ని ప్రాంతాల్లో అల్పపీడనం కారణంగా మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని ఐఎండి తెలిపింది. బుధవారం వర్షాలు తగ్గుముఖం పడతాయని అంచనా వేసింది. వర్షాల నేపథ్యంలో బెంగళూరు సహా, హసన్, మాండ్య, రామనగర జిల్లాల్లో ఎల్లో హెచ్చరికలను ఐఎండి జారీ చేసింది. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న ఉడిపి, చిక్‌మంగళూరు జిల్లాల్లో ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసినట్లు ఐఎండి తెలిపింది.

**కేరళలో భారీ వర్షాలు పడే అవకాశం**

ఫెంగల్ తుపాను కారణంగా కేరళలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు ఐఎండి అంచనా వేసింది. తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్ష మరో 5 రోజులపాటు కొనసాగనున్నట్లు తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన భారీ వర్షాలు పడతాయని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కాసరగాడ్, వయనాడ్, కన్నూర్, కోజికోడ్, మలప్పురం జిల్లాల్లో రెడ్ అలెర్ట్‌ను జారీ చేసింది. పాలక్కడ్, త్రిస్సూర్, ఇడుక్కి, ఎర్నాకుళం జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్, కొట్టాయం, అలప్పుజ, పథనంతిట్ట జిల్లాల్లో ఎల్లో హెచ్చరికలను ఐఎండీ జారీ చేసింది. భారీ వర్షాల నేపథ్యంలో కాసరగాడ్‌లోని అన్ని విద్యాసంస్థలకు అధికారులు మంగళవారం సెలవు ప్రకటించారు. స్థానిక యంత్రాంగం ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంది. మంగళవారం నాడు ఉత్తర కేరళ, కర్ణాటక ప్రాంతాల్లో తుపాను ప్రభావం అధికంగా ఉంటుందని ఐఎండీ అధికారులు పేర్కొన్నారు. అల్పపీడనం అరేబియా సముద్రం వైపునకు కదులుతున్నట్లు వెల్లడించారు. మరోవైపు, తుపాను కారణంగా పుదుచ్చేరిలో 48 శాతం వర్షపాతం నమోదైందని సిఎం ఎన్ రంగస్వామి తెలిపారు. రేషన్ కార్డుదారులందిరీక రూ.5000 సహాయాన్నిఅందిస్తామని చెప్పారు. పుదుచ్చేరిలో 10,000 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, అందుకే రైతులకు హెక్టారుకు రూ.30 వేలు అందిస్తామని వెల్లడించారు. వరదల వల్ల 50 పడవలు దెబ్బతిన్నాయని, వాటి మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ. 10,000 సహాయాన్ని ప్రకటించినట్లు తెలిపారు.

# దేశ ఆర్థిక సరిహద్దులకు 'ఐఆర్‌ఎస్‌లే సంరక్షులు'

### ట్రైనీ అధికారులకు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఉద్బోధ



**న్యూఢిల్లీ :** పన్నుల వసూళ్లను తక్కువ చొరబాటు లేకుండా చేయడానికి ప్రయత్నాలు చేయాలని, ఈ ప్రక్రియలో సాంకేతికతను ఎక్కువగా ఉపయోగించుకోవాల్సిన అవసం ఉన్నదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నొక్కిచెప్పారు. సోమవారం నాడు ఇక్కడి రాష్ట్రపతి భవన్‌లో ఆమెను కలిసిన ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (కస్టమ్స్, పరోక్ష పన్నులు) ట్రైనీ అధికారులను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగించారు. పన్ను పరిపాలనా రంగంలో కొత్త ఆలోచనలను, పరిష్కారాలను తీసుకురావాల్సిన బాధ్యత యువ అధికారులపై ఉందని అన్నారు. పన్ను విధింపు అనేది దేశ ఆదాయాన్ని పెంచే సాధనం మాత్రమే కాకుండా,సామాజిక, ఆర్థిక, రాజకీయాభివృద్ధిలోనూ ముఖ్యమైనదే అన్నారు. దేశంలోని పౌరులు చెల్లించే పన్ను దేశాభివృద్ధికి, ప్రజల శ్రేయస్సుకు ఉపయోగించబడుతుందని ద్రౌపది ముర్ము తెలియజేశారు.'మీ పనిని అంకిత భావం, చిత్తశుద్ధితో చేసినట్లయితే దేశాభివృద్ధికి దోహదపడినవారవుతారని ట్రైనీ అధికారులకు ఉద్బోధించారు. ఈ నూతన, డైనమిక్ యుగంలో పన్నుల వసూళ్లలో తక్కువ చొరబాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎక్కువగా ఉపయోగించేందుకు ప్రయత్నాలు చేయాలి' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారని రాష్ట్రపతి భవన్ విడుదల చేసిన ఒక ప్రకటన తెలియజేసింది. ఐఆర్‌ఎస్ (కస్టమ్స్, పరోక్షపన్నులు) దేశ ఆర్థికాభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు, సామాజిక, ఆర్థికపథకాలను అమలుచేయడానికి , విద్యఆరోగ్య సేవలను అందించడానికి వనరులను ఉపయోగించుకునేలా చేస్తుందని, ఇది దేశ నిర్మాణంలో ఐఆర్‌ఎస్ పాత్రను నొక్కి చెబుతుందని రాష్ట్రపతి ట్రైనీలకు విపులీకరించారు. అడ్మినిస్ట్రేటర్లుగా తమ పాత్రను నెరవేర్చడానికి, వ్యవస్థలు, ప్రక్రియలను అభివృద్ధి చేయాలని,పారదర్శకంగా జవాబుదారీతనాన్ని నిర్ధారించాలని ఆమె ట్రైనీ అధికారులకు సూచించారు. భారత ప్రభుత్వం, వివిధ రాష్ట్రాల , వ్యాపార, పన్ను పరిపాలన మధ్య ఐఆర్‌ఎస్ అధికారులు చాలా ముఖ్యమైన అనుసంధానకర్తలు అన్నారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న సామాజికఆర్థిక దృష్టాంతంలో, జాతీయ ప్రయోజనాల ఎజెండా ఎక్కువగా అంతర్జాతీయ ఆర్థిక సహకారం ద్వారా నిర్ణయించబడుతుందని ముర్ము చెప్పారు. దేశ ఆర్థిక సరిహద్దులకు ఐఆర్‌ఎస్ అధికారులే సంరక్షులని, ఎల్లప్పుడూ నిజాయితీగా, అంకితభావంతో పనిచేయాలని ద్రౌపది ముర్ము కోరారు.a

# 26 'రాఫెల్' కొనుగోలుకు రంగం సిద్ధం

### వచ్చే నెలలో సంతకాలు అయ్యే అవకాశం : నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠి



**న్యూఢిల్లీ :** నౌకా దళానికి అవసరమైన అదనపు మూడు స్కార్పియన్ శ్రేణి జలాంతర్గాములు, 26 రఫేల్ – ఎం విమానాల కొనుగోలు కాంట్రాక్టులపై వచ్చే నెలలో సంతకాలు కావచ్చని నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠి ఆశాభావం వ్యక్తంచేశారు. డిసెంబర్ 4వ తేదీన నౌకాదళ దినోత్సవం సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆరోజు ఒడిశాలోని పూరిలో జరగనున్న కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరుకానున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం తమ దళానికి చెందిన 63 యుద్ధ నౌకలు, ఓ జలాంతర్గామి ప్రస్తుతం నిర్మాణదశలో ఉన్నాయని తెలిపారు. దేశీయంగా డిజైన్ చేసిన రెండు ఎస్ఎస్ఎన్ శ్రేణి (అణుశక్తితో పనిచేసే అటాక్ సబ్ మెరైన్ల) జలాంతర్గాముల ప్రాజెక్టు కూడా దేశీయంగా నౌకా నిర్మాణ పరిశ్రమ అభివృద్ధికి దారితీస్తుందన్నారు. ఈ ఎస్ఎస్ఎన్ జలాంతర్గాములలో మొదటిదాని సేవలు 2036–37 నాటికి అందుబాటులోకి వస్తాయన్నారు. ఆ తర్వాత మరో రెండేళ్లకు మిగిలినది కూడా సిద్ధమవుతుందని చెప్పారు. ఇటీవల ఐఎన్ఎస్ అరిఘాత్ అణు జలాంతర్గామి నుంచి బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించినట్లు డికె త్రిపాఠి వెల్లడించారు. దీనికి వార్ హెడ్ లేదని పేర్కొన్నారు. ఆ ప్రయోగం విజయవంతమైందని.. క్షిపణి ప్రయాణ మార్గాన్ని నిపుణులు అంచనా వేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న చేతక్ హెలికాప్టర్లు పాతవి కావడంతో.. వాటిని భర్తీ చేయడం కోసం 60 యూహెచ్ మారిటైమ్ హెలికాప్టర్ల కోసం ప్రతిపాదనలు చేశామన్నారు. పొరుగుదేశం పాకిస్థాన్ ప్రజావసరాలను పక్కనపెట్టి మరీ ఆయుధాలు సమకూర్చుకొంటోందని నేవీ చీఫ్ పేర్కొన్నారు. వచ్చే దశాబ్ధకాలంలో దానివద్ద 50 యుద్ధ నౌకలు ఉంటాయన్నారు. దాని ఆర్థికవ్యవస్థతో పోలిస్తే ఇది ఆశ్చర్యకరమన్నారు. దక్షిణ చైనా సముద్రంలో చోటుచేసుకొంటున్న పరిణామాలపై భారత్ ఆందోళన చెందుతోందన్నారు. 1971 భారత్ పాక్ యుద్ధంలో నౌకదళ వీరత్వానికి చిహ్నంగా డిసెంబర్ 4న నేవీ డే వేడుకలు నిర్వహిస్తారు. ఈసారి ఒడిశాలోని పూరి తీరంలో నౌకాదళం తన శక్తిసామర్థ్యాలను ప్రదర్శించనుంది. మొత్తం 15 నౌకలు, జలాంతర్గాములు, 40 విమానాలు, మార్కోస్ కమాండోలు, ఇండియన్ ఆర్మీకి చెందిన సిబ్బంది వీటిల్లో పాల్గొనున్నారు. మిగ్ 29కె, హాక్ ఫైటర్స్ విన్యాసాల ప్రదర్శనకు ఆకర్షణగా నిలవనున్నాయి.

# 'పోలింగ్ స్టేషన్‌లో ఓటర్ల సంఖ్య పెంపుతో ఇబ్బంది కాదా?'

### ఇసి వివరణకు సుప్రీం ఆదేశం



**న్యూఢిల్లీ :** ఒక పోలింగ్ స్టేషన్‌కు సంబంధించి గరిష్ఠ ఓటర్ల సంఖ్యను 1,200 నుంచి 1,500 వరకు పెంచాలని ఎలక్షన్ కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం( పిల్) పై సుప్రీంకోర్ట్ విచారణ జరిపింది. ఈ పిల్‌పై ఈసీ తన అభిప్రాయం చెప్పాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం సోమవారం ఈ ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ జరిపింది. పోలింగ్ స్టేషన్‌లో గరిష్ఠ ఓటర్ల సంఖ్య పెంచడానికి ఉన్న కారణాన్ని వివరిస్తూ మూడు వారాల్లోగా ఒక అఫిడవిట్ దాఖలు చేయాలని ఎన్నికల సంఘం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది మణిందర్ సింగ్‌ను ఆదేశించింది. గరిష్ఠ ఓటర్ల సంఖ్యను పెంచాలని నిర్ణయించడం ఆందోళనకరమని, ఏ ఓటరు కూడా తన ఓటింగ్ హక్కును కోల్పోకూడదని సుప్రీం స్పష్టం చేసింది. 'ఒక్కో ఇవిఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లో మొత్తం ఓటర్ల సంఖ్యను పెంచినప్పుడు కచ్చితంగా సదరు నియోజకవర్గంలో ఉన్న రాజకీయ పార్టీలన్నింటినీ ఇసి సంప్రదిస్తుంది' అని ఇసి తరఫున హాజరైన న్యాయవాది మణిందర్ సింగ్ సుప్రీంకోర్ట్‌కు తెలిపారు. నిర్ణీత సమయం దాటినా అప్పటికే పోలింగ్ కేంద్రానికి వచ్చిన వారికి ఓటు వేసేందుకు ఈసీ అనుమతిస్తుందని స్పష్టం చేశారు. సుప్రీంకోర్ట్ బెంచ్ ఈ పిల్ తరువాతి విచారణను 2025 జనవరి 27కు వాయిదా వేసింది. ఈ తేదీ లోపు పిటిషనర్‌కు ఇసి తన అఫిడవిట్ కాపీని అందజేయాలని స్పష్టం చేసింది. ఎలక్షన్ కమిషన్ ఆగస్ట్ నెలలో దేశవ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ స్టేషన్‌లోని ఓటర్ల సంఖ్యను పెంచుతూ 2 ప్రకటనలు జారీ చేసింది. దీనిపై ఇందుప్రకాశ్ సింగ్ సుప్రీంకోర్ట్‌లో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. ఇసి నిర్ణయం ఏకపక్షంగా ఉందని, ఎలాంటి అభిప్రాయ సేకరణ చేయకుండా, డేటాను విశ్లేషించకుండా ఈ నిర్ణయం తీసుకుందని ఆయన ఆరోపించారు.



# లోక్‌సభ సెక్రటరీ జనరల్ పదవీకాలం పొడిగింపు

**న్యూఢిల్లీ :** లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్‌సింగ్ పదవీ కాలాన్ని మరో ఏడాది పొడిగించారు. ఈ మేరకు అధికారికంగా ఉత్తర్వులు వెలువడ్డాయి. వచ్చే ఏడాది నవంబరు 30వ తేదీ వరకు ఉత్పల్ పదవీ కాలాన్ని పొడిగించినట్లు లోక్‌సభ స్పీకర్ ఓమ్‌బిర్లా ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. సింగ్ 1986 ఉత్తరాఖండ్‌కు చెందిన ఐఎఎస్ బ్యాచ్ అధికారి. 2020 డిసెంబరు 1వ తేదీన లోక్‌సభ సెక్రటరీ జనరల్‌గా బాధ్యతలు చేపట్టారు. కాగా, గతంలో కూడా ఆయన పదవీ కాలాన్ని పొడిగించారు. అంతకు ముందు జులై 31, 2020న ఉత్తరాఖండ్ చీఫ్‌సెక్రటరీగా పదవీ విరమణ పొందారు.

# యుపి కాంగ్రెస్ చీఫ్‌ను అడ్డుకున్న పోలీసులు

### లక్నోలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద భారీయెత్తున బలగాల మోహరింపు

### బారికేడ్లు తొలగిస్తున్న కార్యకర్తలు, పోలీసులకు మధ్య ఘర్షణ



**లక్నో / సంభాల్ :** ఉత్తరప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ అజయ్‌రాయ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందాన్ని సంభాల్‌కు వెళ్లకుండా పోలీసులు నిరోధించడంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘర్షణకు దిగారు. సోమవారంనాడు పార్టీ కార్యాలయం వెలుపల ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించేందుకు ప్రయత్నిస్తున్న కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. డిసెంబరు 24న సంభాల్‌లో హింసాకాండ చెలరేగిన తర్వాత పరిపాలన యంత్రాంగం అనుమతిలేనిదే షాహీ జమా మసీదు, హింస ప్రజ్వరిల్లిన ప్రాంతాలకు ఎవరూ ప్రవేశించరాదని నిషేధ ఆజ్ఞలు జారీచేసింది. అయితే డిసెంబరు 2న కాంగ్రెస్ ప్రతినిధి బృందం పర్యటిస్తుందని అజయ్‌రాయ్ ఇటీవల మీడియాకు వెల్లడించిన విషయం తెలిసిందే. కారు డ్రైవర్ సీటులో కూర్చున్న కాంగ్రెస్ యుపి చీఫ్ అజయ్‌రాయ్ పార్టీ సీనియర్ నాయకుడు పిఎల్.పునియాతో పాటు సంభాల్ ప్రాంతానికి వెళ్లేందుకు ప్రయత్నించే క్రమంలో వారిని పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ హైడ్రామా చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వారితో గొడవకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అజయ్‌రాయ్ ప్రతినిధి బృందం సంభాల్‌కు వెళ్లకుండా లక్నోలోని మాల్ ఎవెన్యూ ఏరియాలో ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం రాత్రి నుంచే పోలీస్ బలగాలు భారీ సంఖ్యలో మోహరించాయి. ఈ చర్యను ఆక్షేపిస్తూ కాంగ్రెస్ పార్టీ బిజెపి ప్రభుత్వంపై విమర్శలదాడికి దిగింది. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు బిజెపి సర్కార్ ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని కాంగ్రెస్ఆ పీర్టీ ధ్వజమెత్తింది. సంభాల్ వెళ్లకుండా నిరోధించిన అనంతరం కాంగ్రెస్ చీఫ్ రాయ్ విలేకరులతో మాట్లాడుతూ అధికార యంత్రాంగా తనతో మాట్లాడి డిసెంబరు 10వ తేదీ వరకు నిషేధాజ్ఞలు ఉన్నట్లు తెలియజేయగా, తాను కాంగ్రెస్ ప్రతినిధి బృందం అక్కడికి తప్పకుండా వెళుతుంది అని తెలియజేయగా డిసెంబరు 10వరకు నిషేధాజ్ఞలు ఉన్న విషయాన్ని గుర్తుచేశారని చెప్పారు. అయితే నిషేధాజ్ఞలు ఎత్తివేసిన రోజు కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బృందం సంభాల్‌లోని షాహీ జమా మసీదు, హింసచెలరేగిన ప్రాంతాలకు తప్పకుండా వెళుతుందని తెలియజేశారు. ఒక ప్రశ్నకు సమాధానంగా చెబుతూ బహుశా ప్రభుత్వం భయపడుతున్నట్లు కనిపిస్తోందన్నారు. అయితే డిసెంబరు 10వ తేదీ తర్వాత నిషేధాజ్ఞలు పొడిగించే అవకాశం కూడా ఉన్నదన్నారు. యుపి ప్రభుత్వం అనుసరిస్తున్న నియంతృత్వాన్ని కాంగ్రెస్ చీఫ్ అజయ్‌రాయ్ సహా ప్రతినిధులు గట్టిగా వ్యతిరేకిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ తన 'ఎక్స్' హిందీ పోస్టులో పేర్కొంది.

# విద్యుత్ ఒప్పందాల రద్దుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశం

### విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్



**విజయవాడ :** గత ప్రభుత్వ హయాంలో అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని, దాని కోసం ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి, అందులో తీర్మానించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ దాసరి భవన్‌లో సోమవారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, పి.హరనాథరెడ్డిలతో కలిసి రామకృష్ణ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ ఒప్పందాల రద్దుపై తాజాగా సిబిఐ మాజీ డైరెక్టర్ మన్నెం నాగేశ్వరరావు ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారని రామకృష్ణ తెలిపారు. విద్యుత్ ఒప్పందాలతోపాటు వివిధ అంశాలపై అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్లల్లో పరిపాలనను చక్కదిద్దుతామని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారని ఆ లేఖలో మన్నెం నాగేశ్వరరావు ప్రశ్నించారని వివరించారు. నాగేశ్వరరావు రాసిన లేఖపైన ప్రభుత్వం స్పందించాలని కోరారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలు, ఇతర అంశాలను ఏ మాత్రం టచ్ చేయకుండా, కేవలం మాజీ సిఎం జగన్‌పై రూ.1750 కోట్ల అవినీతి ఆరోపణలపై ఎసిబితో దర్యాప్తు చేయించాలంటూ టిడిపి పొలిట్‌బ్యూరో, మాజీ ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు చేసిన వ్యాఖ్యల్ని రామకృష్ణ తోసిపుచ్చారు. విద్యుత్ ఒప్పందాల్లో అవినీతి జరిగిందన్న దానిపై ఎవరున్నప్పటికీ..తప్పకుండా విచారణ జరిపించాల్సిందే అన్నారు. రాబోయే 25 సంవత్సరాల కాలంలో రాష్ట్రంలోని 26 జిల్లాల ప్రజలపైన రూ. లక్షా 10 వేల కోట్ల భారం పడబోతుంటే..దానిని టచ్ చేయవద్దంటూ అని ఎవరైనా చెప్పారా? అని యనమలను సూటిగా ప్రశ్నించారు. అంటే ఈ భారాన్ని ప్రజలు భరించేందుకు సిద్ధంగా ఉన్నారని మీరు భావిస్తున్నారా? అంటూ యనమలను రామకృష్ణ నిలదీశారు. ఏ ప్రజలు యనమలకు చెప్పారో మాకైతే అర్థం కావడం లేదన్నారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో సెకీ ద్వారా జరిగిన విద్యుత్ ఒప్పందాల్లో ప్రజలపై భారం పడిందన్నారు. పైపెచ్చు విద్యుదుత్పత్తిని అంతా రాజస్థాన్‌లోనే కొనసాగడం వల్ల.. ఆ రాష్ట్రానికే అన్ని విధాలా లాభం జరుగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలపై వేయడం దుర్మార్గమన్నారు. ఎన్‌టిపిఎస్ ద్వారా గుజరాత్ ప్రభుత్వం ఒక యూనిట్‌ను రూ.1.99 పైసలకు కొనుగోలు చేసిందని, సెకీ నుంచి ఏకంగా రాష్ట్ర ప్రభుత్వం 2.49 పైసలకు కుదుర్చుకుందని, ఒక యూనిట్‌కు అదనంగా 50 పైసలు నిర్ధారించి, 25 ఏళ్లపాటు ప్రజలపై పెనుభారం మోపనున్నారని చెప్పారు.బిజెపి నాయకురాలు పురంధరేశ్వరి మాట్లాడుతూ అదానీకి, బిజెపికి సంబంధంలేదంటూ చేసిన వ్యాఖ్యల్ని రామకృష్ణ తప్పుపట్టారు. ఇవాళ నరేంద్ర మోదీ, అమిత్‌షా లేకపోతే అదానీ లేడని రామకృష్ణ అన్నారు. అదానీతో చేసుకున్న ఒప్పందాలన్నీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పరిపాలన నిష్పక్షపాతంగా జరగడంలేదని, కాకినాడ పోర్టుకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెళ్లి అక్కడి షిప్‌ను సీజ్ చేయమని ఆదేశించడం చాలా సంతోషమన్నారు. కొంతకాలంగా కాకినాడ పోర్టు కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నదని, ఖచ్చితంగా చర్యలు తీసుకోవాల్సిందేనని చెప్పారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వడం లేదని, ఈ అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబును, రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి విన్నవిస్తామన్నారు. రూ.5వేల గౌరవ వేతనం ఇచ్చి వలంటీర్లను యథాతథంగా కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# అప్పులు దాటి.. అభివృద్ధి బాట

### ఆర్థిక క్రమశిక్షణకు పెద్దపీట

### తెచ్చిన అప్పులు రూ.52,118 కోట్లు

### వడ్డీలు, కిస్తుల చెల్లింపులకు రూ. 64,516 కోట్లు

### ప్రతిష్టాత్మక పథకాలకు రూ.61,194 కోట్లు



**ప్రజాపక్షం / హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దేందుకు తొలి ఏడాది నుంచి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఫలితంగా రాష్ట్రం అప్పులను దాటి అభివృద్ధి బాట పట్టింది. ఆర్థిక క్రమశిక్షణకు పెద్దపీట వేస్తూ తెచ్చిన అప్పులు రూ.52118 కోట్లు వడ్డీలు, కిస్తుల చెల్లింపులకు రూ. 64516 కోట్లు, ప్రతిష్టాత్మక పథకాలకు రూ.61,194 కోట్లను ప్రభుత్వం వెచ్చించింది. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం అప్పులతో అతలాకుతలమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ఆర్థికంగా క్రమశిక్షణను పాటించింది. 2014 నుంచి 2023 వరకు పదేండ్లలో అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం దాదాపు రూ.7 లక్షల కోట్లు అప్పులు చేసింది. వాటికి చెల్లించాల్సిన వడ్డీలు, కిస్తీలన్నీ కొత్తగా చేపట్టే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు అవరోధాలుగా మారాయి. వాటిని అధిగమించి ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే బిఆర్‌ఎస్ పదేండ్ల పాలనలోని ఆర్థిక స్థితిగతులపై అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేశారు. గత ప్రభుత్వం చేసినట్లుగా ఇష్టారాజ్యంగా అప్పుల జోలికి వెళ్లకుండా నియంత్రణ పాటించింది. బడ్జెట్ పరిమితులకు లోబడి మార్కెట్ రుణాలు తీసుకుని ప్రణాళిక ప్రణాళికేతర ఖర్చులకు సరిపడేలా సర్దుబాటు విధానం అనుసరించింది. ప్రభుత్వ ఉద్యోగులకు నెలలో ఎప్పుడు జీతాలు పడుతాయో తెలియని పరిస్థితి నుంచి ఒకటవ తేదీన జీతాలు వేసే పద్ధతిని పునరుద్ధరించింది. గత ప్రభుత్వం బకాయి పెట్టిన దాదాపు లక్ష కోట్ల బిల్లులను క్రమపద్ధతిలో చెల్లించే విధానం అనుసరించింది. గత ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా చేసిన అప్పులు తీర్చేందుకు ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. అప్పు తెచ్చిన దానికంటే ఎక్కువగా తిరిగి చెల్లింపులు చేసి తెలంగాణ ప్రజలపై మోపిన రుణభారాన్ని తగ్గించింది. 2023 డిసెంబర్ నుంచి 2024 నవంబర్ నెలాఖరు వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 52,118 కోట్లు అప్పులు తీసుకుంది. ఇదే వ్యవధిలో రూ.64,516 కోట్లు రీపేమెంట్లు (అసలు, వడ్డీలు కలిపి కిస్తీలు తిరిగి చెల్లింపులు) చేయటం గమనార్హం. వీటికి తోడుగా ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అమలు చేసిన ప్రతిష్టాత్మక పథకాలకు రూ.61,194 కోట్లు ఖర్చు చేసింది. ఒక వైపు అప్పులను తీరుస్తూనే గ్యారంటీల అమలుకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ పథకానికి అవసరమైన నిధులను సమీకరించటంలో ఆర్థిక శాఖ కీలక పాత్రను నిర్వర్తించింది. ఏక కాలంలో రైతులకు రూ.20617 కోట్ల రుణమాఫీ చేసి రికార్డు నెలకొల్పింది. రాష్ట్రంలోని 25.36 లక్షల రైతు కుటుంబాలను రుణ విముక్తులను చేసింది. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఒక్క ఏడాదిలోనే ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమం, అభివృద్ధికి దాదాపు రూ.57 వేల కోట్లు ఖర్చు చేసింది. రుణమాఫీతో పాటు రైతు భరోసా, పంటల బీమా, రైతు బీమా, పంట నష్ట పరిహారానికి, వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, పంట ఉత్పత్తుల కొనుగోళ్లు, సన్న వడ్ల బోనస్‌కు భారీగా నిధులను ఖర్చు చేసింది. రాష్ట్రంలో ఆగస్టు, సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన పంటలకు నష్ట పరిహారంతో పాటు బాధితులకు సాయం అందించేందుకు రూ.260 కోట్లు కేటాయించింది. అప్పులను తీరుస్తూనే మొదటి ఏడాదిలోనే ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గ్యారంటీ అమలుకు శ్రీకారం చుట్టింది. మహాలక్ష్మి, గృహజ్యోతితో పాటు యువ వికాసాన్ని అమలు చేసింది. గతంలో నిర్లక్ష్యానికి గురైన నిరుద్యోగులకు ఉద్యోగాలపై భరోసాను కల్పించింది. తొలి ఏడాదిలోనే వార్షిక జాబ్ క్యాలెండర్ విడుదల చేసింది. 54,520 ప్రభుత్వ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ పూర్తిచేసి ఎంపికైన అభ్యర్థులకు నియామక ప్రక్రియను పూర్తి చేయటం విశేషం. వీటితో పాటు చేయూత, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500లకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత గృహ విద్యుత్తు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, బియ్యం సబ్సిడీ, స్కాలర్‌షిప్‌లు, డైట్ ఛార్జీల పెంపు, కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాలన్నింటికీ రూ.61,194 కోట్లు ఖర్చు చేసింది. బిసి, మైనారిటీలకు, ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమానికి నవంబర్ నాటికే దాదాపు రూ.9888 కోట్లు ఖర్చు చేసిందని ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి.

# వచ్చే ఏడాది భారత్‌లో పుతిన్ పర్యటన!



**మాస్కో :** రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్ భారత్‌లో పర్యటిస్తారని భావిస్తున్నారు. భారత్–రష్యా రెండు దేశాలమధ్యా వ్యవస్థీకృతమైన సంబంధాలను పరస్పరం ఇచ్చిపుచ్చుకునే వార్షిక కార్యక్రమంలో భాగంగా రెండు దేశాల నాయకులూ కలుసుకుంటారని అంచనావేస్తున్నట్లు రష్యా అధ్యక్షభవనం ఒక ప్రకటనలో తెలియజేసింది. భారతదేశంలో పర్యటించాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నుండి పుతిన్‌కు ఒక ఆహ్వానం అందిందనీ రష్యా అధ్యక్ష భవన సహాయకుడు యూరీ ఉషకోవ్ ఇటీవల పత్రికాగోష్ఠి సందర్భంగా చెప్పారు. పుతిన్ పర్యటనకు సంబంధించిన తేదీలను 2025 ఆరంభంలోనే నిర్ధారిస్తారు. "ఏడాదికి ఒకసారి సమావేశమవ్వాలని మా నాయకులు ఇద్దరిమధ్య ఒక అంగీకారం ఉంది. ఈసారి మా దేశ నాయకుడు భారత్‌లో పర్యటిస్తారు" అని దౌత్యవేత్త ప్రకటన పేర్కొంది. "మోదీ నుండి మాకు ఆహ్వానం అందింది, మేం దీనిపై ఖచ్చితంగా సానుకూలంగా స్పందిస్తాం, వచ్చే ఏడాది ఆరంభంలోనే మా నాయకుడి పర్యటనకు సంబంధించిన తాత్కాలిక తేదీలను నిర్ధారిస్తాం" అని ఉషకోవ్ చెప్పారు. పుతిన్–మోదీ మధ్య నిత్యసంబంధాలు ఉంటాయి. ప్రతి రెండు నెలలకూ ఒకసారి వారు టెలిఫోన్ ద్వారా సంభాషణలు చేస్తారు. వీరిద్దరిమధ్యా వ్యక్తిగతస్థాయిలో కూడా సమావేశాలు జరుగుతాయి. ప్రత్యేకించి అంతర్జాతీయ సదస్సులు, సమావేశాలు జరిగిన సందర్భాలలో వారు విడిగా వ్యక్తిగత సమావేశాలు జరుపుతారు. జులైలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాస్కోలో రెండు రోజులు పర్యటన చేశారు. రష్యా–భారత్ 22వ శిఖరాగ్ర సదస్సులో భాగంగా మోదీ పర్యటన చేశారు. అక్టోబరునెలలో కూడా బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సదస్సు సందర్భంగా రష్యా నగరం కజన్‌లో మోదీ పర్యటించారు. రష్యా అధ్యక్ష భవన అధికార ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ నవంబరునెలలో భారతదేశానికి చెందిన సీనియర్ సంపాదకులతో వీడియో ద్వారా సంభాషణ చేసిన సందర్భంగా భారత్‌లో పుతిన్ పర్యటించే అవకాశాల గురించి ప్రస్తావించారు. ఐనప్పటికీ ఆయన ప్రత్యేకించి ఒక నెల లేదా తేదీలను ప్రస్తావించలేదు.

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
మంగళవారం, డిసెంబరు 03

# ఢిల్లీలో ఒంటరి పోరాటమే : ఆప్

ఫిబ్రవరి రెండవవారంలో కేంద్రపాలిత ప్రాంతమైన నేషనల్ కాపిటల్ టెరిటరీ(ఎన్‌సిటి)ఢిల్లీ అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో ఇండియా కూటమి భాగస్వాములతో పొత్తులేకుండా ఒంటరిగానే బిజెపిని ఢీకొనాలని పాలక ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆ వ్యూహమే ఆప్‌ను అందలమెక్కించింది. ఆప్‌ను అధికారం నుండి తొలగించి ఇరవైఏళ్లకు పైబడి ఢిల్లీలో తమ చేతికందని అధికారపీఠాన్ని దక్కించుకునేందుకు బిజెపి జాతీయ నాయకత్వం ముఖ్యంగా నరేంద్రమోదీ – అమిత్ షా ద్వయం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. గవర్నర్ అధికారాలను ఉపయోగించుకుని కేంద్రం కేజ్రీవాల్ ప్రభుత్వానికి కలుగజేయని అడ్డంకులు లేవు. అవి చాలవన్నట్లు, అవినీతి ఆరోపణలతో మంత్రులనే కాదు, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను సైతం అరెస్టు చేసి 6మాసాలుపైగా జైల్లో నిర్బంధించింది. సారా విధానంలో కుంభకోణం కేసులో ఇరికించింది. విధానంలో లోపాన్ని గ్రహించి సంవత్సరం తిరగకుండానే ఆ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసుకున్నప్పటికీ అవినీతి ఆరోపణలతో వేధిస్తున్నది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మనీలాండరింగ్ కేసులు బనాయించి ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియాను సంవత్సరంపైగా, మరోమంత్రి సత్యేంద్ర జైన్‌ను దాదాపు రెండు సంవత్సరాలు జైల్లో ఉంచింది. కేజ్రీవాల్ బెయిలుపై ఉన్నారు. ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను ఇడి కేసులో నిర్బంధించినందుకు గిరిజనులు ఆగ్రహించి మొన్నటి ఎన్నికల్లో ఎస్‌టి రిజర్వేషన్ సీట్లన్నిటిలో – ఒకటి మినహా – జెఎంఎం, కాంగ్రెస్ అభ్యర్థుల్ని గెలిపించారు. ఎన్‌డిఎ గెలిచిన ఒక్క సీటు కూడా జెఎంఎం వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి చంపై సోరెన్ సీటు. ఇప్పుడు ఢిల్లీలో కేజ్రీవాల్ విషయంలో బిజెపిని ఆ గుబులు పీడిస్తున్నది. ఎన్‌సిటిలో శాంతి–భద్రతలు, భూమి వ్యవహారాలు, ఉన్నతోద్యోగ యంత్రాంగం కేంద్రహోంశాఖ అధీనంలో ఉంటుంది. అందువల్ల నేరాలు, ఘోరాలు అరికట్టటంలో వైఫల్యాలన్నిటికీ కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత. ఈ మధ్యకాలంలో శాంతి భద్రతలు క్షీణించాయి. గత 35 రోజుల్లో ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌పైనే మూడుసార్లు దాడి జరిగింది. వాతావరణ కాలుష్యం ఇప్పుడు ఢిల్లీవాసులను వేధిస్తున్న సమస్య. అయితే అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ బాధ్యులేనన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. ఢిల్లీ ప్రభుత్వం ప్రత్యేకించి అందించే సేవలు విద్యుచ్ఛక్తి, మంచినీటి సరఫరా, విద్య, ఆరోగ్య సంరక్షణ. ఈ విషయాల్లో ప్రజల్లో ముఖ్యంగా ఆప్ ఓటుబ్యాంక్ అయిన కింది తరగతులనుంచి చెప్పుకోదగ్గ అసంతృప్తి, ఫిర్యాదులు లేకపోవటం ఆప్‌కు మేలు.

బిజెపికి కేజ్రీవాల్‌తో సరితూగగల ఆకర్షణశక్తి కలిగిన స్థానిక నాయకత్వం లేకపోవటం పెద్ద లోపం. గతంలో మూడు మున్సిపల్ కార్పొరేషన్‌లు ఉన్నప్పుడు బిజెపికి కొంత స్థానిక అధికారం, పట్టు ఉండేది. ఒకే కార్పొరేషన్‌గా మార్చాక అదికూడా ఆప్ వశమైంది. బిజెపి ఇక ఆఖరు అస్త్రంగా ఆప్ నుండి ఫిరాయింపులు ప్రోత్సహిస్తున్నది. గోడదూకిన వారికి పార్టీ ప్రాధాన్యత ఇస్తున్నదని బిజెపి కార్యకర్తల్లో అసంతృప్తి సెగలు రగులుతున్నాయి.

అది క్షేత్రస్థాయి రాజకీయ పరిస్థితి కాగా, మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆప్ పొత్తు పెట్టుకున్నా మొత్తం 7సీట్లు ఆనవాయితీ ప్రకారం బిజెపి ఖాతాలో పడ్డాయి. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి, అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌ను గెలిపిస్తూ విచిత్రమైన తీర్పు ఇస్తున్నారు ఢిల్లీ ఓటర్లు. అంటే కేంద్రంలో నరేంద్రమోదీని, అసెంబ్లీలో కేజ్రీవాల్ పాలనను వారు కోరుకుంటున్నారు. ఇది కూడా అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా పనిచేయవచ్చు. అవినీతి వ్యతిరేక పోరాట యోధునిగా ఐఆర్‌ఎస్ ఉద్యోగం నుంచి రాజకీయాల్లో అడుగుపెట్టిన కేజ్రీవాల్ 2013 డిసెంబర్ 28న తొలిసారి ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేశారు. 2015లో అసెంబ్లీని రద్దుచేసి ఎన్నికల్లో మళ్లీ గెలిచి రెండవసారి సిఎం అయ్యారు. 2020 ఫిబ్రవరిలో మూడవసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అవినీతి ఆరోపణలపై జైలు నుంచి బెయిలుపై విడుదలైనాక సెప్టెంబర్ 17న కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా సమర్పించి జనాదేశం లభిస్తేనే తాను తిరిగి ముఖ్యమంత్రిగా వస్తానన్నారు. ఆ రోజునుండి శ్రీమతి ఆతిశీ మార్లేనా ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆప్ అంచనాల్లో కాంగ్రెస్‌తో పొత్తువల్ల ప్రయోజనం లేదు. అంతేగాక వారికి కేటాయించటానికి సీట్లూ లేవు. 62 అసెంబ్లీ సీట్లలో ఆప్ సిట్టింగ్ ఎమ్మెల్యేలున్నారు. మరో 5సీట్లలో బిజెపి గెలవగా రెండవస్థానం ఆఫ్ అభ్యర్థులదే. జెడి(యు)2, ఎల్‌జెపి 1 స్థానాల్లో రెండవస్థానం పొందగా ఆ రెండు పార్టీలు ఇప్పుడు బిజెపితో ఉన్నాయి. కాబట్టి కాంగ్రెస్‌కు సీట్లంటూ ఇస్తే ఆప్ కార్యకర్తల్లో అసంతృప్తి, తిరుగుబాట్లు తప్పవు. ఈ అంచనాతో ఒంటరిగానే పోటీ చేయాలని ఆప్ నిర్ణయించింది. ఫలితాన్ని ప్రజలు నిర్ణయిస్తారు. ఆప్ అధికారంలో ఉన్న పంజాబ్‌లో కూడా ఆప్–కాంగ్రెస్ ప్రత్యర్థులు.

# తక్షణ చర్యలపై దృష్టి కేంద్రీకరించని జి–20 సదస్సు

**డా.గ్యాన్ పాథక్**

రియో డీ జనైరోలో గతవారం ముగిసిన జి–20 శిఖరాగ్ర సదస్సులో అధ్యక్షవర్గం చేసిన ప్రకటన ఎంతో సానుకూలంగా ఉంది. కానీ నిర్ణయాత్మకమైన ఆ శాసనబద్ధ ప్రకటనలో ఆచరణాత్మక చర్యలు మాత్రం పరిమితంగానే ఉన్నాయి. అసమానతల పరిష్కారానికి సంపన్నులపై పన్నులు విధించేందుకు జి–20 నాయకులు కట్టుబడ్డారు. స్థిరమైన వృద్ధి, పేదరికంపై పోరాటం చేయడం ద్వారా వాతావరణ ముప్పు నియంత్రణ చర్యలకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించారు. తక్షణ కార్యాచరణ చేపట్టేందుకు బదులుగా దీర్ఘకాలిక లక్ష్యాలు చేరుకోవడంపైనే దృష్టి కేంద్రీకరించారు. శిలాజ ఇంధన వాడకం నుండి దూరంగా జరిగేందుకు పరివర్తన చర్యలను వదిలిపెట్టేసింది. వాతావరణంలో ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీలకు పరిమితం చేసే లక్ష్యానికి బదులుగా 2 డిగ్రీల సెల్సియస్ లక్ష్యంపైనే గురిపెట్టింది. వాతావరణ ముప్పు నియంత్రణ చర్యలకు నిధులు ఎవరు ఇస్తారన్న విషయంలో భిన్నాభిప్రాయాలు వచ్చాయి. జి–20 దేశాలమధ్య విభజనలు వచ్చాయనడానికి ఇవన్నీ ప్రస్ఫుటమైన ఉదాహరణలు. వాతావరణ ముప్పు సమస్యల నియంత్రణ చర్యలకు అవసరమైన లక్షల కోట్ల రూపాయలు (ట్రిలియన్స్ ఆఫ్ డాలర్స్) 'అన్ని వర్గాలనుండీ' వస్తాయని మాత్రం చెప్పినప్పటికీ జి– 20 నాయకత్వం ఈ విషయంలో పెద్దగా చిత్తశుద్ధిని ప్రకటించలేదు. అదేవిధంగా గాజా –లెబనాన్ ప్రాంతాలలో సమగ్రస్థాయి లో సంపూర్ణ కాల్పుల విరమ ణ చర్యలుండాలని పిలుపు ఇచ్చినప్పటికీ, వినాశకరమైన ఉక్రేన్ యుద్ధం, తదుపరి యుద్ధ విస్తరణ సమస్యలను అడ్డుకునేందుకు మాత్రం నిర్మాణాత్మక చర్య లు తీసుకోవడంలో జి–20 దేశాల శిఖరాగ్ర సదస్సు విఫలం కావడం కూడా ఆందోళన కలిగించే మరో విషయం. ఉక్రేన్‌లో జరుగుతున్న యుద్ధ విరమణపై ఏకాభిప్రాయం కొరవడిన శిఖరాగ్ర సదస్సు చీలికలు పీలికలుగా విడిపోయింది. ఐనప్పటికీ కూడా సామాజికంగా సర్వులనూ సమ్మిళితం చేసుకోవడం (సోషల్ ఇన్‌క్లూజన్) ఆకలి, పేదరికాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడం వంటి మౌలికమైన భవిష్యత్ సమస్యల పరిష్కారానికి సంబంధించి జి–20 శిఖరా గ్ర సదస్సు నాయకులు 'చరిత్రాత్మక' శాసనబద్ధ ప్రకటన చేశారు. సంపన్నులపై పన్నులు విధించడం, ఇంధన వాడకంలో సమూల పరివర్తన, రూపాంతరానికి చర్యలు, ప్రపంచ దేశాలను చట్టబద్ధంగా నియంత్రించడానికి సంస్కరణలు, వాతావరణ సమస్యల పరిష్కారానికి చర్యలను ముమ్మరం చేయడంపై 2025లో జరగబోయే కాప్ – 30 సదస్సుకు మద్దతుగా ఉండటం వంటి చరిత్రాత్మక నిర్ణయాలు రియో డీ జనైరో సదస్సులో తీసుకున్నారు.





2032 నాటికి ప్రపంచంలో యాభైకోట్లమంది పేదల ఆకలి తీర్చాలన్న లక్ష్యాన్ని బ్రెజిల్ దేశ అధ్యక్షుడు లూయిస్ ఇనాసయో డసిల్వా తెరమీదకు తెచ్చారు. ఈ ప్రతిపాదనకు 82 దేశాలు మద్దతుగా నిలిచాయి. ఈ ప్రతిపాదనే జి–20 సదస్సు ఎజెండాలో అగ్రస్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంపదలో అత్యధికభాగాన్ని తమ గుప్పెట్లో ఉంచుకున్న యుహెచ్‌ఎన్‌డబ్ల్యుఐ (ఒక్కొక్కరికీ కనీసం 30 మిలియన్ డాలర్ల సంపదగల వ్యక్తులుగల బృందం) గ్రూపుపై ప్రభావశీలమైన పన్నులు విధించడం ద్వారా నిలకడమైన ఆదాయాలు రాబట్టేందుకు సహకార దృక్పథంతో వ్యవహరించాలన్న ఒక ప్రతిజ్ఞను కూడా జి–20 శిఖరాగ్ర సదస్సు ప్రకటనలో జోడించారు. ఇందు కు సంబంధించి పన్నులు వసూలుచేసే అధికారులను సంపన్నులు కుయుక్తులతో ఏమార్చేందుకు ప్రయత్నించకుండా ఒక కట్టుదిట్టమైన యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పేదరికాన్ని నిర్మూలించేందుకు కృషిచేసే అంతర్జాతీయ ప్రభుత్వేతర సంస్థ ''ఆక్స్‌ఫామ్'' ఈ విషయంపై స్పందిస్తూ, ఈ సంక్లిష్టమైన పరిస్థితుల్లో ఈ లక్ష్యాలు సాధించేందుకు మరింత సముచితంగా, నిష్పాక్షికంగా పేదరికం నుండి శరవేగంగా బయటపడే ప్రపంచాన్ని సాధించే దిశగా బ్రెజిల్ ఒక దారిదీపాన్ని వెలిగించిందని పేర్కొంది. లులా ప్రతిపాదించిన ప్రగతిశీల సామాజిక ఎజెండాపై చర్చల్లో కొంత ప్రతిఘటన ఎదురుకావడం వేరే విషయమైనప్పటికీ చివరకు ఈ ఎజెండాను ఆమోదిస్తూ జి–20 దేశాలన్నీ సంతకాలు చేశాయి.

**సమితి సంస్కరణలు, వాణిజ్య వ్యవస్థ పటిష్టతపై జి–20 దృష్టి**

అదేవిధంగా ప్రపంచదేశాలు చట్టబద్ధంగా వ్యవహరించేందుకు ఉద్దేశించిన నియంత్రణ చర్యలపై కూడా జి–20 నాయకులు దృష్టి సారించారు. ఐక్యరాజ్యసమితిలో సమగ్ర సంస్కరణలు అవసరమని, సంస్థను మరింత బలోపేతంచేసి పటిష్టంగా తీర్చిదిద్దాలని సదస్సు నాయకులు ఉద్ఘాటించారు. అంతర్జాతీయ పెట్టుబడుల వ్యవస్థను మరింత అధునీకరించాల్సిన అవసరం ఉందని, అందరి భాగస్వామ్యంతో కూడిన సర్వ సమ్మిళిత బహుముఖ వాణిజ్య వ్యవస్థను పెంచి పోషించి రక్షించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. జి–20 సదస్సు తీసుకున్న నిర్ణయాలలో అతిముఖ్యమైన మరొక నిర్ణయం ఏమిటంటే, ఆకలిపైనా, పేదరికంపైనా పోరాటం చేసేందుకు ప్రపంచ కూటమిని ప్రారంభించడం. అన్నింటికంటే ఇదే అతి ముఖ్యమైనది. ప్రగతిశీల పన్నుల విధానానికి మద్దతు ఇవ్వడం, ప్రపంచ సంపదను హస్తగతం చేసుకున్న కుబేరులపై తగినరీతిలో పన్నులు విధించడం వాటిని పేదరిక నిర్మూలనకు ఖర్చుపెట్టడం ముఖ్యమైన నిర్ణయాలు. ఏదిఏమైనప్పటికీ మితిమీరిన ఐశ్వర్యంతో తులతూగే 'సూపర్ రిచ్'పై క్రమానుగత పన్నులు, ప్రభుత్వ పరిపాలనను ప్రజాస్వామ్యీకరించడం వంటివి చీలికలతో విడిపోయిన వర్తమాన ప్రపంచ రాజకీయ పరిస్థితులమధ్య చాలా అత్యాశతో కూడుకున్నవిగానే భావించాలి.

మౌలిక పారిశుద్ధ్యం కోసం, అందరికీ త్రాగునీరు అందుబాటులోకి తెచ్చేందుకు వనరులు సమీకరించేందుకు, అదేవిధంగా జాతి వివక్ష సమస్య పరిష్కరించేందుకు, జాతులమధ్య సమానత్వాన్ని ప్రోత్సహించేందుకు, అసమానతలపై పోరాటం చేసేందుకు తగిన కృషి చేసేందుకు జి–20 సదస్సు చరిత్రలో మొట్టమొదటిసారి చిత్తశుద్ధిని ప్రకటించింది. ఏదిఏమైనప్పటికీ ఈ లక్ష్యాలను సాధించేందుకు జి–20 దేశాలు అంకితభావం ప్రదర్శించి కొనసాగింపు చర్యలకు కట్టుబడాల్సి ఉంటుంది. వాతావరణ సమస్యల పరిష్కార కార్యాచరణకు తగినన్ని నిధు లు సమకూర్చేందుకు కట్టుబడకుండా, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో హరితసాధనకు నిధులు పెంచ డానికి ప్రాధాన్యత ఇవ్వడా న్నే పదేపదే జి–20 నాయకులు ఉద్ఘాటించారు. వాతావరణ కార్యాచరణకు మద్దతు ఇచ్చేందుకు అంతర్జాతీయ ఆర్థిక వనరుల పంపిణీ వ్యవస్థను సంస్కరించడం అత్యావశ్యకమని వారు వాదిస్తున్నారు. శిలాజ ఇంధనాలకు స్వస్తిచెప్పి హరిత రూపాంతర ఇంధన వనరుల వినియోగానికి వీలుగా వచ్చే ఏడాది నాటికి అభివృద్ధి చెందిన దేశాలు ఎన్‌సిక్యూజి (వాతావరణ సమస్య పరిష్కారినికి ఉమ్మడి కర్తవ్యంగా లక్షలకోట్ల రూపాయలతో సరికొత్త పెట్టుబడి సంస్థ)ఏర్పాటు చేసేందుకు జి–20 కేవలం మద్దతును ప్రదర్శించింది. అభివృద్ధి చెందుతున్న దేశాలకు సహాయం చేసేందుకు పెట్టుబడులు సమకూర్చాలని, శిలాజ ఇంధనాల సబ్సిడీలను దశలవారీగా తొలగించడంతోపాటు న్యాయబద్ధమైన, శుద్ధ ఇంధనాన్ని, రూపాంతరం చెందిన స్థిరమైన ఇంధనాన్ని సత్వరం అందుబాటులోకి తెచ్చేందుకు జి–20 నిర్ణయాత్మక ప్రకటన తన చిత్తశుద్ధిని పునరుద్ఘాటించింది.

**తీర్మానాలు సరే.. తక్షణ సమస్యలపై ఆచరణ ప్రణాళిక ఏది?**

తీర్మానాలు చేసిన జి–20 సదస్సు తక్షణ సమస్యలపై కార్యాచరణ అమలు ప్రణాళిక రూపొందించడంలో విఫలమైం ది. ఆఫ్రికన్ యూనియన్‌ను శాశ్వతసభ్యదేశంగా చేర్చుకోవడం ద్వారా జి–20 వేదిక తన బహుళస్వరూపాన్ని విస్తరించుకుంది. తక్షణ చర్యలు ఏమిటని ఆలోచిస్తే, వాతావరణపై పెట్టుబడులకు కట్టుబడి ఉండటంతోపాటు నిర్మాణాత్మక రుణ విముక్తి చర్యలకు కూడా చాలా అవసరం. కానీ జి–20 మాత్రం దీర్ఘకాలిక లక్ష్యాలు సాధించడంపైన, కార్యవిధాన సంస్కరణలపైన దృష్టి పెడుతున్నది. రష్యా – ఉక్రేన్ యుద్ధం, మధ్యప్రాచ్యం లో ఘర్షణలు వంటి భౌగోళిక ప్రాదేశిక ఉద్రిక్తతలు వాస్తవానికి జి–20ని విభజించింది. నిజానికి ప్రపంచ సమస్యల పరిష్కారానికి, ప్రపంచ భద్రతకు ఈ గ్రూపు మరింత ఏకీకృత వైఖరితో, పరస్పర సహకార దృక్పథంతో వ్యవహరించవలసి ఉంది. అంతర్జాతీ య ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో సంస్కరణకు జి–20 సదస్సు తీర్మానం చేసినప్పటికీ వీటిని ఆచరించేందుకు సుస్పష్టమైన ఒక సమగ్ర బృహత్ ప్రణాళిక కొరవడింది.ఒక బలమైన అంకితభావం, చిత్తశుద్ధి కొరవడింది. అందువల్ల ఈ సంస్కరణలు అన్నీ చాలా నెమ్మదిగా, మందకొడిగా కొనసాగడానికి లేదా స్తంభించిపోవడానికే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి.

సంక్లిష్టమైన ప్రపంచ సమస్యలపై చర్చలు జరపడంలో, వాటిని కొనసాగించడంలో, తాహతుకు మించి అత్యాశతో ఒక కార్యాచరణ చట్రాన్ని రూపొందించడంలో విజయం సాధించిన ఈ బ్రెజిల్ శిఖరాగ్ర సదస్సు తక్షణ సమస్యలపై, ఇప్పటికే వాగ్దానం చేసి కట్టుబడిన సమస్యల పరిష్కార కార్యాచరణపై దృష్టి సారించడంలో మాత్రం విఫలమైందని విమర్శలు ఎదుర్కొంటున్నది. ప్రత్యేకించి వాతావరణపై పెట్టుబడులు, ప్రపంచ పాలనా సంస్కరణలు, ప్రపంచ ఆర్థిక అసమానతలు వంటి విషయాల్లో ఆచరణాత్మక ప్రణాళిక కొరవడింది. ఈ సదస్సు భవిష్యత్తు సమన్వయానికి భూమికను సిద్ధం చేసినప్పటికీ, రాబోయే సంవత్సరాలలో దానికి సంబంధించిన కొనసాగింపు చర్యలను అమలు చేయడంపైనే అంతిమంగా విజయం ఆధారపడి ఉంటుంది.

(ఐపిఎ సర్వీస్)

# దేశ రక్షణరంగంలో దూసుకెళ్తున్న ఆధునిక క్షిపణులు



డిజె మోహన రావు
8247045230

నేటి ప్రపంచ భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో ఆర్థికాభివృద్ధితో పాటుగా రక్షణరంగంలో కూడా వేగంగా పురోగతి సాధించడం మన దేశానికి చాలా ముఖ్యం. దీనిలో భాగంగా 2024 నవంబర్ 27న స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన దీర్ఘశ్రేణి అణ్వాయుధ సామర్థ్యం గల బాలిస్టిక్ క్షిపణి కె4ను అణుశక్తితో నడిచే జలాంతర్గామి ఐఎన్‌ఎస్ అరిఘాత్ నుంచి విశాఖ తీరం బంగాళాఖాతంలో విజయవంతంగా పరీక్షించడం జరిగింది. మన దేశ క్షిపణి సామర్థ్యాన్ని పెంపొందించుకునే ప్రయాణంలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది ఈ విజయం. జలాంతర్గామి నుంచి ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణి (ఎస్‌ఎల్‌బిఎం)ను పరీక్షించడం ఇదే తొలిసారి. ఈ క్షిపణి రెండు దశల ఘన రాకెట్ మోటారు, ఘన రాకెట్ ప్రొపెల్లెంట్‌ను ఉపయోగించి 2 టన్నుల పేలోడ్‌ను మోసుకెళ్ళే సామర్థ్యంతో 10 మీటర్ల పొడవు, 20టన్నుల బరువు, 1.3 మీటర్ల వ్యాసం కలిగి ఉంది. ఈ ప్రయోగంతో నేల, నింగి, సముద్రగర్భం నుంచి అణుక్షిపణిని ప్రయోగించే సామర్థ్యం ఉన్న దేశాల సరసన మన దేశం చేరినట్లైంది. 3,500 కిలోమీటర్ల దాడి పరిధి కలిగిన కె4 క్షిపణి బలమైన అణు త్రయాన్ని( న్యూక్లియర్ ట్రయాడ్) అభివృద్ధి చేయడానికి భారత దేశ విస్తృత వ్యూహంలో భాగం.

ఐఎన్‌ఎస్ అరిఘాత్ నుంచి విజయవంతంగా పరీక్షించిన ఈ ప్రయోగం అణు జలాంతర్గామి నౌకాదళాన్ని విస్తరించి అధినీకరించనుంది. దీనిని జలాంతర్గామి ప్లాట్ఫారం నుంచి ఇప్పటికి కనీసం ఐదుసార్లు పరీక్షించారు. వ్యూహాత్మక రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడానికి భారత్ చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ పరిణామం చోటు చేసుకుంది. గత కొన్నేళ్లుగా మన దేశం వివిధ పరిధుల్లో క్షిపణులను పరీక్షిస్తోంది. పది రోజుల క్రితం ఒడిశా తీరంలో సుదూర హైపర్ సోనిక్ క్షిపణిని భారత్ విజయవంతంగా పరీక్షించింది.

**కె4 క్షిపణి:** కె4 అనేది భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో) అభివృద్ధి చేసిన జలాంతర్గామి నుంచి ప్రయోగించే బాలిస్టిక్ క్షిపణి (ఎస్ఎల్బీఎం). కె4 వంటి జలాంతర్గామి ప్రయోగ బాలిస్టిక్ క్షిపణులు ముఖ్యంగా వాటి అంతర్లీన మనుగడ కారణంగా విలువైనవి. భూ ఆధారిత క్షిపణి లేదా వాయు అణు వేదికల మాదిరిగా కాకుండా ఇవి ఎక్కువ కాలం సముద్రజలాల్లో మునిగి ఉండగలవు. శత్రు దేశాలు వీటిని గుర్తించడం, నాశనం చేయడం చాలా కష్టం. ఒక వేళ అణుదాడి జరిగిన కూడా తర్వాత వినాశకరమైన శక్తితో ప్రతీకారం తీర్చుకోగలవు. ఈ క్షిపణి మూడువేల ఐదు వందల కిలోమీటర్ల దూరం ప్రయాణించగలదు. పది మీటర్ల పొడవు, ఒకటిన్నర మీటర్ల వ్యాసం, ఇరవై టన్నుల బరువు కలిగిన ఇది రెండున్నర టన్నుల వరకు వార్ హెడ్లను మోసుకెళ్లగలదు. భూ ఆధారిత అగ్ని3 క్షిపణికి ఆధునిక రూపాంతరం ఇది. అణుశక్తితో నడిచే జలాంతర్గాములకు ఆయుధాలు అందించడానికి రూపొందించబడింది. మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం పేరుమీద రూపొందించిన ఈ క్షిపణి 3,500కు పైగా స్ట్రైక్ రేంజ్ కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేధించగలదు. ఈ క్షిపణి స్టెల్త్ అండర్ వాటర్ ప్లాట్‌ఫామ్ నుంచి ప్రయోగించే సమయంలో శత్రు భూభాగంలోకి లోతుగా దాడి చేస్తుంది. మునుపటి కె15తో పోలిస్తే ఎక్కువ కార్యాచరణ సౌలభ్యాన్ని అందిస్తాయి. భారతదేశ సముద్ర ఆధారిత న్యూక్లియర్ ట్రయాడ్‌ను అమలుచేసే మొదటి క్షిపణి ఇది.



**న్యూక్లియర్ ట్రయాడ్ అంటే ?**

భూ ఆధారిత ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు (ఐసిబిఎంలు), జలాంతర్గామి నుంచి ప్రయోగించే బాలిస్టిక్ క్షిపణులు (ఎస్ఎల్బీఎంలు), అణుబాంబుల క్షిపణులతో వ్యూహాత్మక బాంబర్లతో కూడిన త్రిముఖ సైనిక దళ నిర్మాణాన్ని న్యూక్లియర్ ట్రయాడ్ (అణ్వస్త్ర త్రయం) అంటారు. నాలుగు దేశాలైన అమెరికా, రష్యా, భారత్, చైనాలు మాత్రమే అణ్వస్త్ర త్రయం కలిగి ఉన్నాయి. అణుబాంబులు లేదా అణ్వాయుధ క్రూయిజ్ క్షిపణులను కలిగి ఉన్న విమానాలు, భూమి లేదా సముద్ర లక్ష్యాలపై ఉపయోగించే వాటిని బాంబర్ ఎయిర్ క్రాఫ్టుఅని ద్రవ లేదా ఘన ఇంధన రాకెట్లతో నడిచే డెలివరీ వాహనాలు ప్రధానంగా బాలిస్టిక్ మార్గంలో ప్రయాణించే వాటిని భూ ఆధారిత క్షిపణులని, నౌకలు లేదా జలాంతర్గాముల నుండి ప్రయోగించే అణు క్షిపణులను బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాములని అంటారు. ఈ త్రయం ఒక దేశం భూమి లేదా సముద్రం నుండి వాయుమార్గం ద్వారా అణుదాడి చేయడానికి వీలు కల్పిస్తుంది.

**ఐఎన్‌ఎస్ అరిఘాత్:** అరిహంత్ శ్రేణికి చెందిన రెండో దశ జలాంతర్గామి ఐఎన్‌ఎస్ అరిఘాత్. ఈ ఏడాది ఆగస్టు 29న విశాఖపట్నంలో భారతీయ నౌకా దళంలో అధికారికంగా అరిఘాత్ చేరింది. ఉన్నతమైన రూపురేఖలు, తయారీ సంబంధి సాంకేతికత, విస్తృత పరిశోధన అభివృద్ధి, ప్రత్యేక పదార్థాలను ఉపయోగించి క్లిష్టమైన ఇంజినీరింగ్ ప్రక్రియల ద్వారా అధిక ప్రావీణ్యపనితనంతో ఐఎన్ఎస్ అరిఘాత్ నిర్మాణం చేయబడింది. ఈ జలాంతర్గామిపై దేశీయంగా చేసిన సాంకేతిక పురోగతి దాని పూర్వీక అరిహంత్ తో పోలిస్తే గణనీయంగా అభివృద్ధి చెందింది. ఐఎన్ఎస్ అరిహంత్ 750 కిలోమీటర్ల పరిధి గల కె15 క్షిపణులను కలిగి ఉండగా ఐఎన్ఎస్ అరిఘాత్ 3,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల మరింత అధునాతన కె 4 క్షిపణులను మోహరించగలదు.

**భవిష్యత్తులో ఐఎన్ఎస్ అరిధమాన్:** ఐఎన్ఎస్ అరిఘాత్ నుంచి విజయవంతంగా పరీక్షించిన ఈ ప్రయోగం అణు జలాంతర్గామి నౌకాదళాన్ని విస్తరించడానికి, ఆధునీకరించడానికి భారతదేశం చేస్తున్న విస్తృత ప్రయత్నంలో భాగం. ఆగస్టు 2024 లో ప్రారంభించిన ఐఎన్ఎస్ అరిఘాత్ భారతదేశ ఆయుధాగారంలో రెండవ ఎస్ఎస్బిఎన్ పన్నెండు కె5 క్షిపణులు, నాలుగు కె4 క్షిపణులు, ముప్పై టార్పెడోలను మోసుకెళ్లగలదు. వచ్చే ఏడాది ప్రవేశపెట్టనున్న ఐఎన్ఎస్ అరిధమాన్ భారత్ తన అణ్వస్త్ర నిరోధకతను మరింత మెరుగుపరుచుకునే పనిలో ఉంది. ఇది 5,000కిలోమీటర్లకు మించిన పరిధి కలిగిన క్షిపణులను మోసుకెళ్లగల ఎస్ఎస్బిఎన్‌ల ఫ్లీట్ను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వెసెల్(ఎటివి) ప్రాజెక్టులో భాగం. ఈ జలాంతర్గాముల్లో కె5, కె6 వంటి శక్తివంతమైన క్షిపణులు ఉంటాయి. ఇవి 6,000 కిలోమీటర్ల వరకు దాడి పరిధిని కలిగి ఉంటాయి.

# అమరవీరుడాశ్రీకాంత్‌చారి నీకు జోహార్..

మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరవీరుడు ఉద్యమాలగడ్డ పోరాటాల బిడ్డ ఉమ్మడి నల్లగొండ జిల్లా ముద్దుబిడ్డ కాసోజు శ్రీకాంతాచారి. అతని మరణం యావత్ దేశాన్ని ఆలోచింపజేసింది. తెలంగాణ ఉద్యమం అనగానే మొదట గుర్తుకు వచ్చేది అమరవీరుల త్యాగం. ప్రపంచ చరిత్రలోనే ఎక్కడ జరగని విధంగా తెలంగాణ ప్రాంతం విముక్తి కోసం ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటం చిరస్మరణీయం.

2009 నవంబర్ 29న రాష్ట్ర సాధనే ధ్యేయంగా అమరణ నిరాహార దీక్షకు వెళుతున్న తెలంగాణ ఉద్యమ నేత కెసిఆర్‌ను పోలీసులు కరీం నగర్ జిల్లా అల్గునూరు వద్ద అరెస్టు చేయడంతో ఒక్కసారిగా తెలంగాణ భగ్గుమన్నది. ఈ నేపథ్యంలోనే కెసిఆర్ అక్రమ అరెస్ట్ నిరసిస్తూ హైదరాబాదులోని ఎల్బీ నగర్ చౌరస్తా ఉద్యమ కాగడ అయ్యింది. ఏం జరిగిందో తెలుసుకునే లోపే జై తెలంగాణ నినాదం చేస్తూ ఒంటి మీద పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న శ్రీకాంతచారి భగభగా మండిపోయిండు. ఉద్యమ మిత్రులు మంటలార్పేలోపే తీవ్రగాయాలతో కుప్పకూలిపోయాడు. ఆసుపత్రిలో ఐదు రోజుల పాటు మృత్యువుతో పోరాడుతూ కూడా తెలంగాణ స్మరణ చేశాడు. తెలంగాణ బిడ్డ ఎగిసే మంట ల్లో బూడిదవుతుంటే టివిల్లో చూసిన నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల గుండెలు రగిలాయి. ప్రతి ఒక్కరూ ఉద్యమానికి ఉద్యుక్తులయ్యేలా శ్రీకాంతచారి ఉద్యమ జ్వాల రగిలించాడు. చివరకు అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 2009 డిసెంబర్ 3న 10 గంటల 30 నిమిషాలకు మరణించాడు. శ్రీకాంత్‌చారి త్యాగం యావత్ తెలంగాణ ప్రాంతాన్ని ఆలోచింపజేసింది సకల జనులను సబండ వర్ణాల ప్రజలను విద్యార్థులను మేధావులను అందరినీ రోడ్ల పైకి తెచ్చింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా లోని మోత్కూరు మండలంలోని పొడి చెడు గ్రామంలో వెంకటాచారి శంకరమ్మ దంపతులకు 1986 ఆగస్టు 15న జన్మించాడు. శ్రీకాంతాచారి. ఫిజియోథెరపీ కోర్సును ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుతూ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొనేవారు. హైదరాబాద్ కేంద్రంగా కొనసాగుతున్న రాష్ట్ర సాధన ఉద్యమానికి వెన్నుదన్నుగా ఉండేవాడు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న శ్రీకాంతచారి రాష్ట్ర సాధన కోసం హిమాలయాలంత త్యాగం చేశాడు. శ్రీకాంతచారి తెగింపు త్యాగం ధైర్యం తెలంగాణ ప్రజలకు వేగుచుక్క అయ్యి దారి చూపింది. శ్రీకాంతచారి మన మధ్యలో లేకున్నా ఆయన ఆశయం నెరవేరి మన కళ్లముందే కదలాడుతున్నది. శ్రీకాంత్ చారి ఆశయాల ప్రేమికులుగా బంగారు తెలంగాణ సాధనలో మనమంతా నిమగ్నం కావడమే ఆయనకు ఇచ్చే అసలైన సిసలైన నిజమైన నివాళి.

నరేష్ జాటోత్, 8247887267

# ఆత్మవిశ్వాసం నీ ఆయుధమైతే విధిని శాసించవచ్చు



డా.అట్ల శ్రీనివాస్ రెడ్డి
9703935321

సమాజంలో ఎవరు ఏ పని చేసినా దాని వెనుక సమాజం పాత్ర ఎంతైనా వుంటుంది. సహకారం, ప్రోత్సాహంతో ఎవరైనా సరే ఎంత ముందుకైన వెళ్ళగలరు, లక్ష్యాన్ని సునాయాసంగా సాధించగలరు అనే సత్యాన్ని గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది . నిజమైన సామర్థ్యం గురించి తెలుసుకున్న వారు ఎవరూ ఎవరినీ తక్కువగా చూడలేరు. అలా అర్థం చేసుకోలేక గత కొన్ని తరాలుగా కొంతమందిని సామర్థ్యం పేరుతో సమర్థులను కూడా అసమర్థులుగా మార్చిన సమాజం నుండి బయటికి వచ్చి అందరినీ అర్థం చేసుకొనే సమాజం వైపు పయనించడానికి నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రపంచంలో పనికిరాని వారంటూ ఎవరూ ఉండరు. అలాగని అందరూ తెలివైన వాళ్లే ఉండరు. మనం చేయగలిగినది ఎవరైనా చేయలేకపోతే మనం వాళ్ల కన్నా గొప్పవాళ్ళం అనుకోవడం సర్వసాధారణమైపోయింది. అయితే వికలాంగులను అర్థం చేసుకోడానికి ఐరిస్ అనే ఆవిడ ఏమంటారంటే 'ఒక వ్యక్తి కూర్చున్న చోటినుండి లేవలేక పోవడం శారీరక సమస్య ఐతే, ఆ వ్యక్తి నిలబడడానికి సరైన సహకారాన్ని అందించకపోవడమే అసలైన వైకల్యం అంటారు'. వైకల్యం అనేది ఒక సంఘటన మాత్రమే కాని సమస్య కాదు, అంటు వ్యాధి అంతకన్నా కాదు అనే విషయం పట్ల సమాజాన్ని చైతన్య పరచవలసిన అవసరం ఎంతైనా ఉంది. లక్ష్యాన్ని సాధించడంలో, ఉన్నత శిఖరాలను అధిరోహించడం లో, ప్రపంచ ఆధునిక అవిష్కరణలు ఆవిష్కరించడంలో వైకల్యం అడ్డు రాదని నిరూపించిన వారు ప్రపంచంలో ఎంతో మందిఉన్నారు. లక్ష్యసాధనలో దివ్యాంగులు ముందుండాలి, ఇటీవల ఐఎఎస్ సాధించిన దివ్యాంగురాలైన(అంధులు) ప్రాంజల్ పాటిల్, ఒంటికాలుతో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన అరుణిమ సిన్హా లను స్ఫూర్తిగా తీసుకొని ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలి.

అంగవికలురూ ఇతరులవలెనే అనేక పనులు సక్రమంగా చేయగలరని నిరూపణ చేస్తూనే ఉన్నారు. తెలివికి, తెలివిలేనితనానికి అంగవైకల్యానికీ సంబంధంలేదు. ఒకపని చేయగలగడం, చేయలేకపోవడం అనేవి వ్యక్తుల సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుంది తప్ప మరోటికాదు. మనం చేయగలిగినది ఎవరైనా చేయలేకపోతే మనం వాళ్ల కన్నా గొప్ప వాళ్ళం అనుకోవడం సర్వసాధారణమై పోయింది.



డిసెంబర్ 3 ప్రపంచ వికలాంగుల దినోత్సవం

**అసలైన వికలాంగులు:** అన్నీఉండి ఇతరుల కోసం ఏమీ చేయడానికి ముందుకు రాని వారు మానసిక వికలాంగులు (మెంటల్లీ డిసేబుల్డ్, కాళ్ళూ చేతులూ ఉండీ ఇతరుల కోసం ఏ సేవా చేయని వారు ఫిజికల్లీ హేండీకాప్డ్, కళ్ళుండీ ఇతరుల మంచి చూడలేని వారూ, మన తోటి వారికి అవసరమైన సహాయమేంటో చూడలేనివారు నిజమైన బ్లైండ్ పీపుల్. ఇతరుల ఉన్నత స్థితికి బాధ పడీ ఏడ్చేవారు, మెంటల్లీ రిటార్టెడ్, అన్నీవయవాలూ సరిగా ఉండీ శ్రమ చేయగల శక్తి సామర్థ్యాలుండీ సోమరిగా ఉండే వారే అసలైన వికలాంగులు. మనలో ఉన్న ఇలాంటి అంగవైకల్యాన్ని మనంతట మనం సరిదిద్దుకోవాలి.

**సామాజిక బాధ్యత:** ప్రత్యేక అవసరాలు గల పిల్లలు చదువుకోవడానికి అనువైన పరిసరాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కల్పించా లి. పిల్లలలో నెగెటివ్ ఆలోచనలను దరిచేరనీయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. దివ్యాంగులలో స్వతంత్రంగా జీవించడానికి కావలిసిన అన్ని సహాయ సహకారాలను తల్లిదండ్రు లు అందించేలా చూడాలి. అలా స్వతంత్రంగా జీవించగలిగితే వారికి వారిపై ఆత్మవిశ్వాసం పెంపొందించబడి జీవన నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి. ఎందరో దివ్యాంగులు ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. వారి విజయగాథలను చెప్పడం ద్వారా, వీడియో క్లిప్పింగ్‌లు చూపడం ద్వారా లక్ష్యాన్ని స్థిరీకరించుకోవడానికి దోహదపడుతుంది. దివ్యాంగులలో తమ తప్పులను, అపజయాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సరైన ప్రోత్సాహా న్ని అందించాలి. సైకాలజిస్ట్ ద్వారా లక్ష్యనిర్ధారణ, ఆత్మ విశ్వా సం, మనోధైర్యాన్నినింపే విధంగా కౌన్సెలింగ్ ఇప్పించాలి, తద్వారా జీవితంలో ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలను తనకు తానుగా పరిష్కరించుకోగలుగుతాడు. ప్రభుత్వ పథకాల ద్వారా వివిధ రకాల సేవలు, పింఛన్, ఉపకారవేతనా లు, రవాణా సౌకర్యాలు, రిజర్వేషన్, విద్యావకాశాలు, ఉద్యోగ అవకాశాలు చైతన్యం చేయాలి. ప్రతి జిల్లాలో ప్రత్యేక పాఠశాలలు (అంధుల పాఠశాల, మూగ చెవిటి, మానసిక వికలాంగుల) ప్రభుత్వం ఏర్పాటు చేయవలిసిన అవసరం ఉంది.

పుట్టుకతో వికలాంగులైన వారికి ప్రత్యేకమైన శక్తులుంటాయనే విషయమూ నిరూపించిన వారెందరో. చూపులేని వారు ఒకమారు విన్న స్వరాన్ని మరోమారు వినగానే ఆ వ్యక్తిని గుర్తిస్తారు. ఒక మారు స్పర్శ తగిలిన వారినీ రెండోమారు గుర్తించగలుగుతారు. వారికి గ్రహణశక్తీ అధికంగానే ఉంటుంది. వికలాంగులు మానసికంగా అధైర్య పడకుండా ఆత్మస్థైర్యంతో అన్నిరంగాల్లో ముందుకు దూసు కెళుతున్నారు. దివ్యాంగులకు చేయూత నిద్దాం.. వారికి గౌరవాన్ని అంది ద్దాం, ఆదరిద్దాం, వారిలో దాగి ఉన్న అద్భుత శక్తులు ప్రపంచానికి తెలిసేలా చేద్దాం.

## సిఎంని కలిసిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి



ప్రజాపక్షం/పాలకుర్తి: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశ స్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సిరెడ్డిలు సోమవారం హైధరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం చేయూతను అందించాలని, అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న పనులు రైతుల రుణమాఫీ, కెనాల్ కాలువలు, పూర్తి రోడ్లు మరమ్మత్తులు, నియోజకవర్గ మార్కెట్‌ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి నియోజకవర్గానికి కావాల్సిన నిధులను త్వరలో మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారన్నారు.

## మానుకోటలో నర్సింగ్ కళాశాల ప్రారంభం


### వర్చువల్ విధానంలో ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: ప్రజాపాలన ప్రజా విజయోత్స వాలు పురస్కరించుకుని సోమవారం ఆరోగ్య దినోత్సవం కార్యక్రమంలో మహబూబాబాద్‌లో నర్సింగ్ కళాశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. స్థానిక మెడికల్ కళాశాల ఆవరణ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లకావత్ లక్ష్మి నారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యాంసుందర్, వైద్య, నర్సింగ్ విద్యార్థినీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## మోసాల పట్ల అప్రమత్తత అవసరం

### ఎస్‌పి కిరణ్ ఖరే



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ప్రజలు వివిధ రకాల మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా జయశంకర్ భూపాలపల్లి ఎస్‌పి కిర ణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజాదివాస్ కార్యక్రమంలో భాగంగా 18మంది బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిం చి, వారి సమస్యలను ఓపిగ్గా విని, వాటిని చట్టప్రకారం పరిష్కరించాలని సంబధిత పోలీసు అధికారులను అదేశించారు. అలాగే ప్రజలు నిర్భ యం గా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛ ందంగా పోలీసు సేవల్ని విని యోగించుకోవాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు అలసత్వం వహించవద్దని ఎస్‌పి పేర్కొన్నారు.

## నాణ్యమైన భోజనం అందించాలి

### తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వర్‌రావు



ప్రజాపక్షం/ములుగుప్రతినిధి : ప్రభుత్వం ఇటీవల కాలంలో ఏర్పాటు చేసిన తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు ములుగు జిల్లాలో వివిధ పాఠశాలలను, హాస్టళ్లను సందర్శించారు. ఈ సం దర్భంగా ఆయన తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాల వెంకటాపూర్, తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ బండారుపల్లి, తెలంగాణ మోడల్ స్కూల్ జవహర్‌నగర్, కస్తూ ర్బాగాంధీ విద్యాలయం జవహర్‌నగర్, తెల ంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షి యల్ స్కూల్ బాయ్స్ ములుగు పాఠశాలలను సందర్శించారు.వారు మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రభుత్వం ప్రకటించిన మెనూ ఆధారంగా విద్యార్థులకు భోజనం అందిం చాలని, కూరగాయలు,కిరాణా సరుకులు, వంటనూనె, పండ్లు, మిగతా భోజన సామాగ్రి అందించడంలో నాణ్యత ప్రమాణాలు పాటించాల న్నా రు. ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి జి పాణిని, డిసిఈబి కార్యదర్శి ఈ సూర్యనారాయణ, ఐటిడిఏ డిడి పోచం, ఏసిఎంఓ రవీందర్, పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి విద్య,వైజ్ఞానిక ప్రదర్శన



ప్రజాపక్షం/హసన్‌పర్తి : వరంగల్ నగర కార్పొరేషన్ పరిధిలోని హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలోని డివిజన్ ఏంజెపి తిమ్మాపూర్ స్కూల్ పదవ తరగతి విద్యార్థినులు లాక్షిక, నాగశ్రీ తేజస్వి హై స్కూల్ ప్రశాంతినగర్‌లో జరిగిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనడం జరిగినది. ఈ వైజ్ఞానిక ప్రద ర్శనలో భాగంగా విద్యార్థిని లాక్షక ప్రదర్శించిన ప్రాజెక్టు వివిధ రకాలైన ఫంక్షన్లలో, రెసి డెన్షియల్ పాఠశాలల్లో మిగిలిన ఆహార పదార్థాలను సేకరించి,సేకరించిన ఆహార పదార్థాలను తిరిగి ఎలా వినియోగించు కోవాలనేది సెన్సార్ ఫుడ్ బ్యాంక్ ద్వారా వివరించడం జరిగినది. ఈ విద్యార్థిని ప్రదర్శించిన ఎగ్జిబిట్ కు న్యాయనిర్ణేతలు ద్వితీయ బహుమతిని నిర్ణయించారు. ఈ బహుమతినీ ఎంపీ కడియం కావ్య, జాయింట్ కలెక్టర్ వెంకటరెడ్డి, జిల్లా విద్యా శాఖాధికారి వాసంతి చేతుల మీదుగా అందుకున్నట్లు తిమ్మాపూర్ స్కూల్ ప్రిన్సిపల్ శోభారాణి తెలియజేశారు. ఈ ఇన్‌స్పైర్ రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థునీ లాక్షకను , విద్యార్థి కృషి కి తోడ్పాటును అందించిన గైడ్‌టీచర్‌కె. విజయ కుమారి, సైన్స్ టీచర్లు ఎన్.రజిత,ఎల్.నిర్మల, ఎం.మౌనిక డి.ప్రవలికలను ప్రిన్సిపల్ శోభారాణి అభినందించారు.

## ఆగిపోయిన పల్లె దవాఖాన పనులు



ప్రజాపక్షం/హసన్‌పర్తి : వరంగల్ నగర పరిధిలోని హసన్ పర్తి మండలం 65వ డివిజన్ ఎల్లాపూర్ గ్రామానికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం పల్లె దవాఖాన మంజూరు చేసింది. కాంట్రాక్టరు దవాఖాన పనులను కొంత వర కు పూర్తి చేశారు. గ్రామస్తులు సదరు కాంట్రాక్టును నాసిరకం మెటీరియల్ వాడుతున్నావని, పిల్లరులు కూడా లైను దారంకు లేవని ప్రశ్నించడంతో దవాఖాన పనులను నిర్మాణ దశలో అపివేసి కాంట్రాక్టర్ వెళ్ళిపోవడం వలన, అప్పుడు ఉన్న పల్లె దావఖానకు సంబంధించి అధికారులు, అప్పటి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. బిఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సరం అవుతున్నదని , ప్రభుత్వం మారిన దృష్ట్యా ఎల్లాపూర్ పల్లె దావఖాన గూర్చి కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, దవాఖానకు సంబంధించిన ప్రభుత్వ అధికారులు కానీ ఇప్పటివరకు పట్టించుకోకపోవడంపై గ్రామ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని దవాఖాన పనులు పూర్తిచేసి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుకుంటున్నారు.

# కేంద్ర పథకాల అమలు...ఉద్యోగులకు ఎంతో ఉపయోగం

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లిప్రతినిధి : కేంద్ర ప్రభుత్వ సెక్షన్ అధికారులు ప్రభుత్వ పథకాల అమలుపై గ్రామస్థాయి పర్యటన ఉద్యోగ జీవితంలో ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లాకు 10 రోజుల పర్యటకు ఆరుగురు సభ్యులు గల కేంద్ర సెక్షన్ అధికారుల బృందం కాటారం, రేగొండ మండలాల్లో పర్యటించి ప్రభుత్వ పాఠశాలలు, అంగన్ వాడి కేంద్రాలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, పార్కులు, డంపింగ్ యార్డులు తదితర పథకాలను పరిశీలించామన్నారు. పర్యటన పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం ఐడిఓసి కార్యాలయంలో సెక్షన్ అధికారులతో జిల్లా కలెక్టర్ ముఖాముఖి నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుత గత నెల 26వ తేదీ నుండి డిసెంబర్ 2వ తేదీ వరకు అధి కారులు జిల్లాలోని కాటారం మండలంలోని గంగారం, నస్తూరు పల్లి, రేగొండ మండలంలోని రంగయ్య పల్లి, నారాయణపూర్ గ్రామాల్లో పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థా యిలో పరిశీలించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలో గమనించిన అంశాలు, పర్యటన ఎలా ఉంది, ఏమేమి అంశాలు గమనించారని అడిగి తెలుసుకుని వారి నుండి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజిబివి పాఠశాల్లో విద్యార్థులతో భోజనంబావుందని తెలిపారు. మారుమూల గ్రామ లున్న మన జిల్లాలో కేంద్ర అధికారుల బృం దం పర్యటించి ప్రజల జీవన స్థితిగతులు, ఆర్థిక అంశాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెం పొందించుకోవడం జరిగిందన్నారు. 72శాతం అటవీ భూములున్న ఈ జిల్లా లో పంటల సాగు, ప్రభుత్వ పథకాలపై పరిశీలనపై అవగాహన పొందడం ఉద్యోగి భావి జీవితానికి ఉప యోగపడుతుందని తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన అధికారుల బృందం జిల్లాకు పర్యటనకు రావడం చాలా సంతోషమని తెలిపారు. డం పింగ్ యార్డులు గ్రామాలకు దూరంగా ఉన్నాయని, దానివల్ల వ్యర్థాలు సేకరణలు కొన్ని ఇబ్బందులు వస్తు న్నాయని గమనించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూమి లభించని కారణంగా గ్రామాలకు దూరంగా డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాల్సి వచ్చిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిపిఓ నారాయణరావు, ఆర్డిఓ మంగిలాల్ అన్ని శాఖలజిల్లా అధికారులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తును పరిష్కరించాలి







### అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి

ప్రజాపక్షం/ములుగుప్రతినిధి : ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి అధికారులకు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, ఆర్‌డిఓ వెంకటేష్‌తో కలిసి దరఖాస్తులు స్వీకరించారు.ఆయన మా ట్లాడుతూ ప్రజావాణి, ప్రజాదర్బార్‌కు సంబంధించిన దరఖాస్తులను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రజా వాణి కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ శాఖ19,పెన్షన్లు1, ఇందిరమ్మ ఇండ్లు 5, ఉద్యోగ ఉపాధి కొరకు 6, ఇతర శాఖలకు సంబంధించినవి 23మొత్తం 54 దరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్ స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను సంబంధిత అధికారులకు సమావేశ మందిరంలోనే అందించారు. డిపిఓ దేవ్‌రాజ్, సిపిఓ ప్రకాష్, డిసిఓ సర్దార్‌సింగ్, ఎస్‌సి కార్పొరేషన్ ఈడి తుల రవి, పంచాయతీరాజ్ ఈఈ అజయ్‌కుమార్, డిఏఓ తేజోవతి, డిడబ్ల్యూఓ ఇన్‌చార్జి శిరీష, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద

ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి : ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి,డిఆర్‌ఓ విజయలక్ష్మి , వరంగల్ , నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణిలు, డిఆర్డిఓ కౌసల్య దేవి, జెడ్పీసీఈవో రామ్‌రెడ్డిలు పాల్గొని ప్రజల సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులు 10, 011 కాగా 9,347 దరఖాస్తులను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ రోజు జరిగిన ప్రజావాణి దరఖాస్తులో కలిపి 772 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించుటకు సంబంధిత శాఖల అధికారులకు ఎం డార్స్ చేస్తూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారు ఆదేశించారు.

### వేగవంతంగా ప్రజా సమస్యలు పరిష్కారం

ప్రజాపక్షం/ఖిలావరంగల్: వేగవంతంగా ప్రజా సమస్యలను పరిష్కరించాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యక్రమంలో గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగ ంగా నగర ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేగవంతంగా ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. వివిధ అనుబంధ సమస్యల పరిష్కారం కోసం స్వీకరించిన దరఖాస్తులను పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోన, ఎస్‌ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, హెచ్‌ఓ రమేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, ఇన్‌ఛార్జి సీపీ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాలు సాధించిన వారికి కలెక్టర్ ప్రశంస



ప్రజాపక్షం/హనుమకొండటౌన్ : షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రంలో ఉచిత కోచింగ్ తీసుకొని ఉద్యోగాలు సాధించిన వారికి హనుమకొండ జిల్లా కలెక్టర్ షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం చైర్మన్ పి.ప్రావీణ్య ప్రశంస పత్రాన్ని ఇచ్చి సన్మానించారు. సోమవారం కలెక్టరేట్ ఆఫీసులో ఉమ్మడి వరంగల్ జిల్లా షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం హన్మకొండలో ఉచిత కోచింగ్ తీసుకొని ఉద్యోగాలు సాధించిన ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనారిటీ, వికలాంగులు వివిధ రంగాల్లో ఉద్యోగాలు సాధించిన వారిని అభినందించి ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి, నిరుద్యోగుల ఉచిత కోచింగ సద్వినియోగం చేసుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించే దిశలో వీరు ముందున్నారన్నారు. షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం ఎంతోమంది పేద నిరుద్యోగులకు ఉన్నత ఉద్యోగ అవకాశాల కోసం ఉచిత కోచింగ్ ఉపయోగపడుతుందన్నారు.ఉద్యోగ అవకాశాలు సాధించే దిశలో చదవాలని కోచింగ్ తీసుకున్న ప్రతి విద్యార్థి ఉద్యోగం సాధించే దిశలో వెళ్లాలని ఆత్మవిశ్వాసంతో నిరంతరం చదివి వివిధ రంగా లలో ఉద్యోగాల్లో విజయపథంలో ముందు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల హనుమకొండ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎ శ్రీలత , ఉమ్మడి వరంగల్ జిల్లా షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం సంచాలకులు డాక్టర్ కె జగన్ మోహన్, హనుమకొండ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి కె కృష్ణ, ఉద్యోగాలు సాధించిన రాజేందర్,రమేష్, పి సునీల్, పి సంధ్య, రాకేష్,రాజశేఖర్, ఎం మౌనిక, బి కిరణ్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షంతో అన్నదాత ఆగం



ప్రజాపక్షం/నెక్కొండ: ఆదివారం సాయంత్రం రాత్రి వరంగల్ జిల్లా నెక్కొండ మం డలంలో కురిసిన వర్షంతో అన్నదాత ఆగమాగం అయ్యాడు. ముందుగా నాటు వేసి కోతకు రాగానే పొలం నుంచి మార్కెట్ తెచ్చిన రైతు ధాన్యం తడిసిపోయింది. అలా గే పంట చేలల్లో సైతం రైతుల పంటలు పోసిన ధాన్యం తడిసి ముద్దయ్యాయి.దీంతో రైతులు తీవ్రమైన నష్టాన్ని మూటగట్టుకున్నారు. దీనికి తోడు ఈ అకాల వర్షంతో కొతకు వచ్చిన పంటలు కోయలేని పరిస్థితి అందులోకి హార్వెస్టర్లు వెళ్లలేని స్థితిలో ఉన్నాయి.ఈ తరుణంలో రైతు కూలీలతో పొలాలు కోపి స్తే విపరీతమైన ఖర్చులతో రైతు నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం యథావిధిగా కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.



# వేగవంతంగా గ్రేటర్ వరంగల్ అభివృద్ధి పనులు

### అభివృద్ధిపై కుడా కార్యాలయంలో సమీక్ష

### పాల్గొన్న ఎమ్మెల్యే, మేయర్, కుడా చైర్మన్, కలెక్టర్, కమిషనర్



ప్రజాపక్షం/హనుమకొండప్రతినిధి : గ్రేటర్ వరంగల్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి కోరారు. గ్రేటర్ వరంగల్ మహా నగర అభివృద్ధిలో భాగంగా కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ సమావేశ మందిరంలో భద్రకాళీ చెరువు పూడికతీత,రోడ్డు వేడెల్పు పార్కింగ్, వెజ్ నాన్ వెజ్ మార్కెట్, రెండు పడకల ఇళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, నగర్ మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య , నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకాడే పాల్గొన్నారు.ఈ సమీక్షా సమావేశంలో భద్రఖాళీ చెరువు పూ డికతీత పనులలో వేగవం తం చేయాలని, వచ్చే వర్షాకాలం నాటికి చెరువు నీటితో ఉండేలా పనులను కొనసాగి ంచాలని అధికారులను ఆదేశించారు. పూడికలో వస్తున్న మట్టి వ్యవసాయ అదారిత రైతులకు అందించేలా చూ డాలని కోరారు. నగరంలో రవాణా పెరుగుతున్న దృష్ట్యా ప్రధానంగా 5 ప్రధాన రోడ్డులను విస్తరణ చేయా లనీ చర్చించారు. అందులో భాగంగా సీపీఓ కార్యాలయం నుంచి ఎంజీఎం రోడ్డు, హనుమాన్ దేవాలయం నుండి అలంకార్ జంక్షన్ రోడ్డు, కాంగ్రెస్ భవన్ నుంచి కేయూసీ రోడ్డు, అంబేద్కర్ జంక్షన్ నుంచి ఎన్జీవోస్ కాలనీ వరకు రోడ్డు, కాజీపేట జంక్షన్ నుంచి సోమిడి వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలని అందుకు అనుగు ణమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పైలట్ ప్రాజెక్ట్ క్రింద తోలుత ఎంజీఎం నుం చి పోలీస్ హెడ్ క్వార్టర్ వరకు గల రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించడానికి ప్రణాళికా రూపొందించాలని సూచిం చారు. నగర సమగ్ర భివృద్ధి దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్‌కి అనుగుణంగా చర్యలు ఉండాలని అధికారు లను ఆదేశించారు. ట్రాఫిక్ అంతరాయలకు ప్రధానంగా మా రినచిరు వ్యాపారుల సముదాయాలను ఏకీక ృతం చేయాలనే ఉద్దేశ్యంతో రూ. 9.40 కోట్లతో వెజ్ నాన్‌వెజ్ మార్కెట్లను అభివృద్ధి చేసిన తరుణంలో ప్రధాన కూడళ్ళ వద్ద ఉన్న పండ్ల,పూల, కూరగాయ ల, మాంసం వ్యారులను సమీకృత వెజ్ నాన్ వెజ్ మార్కె ట్లలో వ్యాపారం చేసుకునే విధంగా చర్య లుచేపట్టాలనిఅధికారులకిఆదేశాలు జారీ చేశారు.

**సంక్రాంతికి రెండు పడకల ఇల్లు**...పశ్చిమ నియోజకవర్గ పరిధిలో నిర్మించిన రెండు పడకల ఇళ్లను సంక్రాంతి పండుగకు అందించేలా సమ యత్తం కావాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధికారులను ఆదేశిం చారు. ఇందుకుగాను నియోజకవర్గంలో ఉన్న 26 డివిజన్ లకు ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసి నివేదికలు అంద జేయా లనీ ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సి పల్, ఇరిగేషన్, ఆర్అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి సిహెచ్ రమేశ్ బాబు



ప్రజాపక్షం/హనుమకొంటౌన్ : ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి సిహెచ్ రమేశ్ బాబు కోరారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో భద్రకాళి దేవాలయం ఆర్చ్ నుంచి నిర్వహించిన ర్యాలీని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి,హనుమకొండ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి సిహెచ్ రమేశ్ బాబు జెండా ఊపి ప్రాంభించారు. వారు మాట్లాడుతూ హెచ్ ఐవి ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ముఖ్యం గా యువత పూర్తి అవ గాహన కలిగి ఉండాలని, ఎయిడ్స్ నియంత్రణలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న పాత్ర ప్రశంసనీయమన్నారు. ఈ ర్యాలీ కాకతీయ మెడికల్ కాలేజీలోని ఎన్నారై ఆడిటోరియం వరకు ప్లాకార్డులు, బ్యానర్లు, నినాదాలు, కళా జాత ప్రదర్శనల తో నిర్వహించారు. అనంతరం కాకతీయ మెడికల్ కాలేజీలోని ఎన్నారై ఆడిటోరియంలో ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా డిఎంహెచ్‌ఓ డాక్టర్ ఏ. అప్పయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జ్ క్షేమ దేశ్ పాండే ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏయిడ్స్ నియంత్రణలో యువత పాత్ర చాలా ముఖ్యమని, తాము అవగాహన పెంపొందించుకొని ఇతరులకు అవగాహన కలిగించాలని, మానసికంగా, శరీరకంగా పూర్తి ఆరోగ్యంగా ఉన్నపుడు యువత తమ భవిష్యత్ లక్ష్యాలను సాధించడంలో ముందుంటారన్నారు. జిల్లా న్యాయ సేవధికార సంస్థ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలను తెలియ చేస్తూ తాము కూడా అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటామన్నారు. హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.అప్పయ్య మా ట్లాడుతూ అందరి సమష్టి కృషి వల్ల అవగాహన చాలా వరకు పెరిగిందని, ఐనప్పటికి ఇంకా పాజిటివ్ కేసులు నమోదు అవుతున్నాయని, అందరం కలసి కట్టుగా కృషి చేస్తే పూర్తిగా నియంత్రించగలమన్నారు. కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడు తూ చాలా మంది హెచ్‌ఐవి ఇన్ఫెక్షన్ తో ఉన్న వారు ఎయిడ్స్ స్టేజ్ కి రావడం లేదని, నిర్ధారణ,కౌన్సిలింగ్, ఆఆర్‌టి చికిత్స ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అదనపుజిల్లా వైద్య అధికారి డాక్టర్.టి. మదన్ మోహన్ రావు, కాకతీయ యునివర్సిటి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రొఫెసర్ నారాయణ, కె. శ్రీనివాస రావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ విజయ్ కుమార్, జిఎంహెచ్ ఆర్ఎంఓ డాక్టర్ అంబరీశ్, టిబి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, ప్రోగ్రాం అధికారులు డాక్టర్. కె. లలితా దేవి, డాక్టర్ హిమ బిందు తదితర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వైద్యులకు 'డాక్టర్ రత్న' అవార్డులు



ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : ఆసియా బెస్ట్ హెల్త్ కేర్ జాతీయ అవార్డుల కార్యక్రమం 1 డిసెంబర్24న ముంబైలో నిర్వహించబడింది. వివిధ స్పెషాలిటీలలో 250 ప్లస్ నామినేషన్లలో 61 మంది సభ్యులు మాత్రమే అవార్డులను అందుకున్నారు. పీడియాట్రిక్ స్పెషాలిటీ విభాగంలో వరంగల్ నుండి కేవలం 4గురు వైద్యులు మాత్రమే డాక్టర్ రత్న అవార్డును గెలుచుకున్నారు. వీరిలో కల్యాణి హాస్పిటల్ డాక్టర్ రమేష్ (పీడియాట్రిక్స్), గ్రావిడ్ హోమ్ హాస్పిటల్ డాక్టర్ జే. ప్రదీప్ (పీడియాట్రిక్స్), డాల్ఫిన్ హాస్పిటల్స్ నుండి డాక్టర్ కే.సురేష్ కుమార్ (పీడియాట్రిక్స్), భూపాలపల్లికి చెందిన శిశువైద్యుడు డాక్టర్ రామాంజనేయులు ఈ డాక్టర్ రత్న అవార్డులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా హెల్త్‌వ్యూస్ మ్యాగజైన్ సీఈఓ దీప్తి వర్మ ఈ పీడియాట్రిషియన్‌లను డాక్టర్ రత్న అవార్డులను అందుకున్నందుకు, వారి నైపుణ్యం కలిగిన చికిత్స చాలా సవాలుగా ఉన్న క్లిష్టమైన కేసులకు విస్తరించినందుకు అభినందించారు.

# అయ్యప్ప డ్రెస్‌తో వచ్చిన విద్యార్థికి నో ఎంట్రీ!

### స్కూల్ యాజామాన్యం అత్యుత్సాహం

ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : అయ్యప్ప మాల వేసుకున్న విద్యార్థిపట్ల తేజస్వి స్కూల్ మేనేజ్మెంట్ అనుచిత ప్రవర్తన చేసిన ఘటన సోమవారం నగరంలోని హంటర్ రోడ్‌లో చోటు చేసుకున్నది. హంటర్‌రోడ్‌లో గల తేజస్వి స్కూల్‌లో మాల వేసుకున్న స్టూడెంట్‌కు యూనిఫామ్ ఉంటేనే స్కూల్‌కు రావాలని మేనేజ్మెంట్ హెచ్చరించి మాలలో వచ్చిన బాలుడిని గంటపాటు పిఈటీ టీచర్ నిలబెట్టి ఆపై బలవంతంగా యూనిఫామ్ టీచర్ వేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో స్కూల్ మేనేజ్మెంట్ తీరుపై అయ్యప్ప భక్తుల ఆగ్రహం వ్యక్తంచేశారు.ఈఘటన జరిగిన తేజస్వి హంటర్ రోడ్ పాఠశాలలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మేనేజ్మెంట్ పోలీ సులతో వాగ్వాదం జరిపారు. అలాగే అయ్యప్ప మాల వేసుకున్న విద్యార్థి పట్ల అనుచిత ప్రవర్తనపై విద్యార్థి సంఘాలు, తల్లి దండ్రులు తేజస్వి యాజమాన్యంతో వాగ్వాదం జరుపగా పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని సద్దుమణిగేలా చేశారు.





## దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా త్వరిత గతిన పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 64 దరఖాస్తులను స్వీకరించారు. అందులో రెవిన్యూ శాఖ 39, జిల్లా పంచాయతీ అధికారి 10, శిశు సంక్షేమ 5, విద్యాశాఖ 2, జిల్లా గ్రామీణ అభివృద్ధి 2, ఇఇ ఇరిగేషన్, వైద్య ఆరోగ్య మున్సిపాలిటీ, దేవాదాయ శాఖ, ఫుడ్ ఇన్స్పెక్టర్, పోలీస్ నుండి ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి శోభారాణి, కలెక్టరేట్ పరిపాలనాధికారి జగన్మోహన్ ప్రసాద్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థి మృతికి కారణమైనవారిని కఠినంగా శిక్షించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** అనంతగిరి మండలం శాంతినగర్ లోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో పదవ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థి గుగులోతు తిరుమలేష్ మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దనియాకుల శ్రీకాంత్ వర్మ, బాణోతు వినోద్ కుమార్‌లు అన్నారు. సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు కారకులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వార్డెన్‌లు స్థానికంగా ఉండకపోవడంతో విద్యార్థుల పట్ల పర్యవేక్షణ కొరవడిందన్నారు. హాస్టల్‌లో పని చేసే ట్యూటర్ విద్యార్థులను తన స్వంత వ్యవసాయ పనులకు విద్యార్థులను ఏలా తీసుకెళ్తారని ప్రశ్నించారు. ట్యూటర్ వీరబాబు ఫరారీలో ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. విద్యార్థి మృతికి కారకులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి కుటుంబానికి రూ. 10లక్షల ఎక్స్‌గ్రెషియా చెల్లించాలన్నారు. లేని పక్షంలో తమ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సంఘం నాయకులు అక్కినపల్లి వినయ్ పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** డబుల్ రూం ఇండ్ల లబ్దిదారులకు ప్రభుత్వం వెంటనే ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూం లబ్దిదారుల కమిటీ అధ్యక్షులు షెక్ నయీం మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం లబ్దిదారులకు 45రోజుల్లో ఇండ్లు కేటాయిస్తామని చెప్పి కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. అధికారులు వెంటనే స్పందించి లబ్దిదారులకు ఇండ్లు కేటాయించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో లబ్దిదారులు ఎస్‌కె ఆశ, ఎండి రఫీ, హుస్సేన్ బి, హసీనా, రామసాని పావని, కటూరి భిక్షమమ్మ, నీలమ్మ, అనిల్, మోర నరేష్, నూకల నాగరాజు, రవి నాయక్ పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌పై మహిళలకు అవగాహన



**ప్రజాపక్షం / గద్వాల :** జోగులాంబ గద్వాల జిల్లాలోని అంబేద్కర్ నగర్ 25వ వార్డులో సోమవారం ఆపరేషన్ మెర్సి ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జోగిని ఒంటరి దళిత ,ఇతర మహిళలకు హెచ్.ఐ.వి, ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కో ఆర్డినేటర్ వి.అనురాధ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల లైంగిక సంబంధాలు పెట్టుకోవద్దని, కలుసితమైన సిరంజీలు వాడరాదు, ఒకవేళ కడుపుతో ఉన్న తల్లికి హెచ్ఐవి సోయితే కచ్చితంగా ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు చేయించుకోవాలని అప్పుడు బిడ్డకు హెచ్ఐవి రాకుండా నివారించవచ్చని తెలిపారు. హెచ్ఐవి ఉన్న వారు ఏ.ఆర్.టి. మందుల జీవితకాలాన్ని పెంచుకోవచ్చని ఆ మందులు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా ఇస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ రాధ, ఆశా కార్యకర్త సునంద, ఓఎంఐఎఫ్ హెల్త్ వర్కర్స్ ,ఆశ్రయ్,స్వచ్ఛద సంస్థ ప్రతాప్,పాల్గొన్నారు.

## సంస్థాన్‌నారాయణపురంలో బయో డీజిల్ కంపెనీ సందర్శించిన సిపిఐ నేతలు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలోని బయో డీజిల్ కంపెనీని సిపిఐ నేతలు సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రాంత అభివృద్ధిని స్వాగతిస్తామని, ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తున్న మాట వాస్తవమైన ప్రజల ఆరోగ్య దృశ్య అప్రమత్తం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాట్లాడారు. ఈ కంపెనీ ద్వారా ఉపాధి పొందుతున్న ఉపాధి పొందుతున్న కార్మికులకు తమ పార్టీ వ్యతిరేకం కాదని అన్నారు. అనంతరం కంపెనీ జనరల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చన గోని గాలయ్య, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, మండల సహాయ కార్యదర్శి చిలువేరు అంజయ్య, సిపిఐ నాయకులు వీరమల్ల యాదయ్య, పల్లె మల్లారెడ్డి, సింగపంగ మల్లయ్య, మొగుదాలసత్తయ్య, యాదగిరి, సింగపంగ రమేష్, విడం జనార్ధన్, గడ్డం యాదగిరి, ప్రజా సంఘాల నాయకులు వలిగొండ యాదయ్య, సముద్రం శ్రీనివాస్ పాల్గొన్నారు.



# 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి

### సన్నరకాలకు రూ. 500బోనస్
### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ:** రైతుల శ్రేయస్సే ధ్యేయంగా ప్రస్తుత ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం కోదాడ ఎంఎల్ఎ పద్మావతిరెడ్డితో కలిసి కోదాడ నియోజకవర్గంలో సుమారు 100 కోట్ల అంచాన వ్యయంతో నూతనంగా నిర్మించనున్న రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా కోదాడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సన్న ధాన్యం పండించిన రైతులకు రూ.500 బోనస్ అందజేస్తుందని, దేశ వ్యాప్తంగా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంత్రి అన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 9.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రూ.471.31 కోట్ల బోనస్ రైతులకు చెల్లించామని ఆయన అన్నారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరం లోపే రాష్ట్రంలో 50వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదని అన్నారు. గత ప్రభుత్వ హాయంలో తమ పదేళ్ల పాలన కాలంలో ఒక్క డిఎస్సీ నిర్వహించలేదని మంత్రి ఎద్దేవా చేశారు. ఈనె 4న పెద్దపల్లిలో నిర్వహించనున్న సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరో నాలుగువేల ప్రభుత్వ ఉద్యోగాల నియామకపత్రాలు అందజేయనున్నట్లు ఉత్తమ్ తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా పారిశ్రామిక ఆధారిత వృత్తి నైపుణ్యా కేంద్రాన్ని నెలకోల్పనున్నామని, దాంతో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి తరలివస్తున్నారని ఆయన అన్నారు. మూసినది పునరుజ్జీవం, అక్రమణలకు గురైన చెరువులు, కుంటల పునరుద్ధరణ, హైద్రాబాద్‌లో నిర్మించనున్న క్రీడా విశ్వ విద్యాలయం, గృహ జ్యోతి, మహాలక్ష్మి , సబ్సిడీ గ్యాస్ తదితర అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ఉత్తమ్ ఈ సందర్భంగా ఉటంకించారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు అదేశానుసారం ఏకసభ్య కమిషన్ నియమించామని, సామాజిక న్యాయ సాధనలో భాగంగా రాష్ట్రంలో కుల గణన చేపట్టామని ఆయన అన్నారు. ఆయన వెంట సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్‌పవర్, కోదాడ ఎంఎల్ఎ పద్మావతిరెడ్డి తదితరులున్నారు.



## ప్రతి దరఖాస్తును పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధి శాఖ అధికారులు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను సంబంధిత శాఖ అధికారులు పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ మొదటి వారం వరకు సంభవించిన తుఫాన్‌తో నష్టపోయిన వివిధ శాఖలకు సంబంధించిన ఆస్తుల వివరాలను సంబంధిత శాఖ అధికారులు పూర్తి రిపోర్టు తయారు చేసి పోటోలను ఆల్బామ్ రూపంలో తయారు చేసి అందజేయాలన్నారు. ఆస్తులకు నష్టపరిహారం చెల్లించే నిమిత్తం విపత్తు నివారణ కమిటీ మంగళవారం జిల్లాకు రానున్నట్లు తెలిపారు. ప్రజావాణిలో వివిధ సమస్యలపై 72 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఓ అశోక్, సిపిఓ ఎల్ కిషన్, డిడబ్ల్యూఓ నరసింహారావు, డిఎంహెచ్ఓ కోటాచలం, అధికారులు శంకర్, నారాయణరెడ్డి, శ్రీనివాసరావు, సతీష్, అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

# సంక్షేమబోర్డు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు




**ప్రజాపక్షం/కోదాడ:** కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడి బిజేపి ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాయడమే కాకుండా నాటి అనేక సంవత్సరాలు పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డును ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టడం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడని ఆ ప్రభుత్వాన్ని తిప్పి కొట్టాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కోదాడ మండల మార్బుల్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్యానికి పూర్వమే బ్రిటిష్ కాలంలోనే తెల్లదొరల పాలనలో అనేక కార్మికుల హక్కుల చట్టాలను సాధించుకుంటే నేటి నల్లదొరల పాలనలో ఉన్న చట్టాలను రద్దు చేసి శునకానందం పొందుతున్న బిజేపి ప్రభుత్వాలను ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన గాడితప్పి మాటల గారడితో మాయమాటలతో కాలం గడుపుతున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపైన సమరశీల పోరాటాలకు సన్నదం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు షేక్ లతీఫ్, యూనియన్ నాయకులు కె.అచ్చయ్య, యండి అజీజ్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటిని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సందానం రామారావు, ఉపాధ్యక్షులుగా షేక్ మీరా, ప్రధాన కార్యదర్శిగా షేక్ పాషా, సహాయ కార్యదర్శిగా శీలంసైదులు, కోశాధికారిగా అత్తిలి వీరబాబు, గౌరవ అధ్యక్షులుగా కె. అచ్చయ్యతో పాటు మరో 11 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## లక్ష్యంతో పని చేస్తే సమాజంలో గుర్తింపు



**ప్రజాపక్షం/సూర్యాపేట:** నూతనంగా పదవి బాధ్యతలు చేపడుతున్న కానిస్టేబుల్‌లు లక్ష్యంతో పని చేసి సమాజంలో గుర్తింపు పొందాలని జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌వి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో శిక్షణ పూర్తి చేసుకోని జిల్లాకు వచ్చిన 281 మంది కానిస్టేబుల్‌లకు విధుల నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ పోలీస్ విధివిధానాలు చాలా ప్రత్యేకమైనవని చెప్పారు. నేరస్తుల పట్ల కఠినంగా ఉండాలన్నారు. ప్రజలకు సేవలు అందించడానికి పోలీసు ఉద్యోగం చక్కటి అవకాశమన్నారు. లక్ష్యాలు, సవాళ్లతో కూడింది పోలీస్ ఉద్యోగమని చెప్పారు. ఏ ఇతర శాఖ విధులతో పోలిస్తే పోలీస్ డ్యూటి ఇష్టమైందన్నారు. మంచిగా పని చేసి పోలీస్ శాఖకు గుర్తింపు తీసుకరావాలన్నారు. శిక్షణలో నేర్చుకున్నవన్ని గుర్తు పెట్టుకొని ఆత్మవిశ్వాసం, ధృఢ సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మ్‌డ్ అదనపు ఎస్‌పి జనార్ధన్ రెడ్డి, ఎఆర్ డిఎస్‌పి నర్సింహ్మాచారి, స్పెషల్ బ్రాంచీ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు, ఆర్మ్‌డ్ సిఐలు నారాయణరాజు, నర్సింహ్మా, పట్టణ సిఐ రాజశేఖర్, ఆర్ఎస్ఐలు సురేష్, అశోక్, అన్వర్‌లు పాల్గొన్నారు.



## గౌరెల్లి-భద్రాచలం జాతీయ రహదారిలో భూములు కోల్పోతున్న రైతులకు భూమికి భూమి ఇవ్వాలి



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** రంగారెడ్డి జిల్లా గౌరెల్లి నుండి భద్రాచలం కొత్తగూడెం వరకు చేపడుతున్న జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులందరికి భూమికి బదులు భూమి లేదా ఎకరానికి రెండు కోట్ల నుండి మూడు కోట్ల రూపాయల వరకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు మాటూరి బాలరాజు, కొండమడుగు నర్సింహ్మాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భూ నిర్వాసితుల సంఘం, తెలంగాణ రైతు సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భూములు కోల్పోతున్న భూదాన్ పోచంపల్లి మండల, పట్టణ, వలిగొండ మండల పరిధిలోని ఆయా గ్రామాల రైతులతో కలిసి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఈ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ప్రాజెక్టుల పేరుతో, రోడ్ల పేరుతో, పరిశ్రమల పేరుతో వేలాది ఎకరాల భూములను రైతుల నుండి పంట పండే పచ్చటి పొలాలను తీసుకోవడం చాలా దారుణమని అన్నారు. భూదాన్ పోచంపల్లి మరియు వలిగొండ మండలాల్లో సుమారు 20 గ్రామాల్లోని 500 పైగా ఎకరాల భూమి గౌరెల్లి భద్రాచలం జాతీయ రహదారికి రైతుల నుండి తీసుకుంటున్నప్పుడు వారికి సరైన నష్టపరిహారము చెల్లించే కాడ ప్రభుత్వ వైఖరి చాలా దారుణంగా ఉందని అన్నారు. అనంతరం ధర్నా కార్యక్రమం దగ్గరికి వచ్చిన స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ రెడ్డికి, జిల్లా కలెక్టర్‌కి భూములు కోల్పోతున్న రైతులతో కలిసి చర్చించిన అనంతరం మెమోరండాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, సిఐటియు జిల్లా నాయకులు మంచాల మధు, భూ నిర్వాసితులు పిల్లాయిపల్లి మాజీ సర్పంచ్ అందెల హరీష్, గూడూరు బుచ్చిరెడ్డి, మల్ల రవీందర్, భీమిరెడ్డి నరేందర్ రెడ్డి, మామిళ్ల యాదయ్య పాల్గొన్నారు. అనంతరం భూనిర్వాసితుల కమిటీ కన్వీనర్‌గా గూడూరు బుచ్చిరెడ్డిని, కో కన్వీనర్‌గా మల్ల రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఐఎస్ఎన్ఎస్ కంపెనీలో చావుకేకలు

### బీహార్ కార్మికుడు అనుమనాస్పద మృతి



**ప్రజాపక్షం/ఎర్రవల్లి:** ఎస్ఎన్ఎస్ కంపెనీ ఒక బూత్ బంగ్లాగా మారింది. లోపల ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. ఉత్తరాది కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారు. ప్రమాదాల్లో వారు మరణించినా రహస్యంగా శవాలను తరలిస్తున్నారు. నిన్న బీహార్ రాష్ట్రానికి చెందిన ఒక కార్మికుడు కంపెనీలో అనుమానస్పదంగా మరణించాడు. కంపెనీ యాజమాన్యం చట్టానికి విరుద్ధంగా పోలీసులకు సమాచారం ఇవ్వకుండా కార్మికుడి శవాన్ని స్వరాష్ట్రానికి పంపించారు. అసహజ మరణం ఎదైనా పోలీసులకు తెలియజేయాలి. పోస్టుమార్టం నిర్వహించాలి. నిబంధనలు ఏవీ పాటించకుండా కార్మికుడి శవాన్ని ఎవరికీ కనిపించనివ్వకుండా మన రాష్ట్రాన్ని దాటించారు. మానవ విలువలకు తిలోదకాలు ఇచ్చి రసాయనాలు వెదజల్లి పరోక్షంగా జనాల చావు, కంపెనీలో కార్మికుల చావుకు కారణమవుతున్న కంపెనీపై చర్యలు తీసుకోవాలి. రాక్షసంగా వ్యవహరిస్తున్న కంపెనీ యాజమాన్యంను తక్షణమే అరెస్టు చేయాలి.

# గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/ నల్లగొండ :** ఒలంపిక్ క్రీడలలో మెడల్స్ సాధించే దిశగా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో సిఎం క్రీడా కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న సిఎం కప్ క్రీడా పోటీలలో భాగంగా ఈనెల 7, 8 తేదీలలో గ్రామాలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని, గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, హెడ్మాస్టర్, సీనియర్ ఆటగాడు కమిటీలో సభ్యులుగా ఉంటారని , అనంతరం మండల స్థాయికి వచ్చిన క్రీడాకారులతో ఈ నెల 10 నుండి 12 వరకు మండల స్థాయిలో సి ఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఈ పోటీలు ప్రత్యేక అధికారి అధ్యక్షతన, ఎంపీడీవో కన్వీనర్ గా, తహసిల్దార్, ఎంఈఓ, స్కూల్ గేమ్ ఫడరేషన్ తరఫున ఒకరు సభ్యులుగా ఉంటారని చెప్పారు. మండల స్థాయి క్రీడా పోటీల అనంతరం జిల్లా స్థాయిలో ఈ నెల 16 నుండి 21 వరకు 5 రోజులపాటు సిఎం క్రీడా కప్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లా కమిటీ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ,ఎస్పీ వైస్ చైర్మన్ గా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కోవైస్ చైర్మన్ గా ఉంటారని, స్పెషల్ ఆఫీసర్, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, డిఈఓ, జీఎం ఇండస్ట్రీస్, మున్సిపల్ కమిషనర్, ఎస్జీఎఫ్ డిస్టిక్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, డిపిఆర్ఓ, సీఈవో, డి ఐ ఓ ఆధ్వర్యంలో ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారని తెలిపారు.అన్నిస్థాయిలో క్రీడలను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రత్యేకించి పోటీలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి క్రీడాకారులను ప్రోత్సహించాలని ముఖ్యంగా 2028 లో నిర్వహించనున్న ఒలింపిక్స్ లో రాష్ట్రం నుండి మెడల్స్ సాధించే దిశగా క్రీడాకారులను తయారు చేయాలని ఆమె ఆదేశించారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డిఆర్ఓ అమరేందర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్ ,జిల్లా నూతన స్పోర్ట్స్ అధికారి నర్సిరెడ్డి తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఫిర్యాదుదారులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దు : ఫిర్యాదుదారులను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకుండా వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆమె ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ అనవసరంగా కాలయాపన చేయకుండా ఫిర్యాదుదారులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకుండా ఫిర్యాదులు పరిష్కరించాలని చెప్పారు. సోమవారం (66) మంది పిర్యాదుదారులు వారి ఫిర్యాదును సమర్పించారు.

జిల్లా వ్యాప్తంగా ప్రజా విజయోత్సవాలను : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 1 నుండి 9 వరకు నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న ప్రజా విజయోత్సవాలను జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలు, మండల స్థాయిలో స్థానిక ప్రజాప్రతినిధులను, ప్రజలను ,అధికారులను భాగస్వామ్యం చేస్తూ విజయోత్సవాలు ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.



## గురుకుల హాస్టల్ తనిఖీ

**ప్రజాపక్షం/భువనగిరి:** భువనగిరి పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టల్‌ను ఆర్డీవోతో కలసి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ మీరు మంచి విద్యను నేర్చుకొని మీ తల్లి తండ్రులు గర్వపడే విధంగా అభివృద్ధి చెందాలని కోరారు. హాస్టల్‌లో టాయిలెట్స్‌ను వంట గదిని సందర్శించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విదార్థులు స్పందిస్తూ చాలా భాగుందని తెలిపారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణారెడ్డి, మునిసిపల్ ఛైర్మన్ వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండి.ఆవేస్ చిస్తీ, కౌన్సిలర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకులలో ఫుడ్ పాయిజన్ రాజకీయ కుట్ర

### డిసిసి అధ్యక్షుడు శంకర్ నాయక్



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** గురుకుల పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాజకీయ కుట్రచేస్తునరని డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ ఆరోపించారు.సోమవారం పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టిసారించి అభివృద్ధి చేస్తుందని అన్నారు. దీనిని జీర్ణించుకోలేక ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కెసిఆర్ వంచన చేరి గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కుట్ర చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి ప్రయత్నిస్తున్నాడని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం సంక్షేమ హాస్టల గురించి ఏనాడు పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు 40 కాస్మోటిక్ చార్జీలను పెంచిందని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో గురుకుల పాఠశాల కార్యదర్శిగా ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నామినేషన్ పద్ధతిలో గురుకుల హాస్టల్లో ఎంతోమందిని నియమించుకొని తన వ్యక్తిగత బలాన్ని పెంచుకున్నాడని అన్నారు. వాళ్లంతా ఇప్పుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాటలు వింటూ ఫుడ్ పాయిజన్ గా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. ఈ విలేకర్ల సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, కత్తుల కోటి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జూలకంటి వెంకట్ రెడ్డి, రేగట్ట లింగస్వామి గౌడ్, చింతపల్లి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వన్య ప్రాణులు అడవులను రక్షిద్దాం



**ప్రజాపక్షం/నందికొండ:** వన్య ప్రాణులు,అడవులు, జీవవైవిధ్యాన్ని కాపాడుకో వలసిన బాధ్యత మనందరిపై ఉందని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, సాగర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పి రాఘవేంద్రరావు అన్నారు. సోమవారం ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా స్థానిక అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో విద్యార్థులకు అడవులు వన్యప్రాణులు, జీవ వైవిధ్యంపై అవగాహన కల్పించి చిత్రలేఖన పోటీలను నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవులను అడవులలో ఉండే మూగ జీవాలను రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వాటిని ఎవరైనా వేటాడితే చట్టపరంగా కఠినమైన శిక్షలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పర్యావరణ సంరక్షకులుగా పరిణితి చెందాలని వారు అడవులు,జంతువుల సంరక్షణ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సూ చిం చి వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్ ఎస్ఓబి రవీందర్, ఎఫ్‌బిఓ పాపారావు నాయక్, ఫా రెస్ట్ సిబ్బంది పాఠశాల ఏటిసి గాయత్రి పాల్గొన్నారు.

# ప్రైవేట్, ప్రభుత్వ సమన్వయంతో పోటీ పరీక్షలకు శిక్షణ

## కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి





**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల సమన్వయంతో విద్యార్థులకు పలు పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలల యజమానులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యజమానులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విధ్యార్థులకు వివిధ రంగాల్లో రాణించేందుకు ప్రైవేట్ పాఠశాల యజమానులు చేయూతనివ్వాలని, వారిని గతంలో కోరడం జరిగిందని తెలిపారు. ఇందుకు పలు ప్రైవేట్ సంస్థల యజమానులు ముందుకు వచ్చి ప్రభుత్వంతో పలు ఒప్పందాలు కుదుర్చుకోవడం అభినందనీయమన్నారు. ఇందులో భాగంగా పారమిత విద్యాసంస్థల ఆద్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విధ్యార్థులకు టెడ్ ఎడ్ కోచింగ్ ఇప్పటికే ప్రారంభమైందని తెలిపారు. అల్ఫోర్స్, సెయింట్ జార్జ్, వివేకానంద, సాధన, నందిని వంటి విద్యాసంస్థలు ఐఐటి, ఒలంపియాడ్, బాస్కెట్‌బాల్, మోరల్ ఎడ్యుకేషన్ టిఎస్‌ఆర్‌జెసి వంటి వివిధ పోటీలకు ప్రభుత్వ విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇచ్చేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. సమావేశంలో అడిషినల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్. ట్రెయినీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా కోఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, ప్రైవేట్ పాఠశాలల చైర్మన్లు పాల్గొన్నారు.

### ప్రజావాణి ధరఖాస్తులకు పరిష్కారం

ప్రజావాణిలో ఫిర్యాదు చేసే ధరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సంధర్భంగా అదనపు కలెక్టర్లు లక్ష్మి కిరణ్, ప్రఫుల్ దేశాయ్, నగరపాలక కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, శిక్షణ కలెక్టర్ అజయ్ యాదవ్‌తో కలిసి ధరఖాస్తులు స్వీకరించారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజావాణికి మొత్తం 259 ధరఖాస్తులు వచ్చాయి. వీటిలో ప్రధానంగా భూ సమస్యల పరిష్కారానికి అధికంగా వచ్చాయని కలెక్టర్ తెలిపారు.

### హెచ్ఐవి నివారణపై అవగాహన

హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి నివారణకు వైద్య సిబ్బంది ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం వద్ద జిల్లా కలెక్టర్ జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటరమణ, ప్రోగ్రామ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధి సోకిన వారు మందులు వాడుతూ ఉండాలన్నారు. అనంతరం స్థానిక ఫిలింభవన్‌లో ఎయిడ్స్ నివారణ, కుష్టు వ్యాధి కేసుల గుర్తింపు పక్షోత్సవాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆద్వర్యంలో సదస్సు జరిగింది. అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.సుధ, జిల్లా క్షయ నివారణ అధికారి డా.రవీందర్‌రెడ్డి, ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి సురేందర్‌రెడ్డి, పిఓఎం హెచ్ఎన్ డా.సనా జవేరియా పాల్గొన్నారు.

---

## అక్రమ మట్టి రవాణాను ఆపాలి

### అడిషనల్ కలెక్టర్‌కు ఎఐవైఎఫ్ నాయకుల వినతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** వరంగల్ జగిత్యాల జాతీయ రహదారి నిర్మాణం చేస్తున్న దిలీప్ బిల్డ్ అండ్ కంపెనీ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని మట్టిని తరలించకుండా ఆపాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మండ్లపల్లి యుగంధర్ సోమవారంప్రజావాణిలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ దిలీప్ బిల్డ్ అండ్ కంపెనీ కాంట్రాక్టర్ యథేచ్ఛగా గేడేదాని నుంచి గట్టుభుద్దెనపల్లి పోలంపల్లి గ్రామ శివారు నుంచి గుట్టలను గుల్ల చేస్తూ బండరాళ్లను ధ్వంసం చేసి అక్రమంగా మట్టిని జాతీయ రహదారి నిర్మాణ పనులకు వాడుకుంటున్నారన్నారు. సహజ ప్రకృతి వనరులైన గుట్టలను ధ్వంసం చేసి పెద్దఎత్తున మట్టిని తరలించి గుట్టలను మొలిచేస్తున్నారని, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారన్నారు. నిత్యం రాత్రింబవళ్లు బండరాళ్లను మట్టిని అక్రమంగా టిప్పర్ ద్వారా తరలించడంతో దుమ్ము ధూళితో రైతుల పంట పొలాలకు సైతం నష్టం దిగుబడి రాలేదన్నారు. జిల్లా యంత్రాంగంతో పాటు రెవెన్యూ, మైనింగ్ యంత్రాంగం స్పందించి సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లోకేష్ చందర్ తదితరులున్నారు.

## భూపోరాట యోధుడు బాలమల్లేష్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** భూ పోరాట యోధుడు బాల మల్లేష్ స్మృతి బాధాకరమని, ఆయన లేని లోటు పూడ్చలేనిదని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ రామగుండం నగర సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక భాస్కరరావు భవన్‌లో బాలమల్లేష్ సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సభ్యులు గోష్కు మోహన్, జిల్లా పూర్వ కార్యదర్శి కామ్రేడ్ గౌతమ్ గోవర్ధన్, ఏఐటియుసి కేంద్ర కార్యదర్శి కె.స్వామి తదితరులు బాలమల్లేష్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సభకు సిపిఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్ అధ్యక్ష వహించారు. కార్యక్రమంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి తాళ్లపల్లి మల్లయ్య ప్రజాసంఘాల నాయకులు మాటేటి శంకర్, మడికొండ ఓదేమ్ము, ఆసాల రమ, టి.రమేష్ కుమార్, సిరిసిల్ల మల్లేష్, శనిగరపు చంద్రశేఖర్, రేణికుంట్ల ప్రీతం, తిరుమల, బి.కనకయ్య, కె.జగన్, ఎర్రగోళ్ల దేవేందర్, తుశ్వర్,మొండయ్య, బి.విజయ, రేణుక, రాజమ్మ, గంగారపు చంద్రయ్య పాల్గొన్నారు.

## సమన్వయంతో పనిచేయాలి

### రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** డిసెంబర్ 4న పెద్దపల్లిలో ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, కార్యక్రమం సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రామగుండం సిపి ఎం.శ్రీనివాస్ అన్నారు. సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో డీసీపీ, ఏసీపీలు, సీఐలు ఎస్‌ఐలతో బందోబస్తు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దపల్లి డిసిపి చేతన, మంచిర్యాల డీసీపీ భాస్కర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, గోదావరిఖని ఏసీపీ రమేష్, పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, సిసిఎస్ ఏసీపీ వెంకటస్వామి, టాస్క్ ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన టిజిఒస్ కార్యవర్గం



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్(టిజిఒ) అసోసియేషన్ జిల్లా ఎన్నికల్లో ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు ఎంప్లాయిస్ జెఎసి చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంధర్భంగా నూతనంగా ఎన్నికైన టిజిఒస్ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్ , కార్యదర్శి అరవింద్‌రెడ్డితో పాటు కార్యవర్గాన్ని వారు అభినందించారు. కార్యక్రమంలో టిఎన్‌జిఒస్ జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్ రావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ నాగరాజు, లైబ్రేరియన్ రామ్మోహన్, వెంకటేశ్వరరావు, రామచంద్రారెడ్డి, రాజేశ్వరి, గడ్డం సుధాకర్, లక్ష్మి నరసింహారావు, రోహిత్, వీణ, మమత, అభినయ్‌రెడ్డి, రాజు, కొం డల్‌రెడ్డి, రాజమహేందర్ రెడ్డి, చంద్రకళ, రాజశేఖర్‌రెడ్డి, రాజశేఖర్ జో యల్ రాకేష్, హమీద్ షా, ఎంపిడివో శ్రీనివాస్‌రెడ్డి, రాజు నాయక్ తదితరులున్నారు.

## ప్రజావాణిపై ప్రజల్లో విశ్వాసం

### జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** ప్రజావాణి కార్యక్రమంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఏంతో నమ్మకంతో జిల్లా నలుమూలల నుండి తమ సమస్యలను విన్నవించుకొని పరిష్కారానికి ప్రజావాణికి వస్తారన్నారు. అంతే నమ్మకంతో అర్జీదారుల నుండి సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పొట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. 2010–2011లో చదువుకున్న విద్యార్థులు పాల్గొన్నారు. చదువు, పాఠశాలకు సంబంధించి తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు పరిచయ కార్యక్రమం చేపట్టుకొని క్షేమ సమాచారాలను తెలుసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు రాజరామ్మోహన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, జనార్ధన్, మోహన్, కిరణ్, స్వరూపరాణి, విజయలక్ష్మి, ఉమాసుందరి, సర్వర్, సురేష్‌లతోపాటు విద్యార్థులు సుమన్, మనోహార్, ప్రశాంత్, భాస్కర్, సురేష్, మహేష్, స్వప్న, ప్రేమలత, స్రవంతి, దివ్య, మనూషలు పాల్గొన్నారు.

---

## ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు : కలెక్టర్ సందీప్



**ప్రజాపక్షం /రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** ప్రజావాణికి వచ్చే అర్జీల పరిష్కారంలో జాప్యం చేయవద్దని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులకు స్పష్టం చేశారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఆయా శాఖలకు వస్తున్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ శాఖకు 34, ఉపాధి కల్పన శాఖకు3, ఎంపిడిఓ తంగళ్లపల్లికి 8, ఎంపిడిఓ ముస్తాబాద్‌కు 3, ఎంపిడిఓ ఎల్లారెడ్డిపేటకు 1, ఎంపిడిఓ కోనరావుపేటకు 2, ఎంపిడిఓ బోయినిపల్లికి 2, సిరిసిల్ల మున్సిపల్‌కు 10, డిఎం అండ్‌హెచ్‌వో 5, ఎస్డిసికి 3, విద్యాశాఖకు 2, డిఆర్‌డిఓ, డిడబ్ల్యుఓ, మార్కెటింగ్, టౌన్ ప్లానింగ్, ఎస్పీ ఆఫీస్, మైన్స్, పౌరసరఫరాల శాఖ ఆర్ అండ్‌బి, ఎంబి ఇంట్రా, సెస్, డిఎస్ సిడివో, కార్మిక శాఖ, జిల్లా దవాఖానా సిరిసిల్ల కార్యాలయాలకు ఒకటి చొప్పున వచ్చాయి. కార్యక్రమంలో ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సిఎం సభకు పకడ్బందీ ఏర్పాట్లు

### పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ముఖ్యమంత్రి పాల్గొనే సభకు పకడ్బంధీగా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. సోమవారం డిసెంబర్ 4న ముఖ్యమంత్రి పాల్గొనే సభా ప్రాంగణం పెద్ద రంగంపల్లి సబ్ స్టేషన్ సమీపంలో జరుగుతున్న ఏర్పాట్లను టిజిఎన్‌పిడిసిఎల్ ఎండి వరుణ్ రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం బహిరంగ సభ డిసెంబర్ 4 సాయంత్రం జరుగనున్నందని, సభకు అవసరమైనపనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పార్కింగ్ వద్ద అవసరమైన లైటింగ్ ఉండేలా చూడాలని, కార్యక్రమ నిర్వహణకు వీలుగా అవసరమైన లోడ్, డిమాండ్ తట్టుకునేలా విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. లైటింగ్‌కు వైరింగ్ పనులు సజావుగా పకడ్బందీగా జరిగేలా చూడాలన్నారు. సభాస్థలి వద్ద అదనపు ట్రాన్స్ ఫార్మర్లను సిద్ధం చేసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ అంతరాయం కల్గకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే సాయంత్రం జరుగుతున్న నేపథ్యంలో వెలుతురుకు ఎటువంటి సమస్య లేకుండా లైటింగ్ ఏర్పాట్లు ఉండాలన్నారు. స్టేజ్‌పై బ్యాక్ గ్రౌండ్‌లో ఎల్ఈడి స్క్రీన్, ఆడియో సిస్టంలకు విద్యుత్ కనెక్షన్ పక్కాగా అందించాలన్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే సభలో గ్రూప్–4, ఇతర వివిధ పోటీ పరీక్షలకు కింద ఎంపికైన 9 వేల మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలనుఅందజేయడం జరుగుతుందన్నారు. సభలో రుణమాఫీ జరిగిన రైతులు, పెద్ద సంఖ్యలో మహిళలు, ప్రజలు పాల్గొనే అవకాశం ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆర్‌డిఒ గంగయ్య , కమిషనర్ వెంకటేష్, తహసీల్దార్ రాజ్ కుమార్, ఇఇ ఆర్‌బీ భావ్‌సింగ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### జిల్లా ఆసుపత్రి వైద్య విభాగానికి ప్రత్యేక అభినందనలు

పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు అందే వైద్య సేవలు గణనీయంగా పెరిగాయని, దీనికి కృషి చేసిన వైద్య విభాగాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ నెలలో జిల్లా ఆసుపత్రిలో మొత్తం 10,539 ఔట్ పేషెంట్‌లు, 1,289 మంది ఇన్‌పేషెంట్లు వైద్య సేవలు పొందారని కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు 18 మందికి కంటి సర్జరీలు నిర్వహించామన్నారు. మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో మొత్తం 5,088 మంది ఔట్ పేషెంట్లు, 667 మందు ఇన్ పేషెంట్లు వైద్యసేవలు పొందారని, నవంబర్ నెలలో మొత్తం 210 ప్రసవాలు జరిగాయన్నారు. జిల్లా ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ విభాగం, కంటి శస్త్ర చికిత్స విభాగం, గైనకాలజిస్టులు, జనరల్ సర్జన్, ఇఎన్‌టి, డెంటల్ విభాగంలో నిపుణులైన డాక్టర్లు, అత్యాధునికమైన పరికరాలు, ప్రభుత్వ ఆసుపత్రిలో ఫిజియోథెరపీ సేవలు సైతం అందుబాటులో ఉన్నాయని వీటిని అవసరమైన ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

---

## ప్రజావాణి ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

### జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్



**ప్రజాపక్షం /జగిత్యాల ప్రతినిధి :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కార మార్గం చూపాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్లు బిఎస్ లత, గౌతమ్‌రెడ్డితో కలిసి కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ దరఖాస్తు దారుని సమస్య పై వచ్చే అర్జీలను ఆయా సంబందిత శాఖల అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకుని అర్జీదారునికి తెలియజేయాలన్నారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 35 ఫిర్యాదులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి ఆర్డీవోలు మధుసుధన్, ఎన్.శ్రీనివాస్, జివాకర్, కలెక్టరేట్ ఎఒ హన్మంతరావు, డిఆర్డిఏ రఘువరణ్ సంబందిత జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### నేడు జగిత్యాలలో ప్రజాపాలన విజయోత్సవాలు

రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవ సాంస్కృతిక కార్యక్రమాలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బి.సత్యప్రసాద్ ప్రకటనలో తెలిపారు. జగిత్యాల పట్టణంలోని ఎస్వీఎల్‌ఆర్ గార్డెన్‌లో సంగీత నాటక అకాడమీ చైర్ పర్సన్ అలేఖ్య పుంజల కళా బృందంతో జయ జయహే ప్రజాపాలన పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు., జిల్లాలోని ప్రజా ప్రతినిధులను ఆహ్వానించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పథకాలు, సాధించిన విజయాలను వివిధ కళారూపాల్లో ప్రదర్శిస్తారని వివరించారు. అధిక సంఖ్యలో నగర ప్రజలు, ఉద్యోగులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ కోరారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు : సిపి మహంతి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి తెలిపారు. సంబంధిత ఎసిపిల నుంచి అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులను నిర్వహించకూడదని తెలిపారు. అనుమతులు లేకుండా ఎటువంటి సభలు సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకూడదని, సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. అనుమతుల కోసం ధరఖాస్తు చేయడం ద్వారా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అట్టి కార్యక్రమానికి తగిన విధంగా పోలీసు శాఖ భద్రతాపరమైన చర్యలు చేపడుతుందన్నారు. ఈ చట్టం అమలులో ఉండగా ఇతరులను గాయపరిచే విధంగా ఉండే వస్తువులు, మారణాయుధాలను ధరించి సంచరించకూడదన్నారు. రోడ్లు, ప్రజలకు ఉపయోగపడే ఇతర స్థలాల్లో జనాన్ని సమీకరించకూడదని, జన సంచారం, అనుమతి పత్రాల్లో పేర్కొనబడిన ప్రాంతాల్లో మ్యూజిక్‌లు, పాటలు, ప్రసంగాలు, రణగొణ ధ్వనులు చేయవద్దని కోరారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 31 వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. శాంతిభద్రతలకు వరకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని సిపి తెలిపారు.

---

## వంద శాతం రైతు రుణమాఫీ పూర్తి

### ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి :** ఎన్నికల సమయంలో రాష్ట్ర రైతాంగానికి ఇచ్చిన రైతు రుణమాఫీ నూరు శాతం పూర్తి చేశామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతును రాజును చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ అడ్లూరి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడే నాటికి రూ.లు 7లక్షల కోట్ల అప్పు అప్పగించారని దానికి వడ్డీ, అసలు కలుపుకుని నెలకు రూ.లు 6500 కోట్లు చెల్లిస్తున్నామని చెప్పారు. ఖాళీ కుండను అప్పగించినప్పటికి ఇటు రాష్ట్ర ప్రగతితో పాటు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ రేవంత్ రెడ్డి సర్కారు ముందుకు వెళ్తుందన్నారు. ఏడాది కాలంలో రాష్ట్రంలోని 25లక్షల 35వేల 964 మంది రైతులకు రూ.లు 20వేల 616 కోట్లు రుణాలు మాఫీ చేశామని, ఏడాదిలో ఏ రాష్ట్రంలోను ఇంత పెద్ద మొత్తంలో రుణ మాఫీ చేసిన దాఖలాలు లేవన్నారు. రైతు రుణమాఫీ పై బిఆర్ఎస్ నాయకులు పదే పదే విమర్శలు చేస్తున్నారని, వారి మాటలు నమ్మే స్థితిలో ఏ ఒక్క రైతు లేరని తెలిపారు. ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపానలో జరిగిన ప్రగతిని ఈ నెల 4న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగే యువ వికాస్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కొక్కటిగా వివరిస్తారని సభకు నియోజకవర్గ పరిధిలోని రైతులు, ప్రజలు భారీగా తరలిరావాలని అడ్లూరి పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఎస్.దినేష్, వేముల రాజు, చిలుముల లక్ష్మణ్, సంగ నర్సింహులు, కుంట సుధాకర్, చీపిరిశెట్టి రాజేష్, కస్తూరి శ్రీనివాస్, స్థంభంకాడి గణేష్, ఎండి. షబ్బీర్, రాందేని మొగిలి, అప్పం తిరుపతి పాల్గొన్నారు.

## మెడికల్ హబ్‌గా రామగుండం

### రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్



**ప్రజాపక్షం/గోదావరిఖని:** గోదావరిఖనిలో ఇటీవల నూతనంగా మంజూరైన ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్ ఠాకూర్ సోమవారం ప్రారంభించారు. కళాశాల అవరణలో శిలాఫలకాన్ని ఆవిష్కరించి తరగతి గదులను ప్రారంభించారు. గత ప్రభుత్వ పాలనలో అసంపూర్తిగా వదిలేసిన మెడికల్ కాలేజి భవన నిర్మాణాలను తాము పూర్తి చేసినట్లు తెలిపారు. త్వరలో డెంటల్ కళాశాలను కూడ మంజూరు చేయిస్తానన్నారు.మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో రామగుండాన్ని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దుతానన్నారు. మదర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకొని వైద్యసేవలు అందించాలని నర్సింగ్ కళాశాల విద్యార్థినులను కోరారు. నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, మెడికల్ కాలేజీ సూపరిండెంటు హిమబిందు, కార్పొరేటర్ మహంకాళి స్వామి, పాతిపెల్లి ఎల్లయ్య, అధ్యాపకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### సిఎం పర్యటనపై ఎమ్మెల్యే సమీక్ష

ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఈనెల 4న పెద్దపల్లి జిల్లా పర్యటనకు రానుండటంతో సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ అరుణశ్రీ, పలు శాఖల అధికారులతో ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్ ఠాకూర్ సమావేశం నిర్వహించారు. సభ ఏర్పాట్లు, భద్రత, ఇతర అంశాలపై చర్చించారు.

---

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** కాంగ్రెస్ పాలనతోనే అభివృద్ధి సాధ్యం అని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి మద్దూరు మండల మాజీ జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, జనగామ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చెట్కూరి కమలాకర్ యాదవ్‌లు అన్నారు. ధూల్మిట్ట మండలం జాలపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ ముదిరాజ్ సంఘం నాయకులు పోతిరెడ్డి ఇస్తారి, విజయ్,రాజేందర్, కనకుంట్ల వెంకటేష్, అభిషేక్‌లు సోమవారం గిరి కొండల్‌రెడ్డి, కమలాకర్ యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు బండారం సాగర్ గౌడ్, మాజీ వార్డు సభ్యులు వెంకటేష్ యాదవ్, లింగాల లతసాగర్, నాయకులు యాదగిరి, రమేష్ పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు కృషి

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**ప్రజాపక్షం/గంగాధర :** గంగాధర మండలం కొండయ్యపల్లి గ్రామంలో మా ఊరి మహాలక్ష్మి ట్రస్టు రేండ్ల శ్రీనివాస్ పద్మ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ల పంపిణీ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చెందిన తుమ్మల హరేందర్ అనారోగ్యంతో చనిపోగా తనవంతు సహాయంగా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు. పది మంది ఆడపిల్లలకు రూ.5 వేల చొప్పున డిపాజిట్ చేసిన బాండ్లను అందజేశారు. మా ఊరి మహాలక్ష్మి ఫౌండేషన్ తరపున కొండయ్యపల్లె గ్రామంలో పుట్టిన ఆడపిలలలకు గత ఏడు సంవత్సరాలుగా ఒక్కొక్కరికి ఐదు వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను చేస్తున్నారు. మా ఊరి మహాలక్ష్మి ఫౌండేషన్ ఏడవ వార్షికోత్సవం సంధర్భంగా పదిమంది ఆడపిల్లలకు ఫిక్స్‌డ్ డిపాజిట్లను అందజేశారు. మహిళ సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహార్, వేముల భాస్కర్, జాగిరపు శ్రీనివాస్ రెడ్డి, సత్తు కనకయ్య, దుబ్బాసి బుచ్చయ్య, బూరుగు గంగన్న, రేండ్ల రాజిరెడ్డి, అట్ల రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



### విజయోత్సవ సభకు వేలాదిగా తరలిరావాలి

గ్రామస్థాయి నుంచి ప్రతి కార్యకర్త బాధ్యతతో తరలివచ్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పిలుపునిచ్చారు. గంగాధర మండలం మధురానగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఏడాదికాలం పూర్తి చేసుకున్న సంధర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న విజయోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 4న నిర్వహిస్తున్న సభలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. వేలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సలహాదారును కలిసిన ఎఎంసి చైర్మన్



ప్రజాపక్షం/నిజాంసాగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఎస్‌సి, ఎస్టీ, ఒబిసి, మైనార్టీ శాఖల ప్రధాన సలహాదారుడు మహ్మద్‌షబ్బీర్ అలీని పిట్లం ఏఎంసీ చైర్మెన్ చీకోటి మనోజ్‌కుమార్ సోమవారం కలిశారు. ఈ మేరకు షబ్బీర్‌అలీకి ఆయన పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

## ప్రజావాణికి 43 పిర్యాదులు: కలెక్టర్



ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధన్యత నిస్తూ పిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 43 పిర్యాదులు అందాయని తెలిపారు. జిల్లాలోని వివిద ప్రాంతాల నుండి వచ్చిన పిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ మాధురి (రెవెన్యూ) ట్రైనీ కలెక్టర్ మనోజ్, డిఆర్‌ఓ పద్మజ రాణి ,లకు విన్నవిస్తూ ఆర్జీలు సమర్పించారు. కాగా ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటి కప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవితను కలిసిన బిఆర్‌ఎస్ నాయకులు



ప్రజాపక్షం/ఎడపల్లి: ఎడపల్లి మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ కవిత స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు కుల గణనపై డెడికేషన్ కమీషన్ ను ఎమ్మెల్సీ కవిత కలవడంపై బీఆర్‌ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్సీ కవితకు కృతజ్ఞతలు తెలియచేశారు. బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. ఎమ్మెల్సీ కవితను కలిసిన వారిలో రవీందర్ గౌడ్, సురేష్ గౌడ్, గడ్డం శ్రీను, నాగేందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, మహబూబ్, అల్తాఫ్, షేక్ అహ్మద్, సుమన్, కృష్ణ, సాయిలు, సాయన్న ఉన్నారు.

## ఏడాది పాలనపై కళాజాత ప్రదర్శన



ప్రజాపక్షం/బోథ్ : బోథ్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద సోమవారం కళాజాత బృందం వారు ప్రదర్శన ఇవ్వడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన సందర్భంగా ఏడాదిలో చేపట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ కళాకారులు ప్రదర్శన ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పేద ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ప్రజాపాలన కళాబృందం సభ్యులు చాకటి రవీందర్, గట్టు వెంకట్ రావు, మామిడిపల్లి రాజలింగు గంజల రమేష్, మురళి, నరసయ్య, రాజు,శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్‌కు ఆర్టీసీలో ఆరోగ్య చికిత్సలు



ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధి : జహీరాబాద్ ఆర్టీసీ డిపోలో సోమవారం సంగారెడ్డి రీజయన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శృతివైద్య సేవలు అందించారు. డిపోలో 45 సంవత్సరాలు నిండిన డ్రైవర్లకు ఆరోగ్య చికిత్సలు చేశారు. డ్రైవర్లకు ఆరోగ్యపరంగా ఎలా ఉండాలనే అంశంపై సూచనలు సలహాలు, తెలియజేశారు. ముఖ్యంగా డ్రైవర్లు వారి యొక్క చెడు అలవాట్లను మానుకోవాలని ,ఆరోగ్య నియమాలు పాటించాలని కోరారు. జహీరాబాద్ డిపో గ్యారేజ్ అవరణలో మొక్కలు నాటారు. అనంతరం గేట్ మీటింగ్ నిర్వహించారు . ప్రత్యేకంగా డ్రైవర్ కండక్టర్ సిబ్బందికి ఆరోగ్యపరంగా తగు సూచనలు చేశారు. జహీరాబాద్ డిపో మేనేజర్, జాకీర్ హుస్సేన్, గ్యారేజ్, సూపర్వైజర్ తిరుమలేష్, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటిలో పురుగులు, చెత్తాచెదారం



ప్రజాపక్షం/ఎడపలి: తాగునీటిలో పురుగులు, చెత్తాచెదారం వచ్చిన సంఘటన సోమవారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో చోటుచేసుకుంది. సోమవారం ఎడపల్లి మండలం ఏఆర్పీ క్యాంప్ లో తాగునీటిలో జలగలు, ఇతర పురుగులు, చెత్తాచెదారం వచ్చిందని గ్రామస్తులు తెలిపారు. దీంతో తాము నీటిని తాగలేకపోతున్నామని వారు ఆవేధన వ్యక్తం చేశారు. సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాలని ఈ సందర్భంగా గ్రామస్తులు కోరారు.

## బడ్జెట్‌లో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి 20 శాతం పెరుగుదల

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: తెలంగాణలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి బడ్జెట్ కేటాయింపులో 20 శాతం పెరుగుదల జరిగిందని ఎంపీ ధర్మపురి అరవింద్ తెలిపారు. సోమవారం పార్లమెంట్‌లో బడ్జెట్ సమావేశంలో రైలే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఎంపీ అరవింద్ ప్రశ్నించగా రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం బడ్జెట్‌లో దాదాపు రూ.1000 కోట్లు, 20092014 వరకు కేవలం 87 కిలోమీటర్ల పనులు ప్రారంభించిన కాలంతో పోలిస్తే 2014 నుండి 2024 వరకు దశాబ్దంలో 650 కిలోమీటర్ల పనులను ప్రారంభించటం చారిత్రక సాక్ష్యమని తెలిపారని 647 శాతం పెరుగుదల అయ్యిందని వివరించినట్లు అరవింద్ ఒక ప్రకటనలో తెలిపారు.

# ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన

### కలెక్టర్ అభిలాష అభినవ్






ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : డిసెంబర్ 1న ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ప్రపంచ ఏయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రజల్లో హెచ్‌ఐవి, ఏయిడ్స్ పై అవగాహన పెంపొందించేందుకు జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. డిసెంబర్ 01, ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం నుండి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు నిర్వహించిన ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎయిడ్స్ వ్యాధిపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు సహాయర్థమై జిల్లాలో నాలుగు ఎయిడ్స్ నిర్ధారణ, కౌన్సిలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం ఎయిడ్స్ వ్యాధిగ్రస్థుల కోసం ఉచిత మందులతో పాటు ఆసరా పెన్షన్ అందించి ఆర్థికంగా ఆదుకుంటుందని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి అధికంగా ప్రబలే అవకాశం ఉన్న ప్రత్యేక వర్గాలను గుర్తించి ఎప్పటికప్పుడు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని బాధితులకు సత్వర చికిత్స అందించాలని తెలిపారు. ప్రజలందరూ ఆరోగ్యంగా జీవించేందుకు అవసరమైన మెడికల్ సదుపాయాలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హెచ్‌ఐవీ వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. అందరూ ఈ అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని సమాజాన్ని ఆరోగ్యవంతంగా మార్చడంలో సహకరించాలని కలెక్టర్ కోరారు. ర్యాలీ సందర్భంగా కళాకారులు డప్పు పాటలతో ప్రజలకు ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రత్న కళ్యాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్, తహసీల్దార్లు రాజు, సంతోష్, ఆశా కార్యకర్తలు, కళాకారులు, విద్యార్థులు, వైద్యాశాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న కలెక్టర్, ఎస్‌పి

ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి: మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటనకు సోమవారం వెళ్లిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్ మెదక్ జిల్లా కేంద్రానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఇదే సమయంలో మెదక్ మక్త భూపతిపూర్ గ్రామానికి చెందిన రాజు చిన్న శంకరంపేట మండల కేంద్రంలో సెక్యూరిటీ గార్డ్ గా విధులు నిర్వహించుకుని బైక్ పై ప్రయాణం చేస్తుండగా కొరివి పల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలోబైకు అదుపుతప్పి రోడ్డుపై పడ్డాడు. అదే సమయంలో మెదక్ వైపు వస్తున్న జిల్లా పాలన అధికారులు ప్రమాద దృశ్యాన్ని చూసి వాహనాలను ఆపి హుటాహుటిన ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. రాజుకు ప్రథమ చికిత్స నిమిత్తం కలెక్టర్ వైద్యాధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా పాలనాధికారులు చూపించిన మానవతా దృక్పథానికి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



## రైతుల ఖాతాలలో రూ. 7కోట్ల 91లక్షల జమ

### అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్



ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : ప్రభుత్వ ఆదేశానుసారం మంచిర్యాల జిల్లాలో 315 వరిధాన్యం కొనుగోలు ద్వారా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి 7 కోట్ల 91 లక్షల రూపాయల నగదు సంబంధిత రైతుల ఖాతాలలో నమోదు చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్ తెలిపారు. జిల్లాలో ప్రతిపాదించిన 326 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇప్పటి వరకు 315 కోనుగోలు కేంద్రాల ద్వారా 8వేల 50 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి సంబంధిత 502 మంది రైతుల ఖాతాలలో 7 కోట్ల 91 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 13 రైస్‌మిల్లులకు సిఎంఆర్ అనుమతులు జారీ చేయడం జరిగింధని తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కారం

### కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం/మంచిర్యాల: ప్రజావాణి కార్యక్రమంలో అందిన ధరఖాస్తులను సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేసి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలో కలెక్టర్ కార్యాలయంలో మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వమండల అధికారులు శ్రీనివాసరావు, హరికృష్ణలతో కలిసి అర్జిదారుల నుండి ధరఖాస్తులను స్వీకరించారు. జె.రాజశేఖర్ తన ధరఖాస్తులో జిల్లాలోని బెల్లంపల్లి పరిధిలో గల కాసిపేట సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల సమీపంలో గ్యాస్‌గోదాము ఉన్నందున ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోక ముందే ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టి కళాశాలను మరొక ప్రాంతానికి తరలించాలని, విద్యార్థులను ప్రమాదాల బారి నుండి కాపాడాలని కోరుతూ ధరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీనికి చెందిన సీలం మల్లమ్మ తాము కూలి పని చేసుకుంటూ జీవించే నిరుపేదలమని, తమకు ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ ఆర్జీ సమర్పించారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి డి.శ్రీకాంత్ తన ధరఖాస్తులో జిల్లాలోని విద్యార్థులకు రావాల్సిన ఫీజు రియంబర్స్ మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేయాలని, వసతిగృహ విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభించాలని, కస్తూరిబా గాంధి బాలికల విద్యాలయాలలో విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కోరారు.

## బాలమల్లేష్ మృతి కమ్యూనిస్టుపార్టీకి తీరని లోటు


### జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్



ప్రజాపక్షం /నస్పూర్: సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ అమరజీవి నక్క బాల మల్లేష్ అకాల మరణం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు అని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నస్పూర్ లోని నరసయ్య భవన్ లో ఆయన మృతికి సంతాపం తెలుపుతూ చిత్రపటానికి పూలమాలలు వేసి జిల్లా కార్యదర్శి, మండల కార్యదర్శి జోగుల మల్లయ్య నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ..ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అధ్యక్ష, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శిగా వివిధ బాధ్యతలు నిర్వర్తిస్తూ సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి స్థాయికి ఆయన ఎదిగారని కొనియాడారు. అటువంటి గొప్ప వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులైన ఆయన అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) లో చేరారన్నారు. విద్యార్థి సంఘంలో పని చేస్తూనే సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్ రెడ్ బాధ్యతలు నిర్వర్తించారని అన్నారు. హైదరాబాద్ లక్డికాపూల్ బాబూ జగ్జీవన్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఎఐఎస్ఎఫ్ నుంచి ఆయన ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 1990 దశకంలో క్యాపిటేషన్ ఫీజుకు వ్యతిరేకంగా, ఇతర విద్యార్థి సమస్యలపై ఉవ్వెత్తున జరిగిన ఉద్యమాల్లో ఆయన క్రియాశీలక పాత్ర పోషించారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎ ఐ ఎస్ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అధ్యక్షు, ఎ ఐ వై ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా బాధ్యతలు నిర్వర్తించగా, ఇటీవలే సిపిఐ జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి లింగం రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు కారుకురి నగేష్, రేగుంట చంద్రశేఖర్, జిల్లా సమితి సభ్యులు మిర్యాల రాజేశ్వరరావు, మొగిలి లక్ష్మణ్, అల్లా లచ్చిరెడ్డి,భాకం శంకర్, జోగుల ఆంజనేయులు, ఎండి రషీద్ పాల్గొన్నారు.

## లక్ష్మి కుటుంబానికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తాం: ఎంఎల్‌ఎ పాల్వాయి

ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్: పెద్దపులి దాడిలో మృతిచెందిన మోర్లే లక్ష్మి కుటుంబానికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని సిర్పూర్ ఎంఎల్‌ఎ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మృతురాలు లక్ష్మి కుటుంబాన్ని ఎంఎల్‌ఎ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులిదాడిలో లక్ష్మి మృతిచెందడం బాధాకరమని అధైర్యపడవద్దు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఎంఎల్‌ఎ వెంట భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ దోతుల శ్రీనివాస్, ముక్కెర శేఖర్, రవీందర్ ఉన్నారు.



## పులి అలజడి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం/పెంచికల్ పేట్: పెంచికల్ పేట్ మండలం అటవీ ప్రాంతంలో పెద్దపులి అలజడి ఉన్నందున మండల పలు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కొమురయ్య అన్నారు. మండలంలోని పులి సంచరిస్తున్న గ్రామాల్లోని ప్రజలకు ఎస్ఐ పలు జాగ్రత్తలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రైతులు ఎవరు ఒంటరిగా పంట పొలాల్లోకి వెళ్ళకూడదని, చేన్లలోకి వెళ్ళేవాల్లు తప్పకుండా ఒక కర్ర తీసుకొని గుంపులు గుంపులుగా వెళ్ళాలని సూచించారు. పులి పాదముద్రలు, పులులు కనిపిస్తే వెంటనే అటవీ, పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

## గిరిజన విద్యార్థికి అండర్ 14లో రెండవ స్థానం ...



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్: జాతీయ స్థాయి అర్చరీ లో అండర్ 14 లో రెండవ స్థానం నిలిచినా రిగిజన విద్యార్థి శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామిజి స్థాపించిన జీయర్ గురుకులం అల్లంపల్లి కడెం మండల పాఠశాల విద్యార్థులు గుజరాత్ రాష్ట్రంలో జరిగిన 19.11.2024 నుండి 21.11.2024 జాతయ స్థాయి అర్చరి అండర్ 14 విభగంలో పి.జగన్ 8వ తరగతి,ఎం.హరి ఓం, బి.శశివర్ధాన్ జాతీయ స్థాయిలో సిల్వర్ మెడల్ రావడం జరిగిందని అన్నారు.ఈ సందర్భంగా విద్యార్థినికి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జే.అంబాజీ,జిల్లా విద్య శాఖా అధికారి రామారావు,ఆర్ శివాజీ,ఎసియఓ ఎస్టీటీ (sctry) రవీందర్ గౌడ్ పాఠశాల ప్రిన్సిపాల్ శాంత రామ్,చక్రధారి సాగర్ కోచ్ జుగాదిరావు ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేసారని నిర్మల్ జిల్లా స్పోర్ట్స్ అధికారి భూక్య రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

## వెనుకబడిన వర్గాలకు న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం



ప్రజాపక్షం/పటాన్‌చెరు: వెనుక బడిన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని అన్ని వర్గాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో న్యాయం జరుగుతుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు రాజ్ అన్నారు. వేముల వాడ నియోజకవర్గంలోని కొనరావు పేట మండల కేంద్రం బస్టాండ్ ఆవరణలో మండల మత్స్య సంఘం ఆద్వర్యంలో జరిగిన ఆత్మీయ సత్కార కార్యక్రమానికి ప్రభుత్వ విఫ్ వేముల వాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగాపాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారిరువురికి ఘన స్వాగతం పలికి సత్కరంచారు. అంతకు ముందు వేదికపై తెలంగాణ ఉద్యమ కారుడు పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి పూల మాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నీలం మదు మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయంలో నిర్లక్ష్యం చేయబడ్డ వెనుకబడిన తరగతులైన బీసీ ల అభ్యున్నతికి ముఖ్యమంత్రి రేవంత్ నాయకత్వంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాదాన్యత ఇస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో బీసీ కులగణన ద్వారా జనాభా ప్రతిపాదికన రాజీకీయ అవకాశాలు కల్పించే దిశగా నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. బిసి కుల గణన పూర్తయితే బీసీలలో అగ్ర స్థానంలో ఉన్న కులాలన్ని రాజకీయంగా అవకాశాలు పెరుగుతాయని స్పష్టం చేశారు. చరిత్ర లో ఎన్నడూ లేని విధంగా బీసీ బిడ్డల రాజకీయ అభ్యున్నతి కోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి మనమంతా మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సభాద్యక్షులు కీసర శ్రీనివాస్ కాంగ్రెస్ కొనరావు,పేట మండల్ ప్రెసిడెంట్ పీరోజ్, ఫాషా , కిసాన్, కాంగ్రెస్ జిల్లా అద్యక్షులు జగన్మోహన్ రెడ్డి ,మార్కెట్ కమిటీ చైర్మన్ కిచ్చలా ఎల్లయ్య, ఫిషరీస్ జిల్లా అద్యక్షులు శ్రీనివాస్ ,దేవ రాజ్, స్వామి ,సురేష్‌కుమార్, మత్స్య శాఖ సభ్యులు మహిళలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

## ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

### కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి : ప్రజారోగ్యంపైనే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని అందులో భాగంగానే ఘనంగా ఆరోగ్య ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తికానున్న నేపథ్యంలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆరోగ్య ఉత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. వర్చువల్ పద్ధతిలో పారామెడికల్, నర్సింగ్ స్కూల్, ట్రాన్స్ జెండర్ క్లినిక్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను, మైత్రి మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ప్రారంభించగా, స్థానికంగా జ్యోతి ప్రజ్వలన చేసి కలెక్టర్ రాహుల్ రాజ్ లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ట్రాన్స్ జెండర్ క్లినిక్ సూపరిండెంట్ శివ దయాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ కమలాదేవి, డిసిహెచ్‌ఎస్ సూపరిండెంట్ శివ దయాల్, ప్రొఫసర్ శాంత కుమారి, గైనకాలజిస్ట్ హెచ్‌ఓడి శాంత కుమారి, వైస్ ప్రిన్సిపల్ వాణి పద్మజ వైద్యారోగ్య శాఖ అధికారులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో ప్రజావాణి దరఖాస్తుల పరిశీలన

### కలెక్టర్ వెంకటేష్ దోత్రే



ప్రజాపక్షం/ఆసిఫాబాద్: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. చింతల మానేపల్లి మండలం బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన బొర్కుట జగ్గయ్య తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని, తిర్యాణి మండలం రొంపల్లి గ్రామానికి చెందిన కోలం గిరిజనులు తమకు ఇండ్ల నివాస స్థలాలు మంజూరు చేయాలని, తిర్యాణి మండలం నాయకపు గూడ గ్రామానికి చెందిన మెంద్రపు లక్ష్మి తన భర్త పేరిట ఏదులపాడ్ గ్రామ శివారులో గల పట్టా భూమిని ఇతరులు అక్రమంగా తమ పేరిట మార్చుకున్నారని, ఇట్టి పట్టాను రద్దు చేసి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, అర్జీదారులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 80 ఫిర్యాదులు



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 80 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, సహాయ కలెక్టర్ (యుటి) సంకేత్‌కుమార్, డీఆర్‌డీఓ సాయగౌడ్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఇన్‌చార్జి డీపీఓ శ్రీనివాస్, నిజామాబాద్ ఎసిపి రాజావెంకట్‌రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడ

చరిత్రలో తొలిసారి...

# భారత్–పాకిస్థాన్ క్రికెట్ ఒప్పందం!




ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై సందిగ్ధత తొలగినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తున్న ఈ మెగా టోర్నీ హైబ్రిడ్ మోడల్‌లో జరగనున్నట్లు సమాచారం. అయితే మొన్నటివరకు ఛాంపియన్స్ ట్రోఫీ జరగడం అనుమానంగా సాగింది. పాకిస్థాన్‌కు ఎట్టిపరిస్థితుల్లో టీమిండియాను పంపించమని బీసీసీఐ స్పష్టం చేయడం, మరోవైపు హైబ్రిడ్ మోడల్‌లోనే టోర్నీ నిర్వహిస్తామని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) పట్టుబట్టడంతో.. టోర్నీ నిర్వహణపై అనిశ్చితి ఏర్పడింది. కానీ ఇటీవల ఐసీసీ నిర్వహించిన సమావేశంలో పాక్ బోర్డు హైబ్రిడ్‌మోడల్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రెండు షరతులతో అంగీకరించింది. హైబ్రిడ్ మోడల్ కారణంగా తమ ఆదాయానికి గండి పడుతుందని, కాబట్టి ఐసీసీ నుంచి వచ్చే రెవెన్యూను అధిక మొత్తంలో పెంచాలని షరతు పెట్టింది. అంతేగాక తమ జట్టును కూడా ఇండియాకు పంపించమని మరో షరతు తెలిపింది. అయితే తాజాగా మరో విషయం బయటకు వచ్చింది. భారత్–పాకిస్థాన్ మధ్య క్రికెట్ ఒప్పందం నిర్వహించడానికి ఐసీసీ చర్యలు తీసుకున్నట్లు పాక్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. వచ్చే మూడేళ్ల పాటు ఈ ఒప్పందం అమల్లో ఉంటుందని తెలిపింది. ఒప్పందంలో భాగంగా వచ్చే మూడేళ్లలో భారత్–పాక్ తలపడే మ్యాచ్‌లు.. తమ సొంతగడ్డపై నిర్వహించడానికి కుదరదు. తటస్థ వేదిక అయిన దుబాయ్‌లో నిర్వహించాల్సి ఉంటుంది. అయితే వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ మినహా మెగాటోర్నీలకు పాకిస్థాన్ ఇప్పట్లో ఆతిథ్యం ఇచ్చే పరిస్థితులు లేవు. కానీ భారత్‌లో వచ్చే ఏడాది ఉమెన్స్ వన్డే వరల్డ్ కప్, మెన్స్ ఆసియా కప్ జరగనుంది. అంతేగాక 2026లో శ్రీలంకతో సంయుక్తంగా మెన్స్ టీ20 వరల్డ్ కప్కు ఇండియా ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ ఒప్పందంతో భారత్‌కు కలిసొచ్చేదేమి లేదు. కాగా, 2008 ముంబయి దాడుల అనంతరం భారత జట్టు పాకిస్థాన్‌లో పర్యటించని విషయం తెలిసిందే. ద్వైపాక్షిక సిరీస్‌లతో పాటు ఆసియా కప్ వంటి టోర్నీల కోసం టీమిండియా తమ దేశానికి రావాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఎన్నిసార్లు విన్నవించినా బీసీసీఐ అంగీకరించలేదు.

# 7 నుండి సిఎం కప్ –2024 క్రీడోత్సవాలు

గ్రామ పంచాయతీ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు 36 ఈవెంట్స్‌లో క్రీడా పోటీలు



**ప్రజాపక్షం / హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రాన్ని నెంబర్ వన్ క్రీడా రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7 నుండి జనవరి 2వ తేదీ వరకు 36 ఈవెంట్స్‌లో 'సిఎం కప్–2024' క్రీడోత్సవాలను నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ విస్తృత ఏర్పాట్లు చేస్తున్నది. ఈ క్రీడోత్సవాలను విజయవంతం చేయడానికి ఈ నెల 7,8 తేదీలలోపు ఆన్‌లైన్‌లో cmcup2024.telangana.gov.in లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని క్రీడాకారులకు తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ విజ్ఞప్తి చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జారీచేసిన దిశా నిర్దేశాలు, ఆదేశాలకు అనుగుణంగా పోటీలలో పాల్గొనే ప్రతి క్రీడాకారుని ప్రతిభను మదింపు చేసి, ప్రోత్సాహిస్తారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసి, వారిని ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో ప్రథమంగా గ్రామ పంచాయితీ, మండల, మున్సిపాలిటీ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ కేటగిరీలలో పోటీలు జరుగుతాయి. ఎన్నడూ లేనివిధంగా సమాజంలో అందరూ భాగమనే భావనతో పారా క్రీడాకారులను కూడా సిఎం కప్–2024లో భాగస్వాములను చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ నెల 7,8 తేదీలలో గ్రామ పంచాయితీ స్థాయి పోటీలతో సిఎం కప్ 2024 క్రీడోత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ నెల 10 నుండి 12వ తేదీ వరకు మండల, మున్సిపల్ స్థాయిల్లో క్రీడా పోటీలు జరుగుతాయి. ఈ నెల 16 నుండి 21 వ తేదీ వరకు జిల్లా స్థాయిలోను, 27 నుండి జనవరి 2వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు జరుగుతాయి. ప్రతి క్రీడాకారునికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో 36 క్రీడాంశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు క్రీడా ప్రాధికార సంస్థ ప్రకటించింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో అంతర్జాతీయ స్థాయి క్రీడా ప్రమాణాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రాష్ట్రస్థాయి క్రీడల పోటీలను 7 చోట్ల నిర్వహించనున్నట్లు తెలిపింది. హైదరాబాద్‌తో పాటు కరీంనగర్, హన్మకొండ, వరంగల్, ఖమ్మం, మెదక్, మహబూబ్‌నగర్‌లలో నిర్దేశించిన ఈవెంట్స్‌లో రాష్ట్ర స్థాయి క్రీడల నిర్వహణకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఏర్పాట్లు చేస్తున్నది.

రీల్




## 'కన్నప్ప'లో అరియానా, వివియానా !

**మం**చు ఫ్యామిలీ నుంచి మరో తరం తెరపై సందడి చేయడానికి రెడీ అయ్యింది. ఇప్పటికే, హీరో మంచు విష్ణు కుమారుడు అవ్రామ్ 'కన్నప్ప'లో ఓ కీలకమైన పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు విష్ణు కుమార్తెలు అరియానా, వివియానా ఈ చిత్రంలో కనిపించనున్నట్లు మోహన్‌బాబు తెలిపారు. వీరికి సంబంధించిన ఫొటోను ఆయన పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా 'కన్నప్ప'తో నా మనవ రాళ్లు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నందుకు ఆనందిస్తున్నాను. నటనపై వాళ్లకు ఉన్న అభిరుచి చూసి నాకెంతో గర్వంగా ఉంది. పరిశ్రమలో వారికి గుర్తింపు రావాలని ఎంతోమందిలో స్ఫూర్తి నింపాలని కోరుకుంటున్నా' అని మోహన్ బాబు పోస్ట్ పెట్టారు. 'కన్నప్ప' సినిమా విషయానికొస్తే.. మంచు విష్ణు టైటిల్ పాత్రలో ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో రానున్న పాన్ ఇండియా సినిమా ఇది. మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ప్రీతి ముకుందన్ కథానాయిక. ప్రభాస్, అక్షయ్ కుమార్, శరత్‌కుమార్, మోహన్‌లాల్ వంటి స్టార్స్ ఈ సినిమాలో నటిస్తున్నారు.




## సంక్రాంతికి వస్తున్నాం'సాంగ్ రిలీజ్

**టా**లీవుడ్‌లో తెరకెక్కుతున్న చిత్రాల్లో 'సంక్రాంతికి వస్తున్నాం' ప్రేక్షకుల్లో పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేస్తోంది. ఈ సినిమాను దర్శకుడు అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తుండగా స్టార్ హీరో విక్టరీ వెంకటేష్, మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ ముఖ్య పాత్రల్లో నటి స్తున్నారు. ఈ సినిమా నుండి రిలీజ్ అయిన పోస్టర్స్, మేకింగ్ వీడియోలు మంచి అంచనాలను క్రియేట్ చేశాయి. ఇక ఈ సినిమా నుండి ఫస్ట్ సింగిల్ సాంగ్‌గా 'గోదారి గట్టు'ని మేకర్స్ రిలీజ్ చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు. డిసెంబర్ 3న ఉదయం 11.07 గంటలకు ఈ సాంగ్‌ని రిలీజ్ చేస్తున్నట్లు తాజాగా ఓ పోస్టర్ ద్వారా వెల్లడించారు. ఈ పాటను పాపులర్ సింగర్ రమణ గోగుల చాలా గ్యాప్ తరువాత పాడుతుండటంతో ప్రేక్షకుల్లో ఈ పాటపై మంచి ఇంట్రెస్ట్ క్రియేట్ అయ్యింది. ఇక ఆయనతో పాటు సింగర్ మధుప్రియ కూడా ఈ పాటను పాడింది. ఈ పాటలో ఐశ్వర్య రాజేష్, వెంకటేష్‌ల రొమాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమాను సంక్రాంతి కానుకగా జనవరి 14న గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అయ్యారు.




## 'ముఫాసా' పోస్టర్.. అదుర్స్

**మ**న టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా దర్శక దిగ్గజం ఎస్ ఎస్ రాజమౌళితో మహేష్ డైరెక్ట్ పాన్ వరల్డ్ సినిమా లోకి ఎంటర్ కానున్నారు. అయితే ఈ గ్యాప్ లో రీ రిలీజ్ లతో ఫ్యాన్స్ సరిపెట్టుకుంటున్నారు. కానీ తన నుంచి మాత్రం తన ప్రెజెన్స్ తో రాబోతున్న కొత్త సినిమానే ముఫాసా. హాలీవుడ్ సెన్సేషనల్ హిట్ లయన్ కింగ్ ఫ్రాంచైజ్ లో వస్తున్న సినిమా ఇది కాగా దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. మరి ఈ సినిమాలో మెయిన్ లీడ్ సింహానికి మహేష్ చేత ప్రముఖ సంస్థ వాల్ట్ డిస్నీ వారు డబ్బింగ్ చెప్పించుకున్న సంగతి అందరికీ తెలిసిందే. ఇక ఈ సినిమా రిలీజ్ కి దగ్గరకి వస్తున్న తరుణంలో ఇపుడు మేకర్స్ నుంచి మహేష్ తో సాలిడ్ పోస్టర్ బయటకి వచ్చింది. మరి తమ సింహం ముఫాసా పక్కనే మహేష్ తో కలిపి విడుదల చేసిన పోస్టర్ ఇపుడు ఫ్యాన్స్ కి మంచి కిక్ ఇస్తుంది. తన డబ్బింగ్ ఇప్పటికే ట్రైలర్ లో ఎంతో అలరించగా ఈ సినిమా కోసం అభిమానులు చాలా ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నారు. మరి ఈ సినిమా డిసెంబర్ 20న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజ్ కాబోతోంది.




## 'ఘంటసాల' బయోపిక్ విడుదల తేదీ ఖరారు..

**మ**న తెలుగు సినిమా ఉన్నన్నినాళ్లు గుర్తుండిపోయే అతి కొంత మంది పేర్లలో గాన గాంధర్వ ఘంటసాల గారి పేరు కూడా ఒకటి. మరి మన తెలుగు సినిమా వృద్ధి చెందుతున్న మొదట్లో తన సంగీతం అలాగే తన గానంతో తెలుగు సినిమా సంగీతానికి ప్రాణంలా నిలిచిన ఘంటసాల గారి గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే అవుతుంది అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. తన గొంతులోని మాధుర్యంతో ఎన్నో పాటలు ఇప్పటికీ చెరగనివిగా నిలిచిపోయాయి.మరి ఇలాంటి మహనీయుని భావి తారలు కూడా గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరి తన జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కించిన లేటెస్ట్ సినిమానే ఘంటసాల ది గ్రేట్ అనేది ఉప శీర్షిక. దర్శకుడు సి హెచ్ రామారావు తెరకెక్కించిన ఈ చిత్రం తాలూకా ఫస్ట్ లుక్ పోస్టర్స్ ని మాజీ ఉప ప్రధాని వెంకయ్య నాయుడు నేడు విడుదల చేశారు. మరి దీనితో ఈ సినిమాని వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న రిలీజ్ కి సిద్ధం చేస్తున్నట్టుగా ఇపుడు కన్ఫర్మ్ చేశారు. మరి ఈ చిత్రం ఎలా ఉంటుందో చూడాలి.

## ఢిల్లీ–నోయిడా 'రణరంగం'

(మొదటి పేజీ తరువాయి)

భూములకు ప్రభుత్వం పరిహారం పెంచాలని, ఇతర డిమాండ్లతో అక్కడ రైతులు దాదాపు సోమవారం నాడు ఉదయం 1130గంటలకు పెద్దయెత్తున గుమిగూడి అక్కడి నుంచి నిరసన ప్రదర్శనను ప్రారంభించారు. భారతీయ కిసాన్ పరిషత్ (బికెపి) ఈ నిరసన ప్రదర్శనకు పిలుపునిచ్చింది. బికెపి నాయకులు వెల్లడించిన ప్రకారం..ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అలీఘడ్, ఆగ్రా సహా 20జిల్లాలకు చెందిన రైతులు ఈ మార్చ్‌లో పాల్గొన్నట్లు వెల్లడించారు. వివిధ రైతువిభాగాలకు చెందిన వారు బ్యానర్లు పట్టుకుని, జెండాలు చేతబూని నిరసనలు తెలిపారు. నోయిడా పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను అడ్డు తొలగించారు. కొంతమంది బారికేడ్లను ఎక్కారు. మరికొంతమంది బారికేడ్లను నెట్టిపారేయడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. చిల్లా సరిహద్దుకు ఒక కిలోమీటర్ దూరంలోని నోడియా లింక్ రోడ్డుపై దళిత్ ప్రేరణ స్థల్ దగ్గరలోపోలీసులు వారిని నిలువరించారు. ఈ నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దులలో తనిఖీలు చేస్తున్నామని, నిఘాకోసం డ్రోన్‌లను ఏర్పాటు చేశామని ఒక సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. ఢిల్లీ తూర్పు జోన్ అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఎసిపి) సాగర్ సింగ్ కల్సీ మాట్లాడుతూ 'మేం తూర్పు ఢిల్లీ సరిహద్దులో సరిపోను ఏర్పాట్లు చేశాం. అల్లర్ల నిరోధక పరికరాల ఏర్పాటు సహా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నాం. మేం అప్రమత్తంగా ఉండటానికి డ్రోన్‌లను వినియోగిస్తున్నాం. ఢిల్లీ తూర్పు ప్రాంతంలో వాహనాల రాకపోకలను సులభతరం చేయడానికి ట్రాఫిక్ పోలీసులతోనూ సమన్వయం చేసుకుంటున్నాం' అని చెప్పారు. చిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన బారికేడ్ల వల్ల ప్రయాణికులకు తీవ్రస్థాయిలో అసౌకర్యం ఏర్పడుతున్నది' అని గ్రేటర్ నోయిడా నివాసి అపరాజితా సింగ్ చెప్పారు. ఢిల్లీనోయిడా సరిహద్దుకు ఇరువైపులా పోలీసులు నెలకొల్పిన బారికేడ్ల మూలంగా ట్రాఫిక్ రద్దీ పెరిగిందని, దీంతో ప్రత్యేకించి నోయిడా నుంచి ఢిల్లీకి వెళ్లే క్యారేజీ వే విస్తీర్ణంలో నడవడానికి తనకు దాదాపు గంట సమయం పట్టిందని ఆమె తెలియజేసింది. జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (దక్షిణ రేంజి) ఎస్‌కె.జైన్ మాట్లాడుతూ నోయిడా పోలీసులతో సైతం సమన్వయం చేసుకుంటున్నామని వివరించారు. మాకు ఆగ్నేయ జిల్లాలో డిఎన్‌డి సరిహద్దు, కాళింది కుంజ్ అనే రెండు కీలక సరిహద్దులు ఉన్నాయని, భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్) సెక్షన్ 163 విధించబడిందని, పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయి కాబట్టి అనుమతి లేకుండా నిరసనలు చేయడం ఖచ్చితంగా నిషేధించబడినాయని, వీటిని చక్కదిద్దేందుకు రెండు సరిహద్దు ప్రాంతాలలో తగినన్ని బారికేడ్లను పెంచడం జరిగిందని, జెర్సీ అడ్డంకులు, హైడ్రా క్రేన్లను కూడా రెండు సరిహద్దు ఏరియాలలో నియమించామని, ఎవ్వరు బలవంతంగా లోపలకు చొచ్చుకువచ్చేందుకు ప్రయత్నించినా మేం నిలువరిస్తామని ఎస్‌కె.జైన్ తెలియజేశారు. అయితే ప్రస్తుతం సరిహద్దు వద్ద ట్రాఫిక్ సాధారణ పరిస్థితికి చేరుకుని రాకపోకలు సులభతరంగా సాగుతున్నాయని జైన్ చెప్పారు. నోయిడాకు చెందిన మరో ప్రయాణికుడు అమిత్ ఠాకూర్ మాట్లాడుతూ తాను పనికి వెళ్లేందుకు కారుకు బదులుగా మెట్రో ప్రయాణాన్ని ఎంచుకున్నానన్నారు. సెంట్రల్ ఢిల్లీలోని తన కార్యాలయానికి వెళ్లేటప్పుడు తాను పరిస్థితిని గమనించగా చిల్లా బోర్డర్ వద్ద ట్రాఫిక్ రద్దీ భారీ యెత్తున ఉన్నదని, అదనంగా ఒక గంట సమయం పట్టిందని, అందువల్లే తాను మెట్రోలో ప్రయాణిస్తున్నానని చెప్పారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎంనాన్‌పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం)సారథ్యంలో పంజాబ్ రైతుల సమూహం డిసెంబరు 6న దేశ రాజధాని ఢిల్లీ వైపునకు రైతుల నిరసన ప్రదర్శన కవాతు నిర్వహించాలని పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

**నిరసన తెలిపే రైతునేతలు ప్రజల అసౌకర్యానికి కారకులు కావొద్దు : సుప్రీంకోర్టు**

రైతుల డిమాండ్లను ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఖన్నూరి సరిహద్దు వద్ద ఆమరణ దీక్ష చేస్తున్న పంజాబ్ రైతు నాయకుడు జగిజిత్ సింగ్ దల్లెవాల్‌ను సుప్రీంకోర్టు సోమవారం ప్రశ్నించింది. నిరసన తెలుపుతున్న రైతులు జాతీయ రహదారులను అడ్డుకుని ప్రజలకు అసౌకర్యం కలుగకుండా శాంతియుత పద్ధతిలో నిరసనలు చేసేలా వారిని ఒప్పించగలరని దల్లెవాల్ తరపున దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పరిష్కరించిన సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేసింది. నవంబరు 26నుంచి దల్లెవాల్ పంజాబ్‌హర్యానా సరిహద్దులోని ఖనౌరి నిరసన ప్రదేశం వద్ద ఆమరణనిరాహార దీక్ష చేస్తుండగా పోలీసులు ఆయన్ను అక్కడినుంచి తొలగించివేసిన విషయం విదితమే. 'ప్రజాస్వామ్య పద్ధతిలో రైతులు శాంతియుతంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించవచ్చు. కానీ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలిగించొద్దు. ఖనౌరి సరిహద్దు పంజాబ్ ప్రజలకు జీవనాడి అని అందరికీ తెలుసు.నిరసన చేయడం సరియైనదా? తప్పా? అనే విషయమై మేం వాఖ్యానించదలచుకోలేదు' అని ధర్మాసనం దల్లెవాల్ తరపున వాదనలు వినిపిస్తున్న న్యాయవాది గుణిందర్ కౌర్ గిల్‌ను ఉద్దేశించి డివిజన్ బెంచ్ పేర్కొంది. ఖనౌరి సరిహద్దు వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న దల్లెవాల్‌ను పోలీసులు అక్కడి నుంచి బలవంతంగా తొలగించి లూథియానా హాస్పిటల్‌లో చేర్పించింది. ఆయన శుక్రవారం సాయంత్రం విడుదలయ్యారు. కాగా తనను పంజాబ్ పోలీసులు అక్రమంగా నిర్బంధించారని ఆరోపిస్తూ నవంబరు 29న సుప్రీంకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఒక రోజు తర్వాత ఆయనను నవంబరు 30న విడుదల చేశారు.

## పురోగతి లేని చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు సమావేశమై ఓ నిర్ణయానికి రావాలని అభిప్రాయపడినట్లు తెల్సింది. 9, 10 షెడ్యూల్ సంస్థల ఆస్తులు, అప్పులు పంపకాల అంశం మళ్ళీ వాయిదా పడింది. ఉద్యోగుల మార్పిడి పైనా సీఎస్‌ల కమిటీ సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. ఎక్సైజ్ శాఖకు తెలంగాణ చెల్లించిన రూ.81 కోట్ల బకాయిల అంశం పరిష్కారమైంది. అదనంగా ఇచ్చిన రూ.81 కోట్లు తిరిగి చెల్లించడానికి తెలంగాణ అంగీకరించింది. డ్రగ్స్ నివారణపై సంయుక్త కమిటీ వేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఇందుకోసం పోలీస్, ఎక్సైజ్ శాఖలతో సంయుక్త కమిటీ వేయాలని నిర్ణయానికి వచ్చారు. విభజన చట్టంలోని 9వ షెడ్యూల్లో 91 కార్పొరేషన్లు ఉండగా 23కార్పొరేషన్లపై రెండు రాష్ట్రాల మధ్య భిన్న వాదనలు వచ్చాయి. విభజన చట్టంలోని హెడ్ క్వార్టర్ అనే పదానికి భిన్నవాదనలను రెండు రాష్ట్రాలు వినిపిస్తున్నాయి. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయాన్ని మాత్రమే హెడ్ క్వార్టర్స్‌గా పరిగణించాలని తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది. కార్పొరేషన్‌కు చెందిన అన్ని భవనాలను హెడ్ క్వార్టర్‌గా పరిగణించాలని ఏపీ ప్రభుత్వం అంటోంది. దీంతో ఆర్టీసీ ఆస్తుల విభజనపై రెండు రాష్ట్రాల మధ్య వివాదం కొనసాగుతోంది. ఏపీఎస్‌ఆర్టీసీ, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఏపీ జెన్కో , ట్రాన్స్‌కో సంస్థల ఆస్తుల పంపిణీపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. అలాగే 10వ షెడ్యూల్ లో మొత్తం 142 సంస్థలు ఉండగా 30సంస్థల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాలు వెల్లువెత్తాయి. విభజన చట్టంలోని సెక్షన్ 75ప్రకారం స్థానికత ఆధారంగా ఆ సంస్థలు ఆయా రాష్ట్రాలకు చెందుతాయనడాన్ని ఏపీ వ్యతిరేకిస్తుంది.

10వ షెడ్యూల్ లోని మర్రి చెన్నారెడ్డి మానవ అభివృద్ధి సంస్థ, ఎంఆర్‌ఏపీ అకాడమీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, ఏపీ ఫారెస్ట్ అకాడమీ, పోలీస్ అకాడమీ, ఎక్సైజ్ అకాడమీ, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్, ఇంటర్మీడియట్ బోర్డు, స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, వ్యవసాయ విశ్వ విద్యాలయం, మహిళా విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమీ, అంబేద్కర్ యూనివర్సిటీ, తెలుగు యూనివర్సిటీ వంటి 30 సంస్థలపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య వివాదం నడుస్తోంది. వీటిపైనా చర్చలు వాయిదా పడ్డాయి. అదేవిధంగా విద్యుత్ బకాయిల విషయంలో 2014జూన్ నుంచి 2017 జూన్ 10 వరకు ఏపీ జెన్‌కో నుంచి తెలంగాణ తీసుకున్న విద్యుత్‌కు రూ. 3441కోట్లు రావాలని ఏపీ చెబుతోంది. సకాలంలో చెల్లించనందుకు ఆలస్యం రుసుం కింద మరో రూ.3315 కోట్లు కలిపి మొత్తం రూ. 6756 కోట్లు చెల్లించాలని ఏపీ డిమాండ్ చేస్తోంది ఏపీ నుంచే తమకు రూ. 17,828కోట్లు రావాల్సి ఉందని తెలంగాణ వాదిస్తోంది. ఏపీకి చెల్లించాల్సినవి రూ.4887 కోట్లు తీసేసి మిగతా రూ. 12940 కోట్లు తమకే ఏపీ నుంచి రావాలని తెలంగాణ అంటోంది. ఈ వివాదమూ తాజా సమావేశంలో చర్చకొచ్చినప్పటికీ, చర్చలు వాయిదా పడ్డాయి.

ఈ పెండింగ్ విభజన అంశాలపై చర్చించేందుకు మరోసారి భేటీ కావాలని సీఎస్‌లు నిర్ణయించారు. ఏపీ నుంచి సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ , ఆర్థిక శాఖ కార్యదర్శి జానకి, హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఏపీ జెన్కో సీఎండీ చక్రధర్ బాబు, వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ బాబు ఏ తదితరులు పాల్గొనగా, తెలంగాణ నుంచి ఆ రాష్ట్ర సీఎస్ శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి రఘునందన్ రావు తదితరులు హాజరయ్యారు

## రెండో వారం నుండి కాళేశ్వరం విచారణ

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** కాళేశ్వరం కమిషన్ విచారణ డిసెంబర్ నెల రెండో వారం నుండే తిరిగి ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు పలువురు ఇంజనీర్లను విచారించిన కమిషన్ చీఫ్ జస్టిస్ పిసి ఘోష్ సీనియర్ ఐఎస్‌లు స్మితా సభర్వాల్, సోమేష్ కుమార్ తదితరులను విచారించాలని భావిస్తున్నారు. అయితే ఇందుకు కొంత సమయం తీసుకోనున్నారు. ఇప్పటి వరకు పలువురు ఇంజనీర్లను విచారించిన కమిషన్ సోమవారం డ్యామ్ సేఫ్టీ అథారిటీ అధికారి మురళీకృష్ణను అమెరికా నుండి విచారించింది. కాగా అమెరికా నుంచి ఆన్‌లైన్ ద్వారానే మురళీకృష్ణ విచారణలో పాల్గొని పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మూడు బ్యారేజీల భద్రతపై కమిషన్ ఆరా తీసింది. ఈ మూడు బ్యారేజీలలో నీళ్లు స్టోరేజీ చేయవచ్చా? అని ప్రశ్నించగా ఇందుకు మురళీకృష్ణ సమాధానం చెబుతూ ప్రత్యేకమైన బ్యారేజిలలో నీళ్లను స్టోరేజీ చేయవచ్చని అన్నారు. 2021లో కొత్త డ్యామ్ సేఫ్టీ చట్టం వస్తే 22లోనే ప్రత్యేక (స్పెసిఫై ) బ్యారేజీలు గుర్తించామని మురళీకృష్ణ చెప్పగా డ్యామ్ సేఫ్టీ అధికారులు నిబంధనలు ఎందుకు సరిగ్గా పాటించలేదని ప్రశ్నించారు. డ్యామ్ సేఫ్టీ అధికారులు నిబంధనలు పాటించలేదని, ఈ కారణంగానే బ్యారేజీలలో డ్యామేజ్ జరగడంలో డ్యామ్ సేఫ్టీ అధికారుల పాత్ర సైతం ఉందని కమిషన్ చీఫ్ పిసి ఘోష్ వేసిన ప్రశ్నకు మురళీకృష్ణ నుండి సమాధానం రాక పోవడం గమనార్హం.

## అలకవీడని ఏక్‌నాథ్ షిండే?

(మొదటి పేజీ తరువాయి)

అంతా సవ్యంగా లేదని స్పష్టమవుతోందని పరిశీలకులు భావిస్తున్నారు.

**డిప్యూటీ సిఎం వార్తలు అవాస్తవం : షిండే కుమారుడు**

కాగా, తాను డిప్యూటీ ముఖ్యమంత్రి అవుతానని వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని, అవన్నీ నిరాధారమైనవని ఏక్‌నాథ్ షిండే కుమారుడు, ఎంపి శ్రీకాంత్ షిండే అన్నారు. సంకీర్ణ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం కాస్త ఆలస్యమవడంతో అనేక చర్చలు, పుకార్లు వస్తున్నాయన్నారు. ఆపద్ధమర్మ సిఎం ఏక్‌నాథ్ షిండే అనారోగ్యం కారణంగా స్వగ్రామానికి వెళ్ళి విశ్రాంతి తీసుకుంటున్నారని, దీంతో అనేక పుకార్లు వస్తున్నాయన్నారు. లోక్‌సభ ఎన్నికల తరువాత తనకు కేంద్ర మంత్రి అవకాశం వచ్చినా తిరస్కరించానని, పదవులపై తనకు ఆసక్తి లేదని, పార్టీలోనే పని చేస్తానని చెప్పారు.

**రేపు బిజెపి శాసనసభాపక్ష నేత ఎన్నిక**

బిజెపి శాసనసభాపక్షం బుధవారం సమావేశం కానుంది. ఆ సమావేశంలో బిజెపి శాసనసభాపక్ష నాయకుడిని ఎన్నుకుంటారు. ఇప్పటికే ముఖ్యమంత్రి ఎంపికకు తాను అడ్డు కాదని ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రకటించారు. ఈ నేపథ్యంలో బిజెపి శాసనసభ పక్ష నాయకుడనే ముఖ్యమంత్రి కానున్నారు. ఈ నెల 5వ తేదీన ఆజాద్ మైదాన్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉండబోతుందని బిజెపి మహారాష్ట్ర నాయకుల ప్రకటించారు. ఈ నేపథ్యంలో బుధవారం ముంబాయిలో జరిగే బిజెపి శాసనసభాపక్ష సమావేశానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీలను కేంద్రం నుంచి పరిశీలకులుగా బిజెపి అధిష్టానం ప్రకటించింది. వీరిరువురు బిజెపి ఎంఎల్‌ఏల సమావేశలో పాల్గొని, ఎన్నికైన బిజెఎల్‌పి నేత పేరును ప్రకటిస్తారు. అయితే, ముఖ్యమంత్రిగా ఎవరనేది సస్పెన్స్ కొనసాగుతున్నప్పటికీ, దేవేంద్ర ఫడ్నవీస్ పేరు ఖరారు అయ్యే అవకాశం ఉందని బిజెపి సీనియర్ నేత ఒకరు 'పిటిఐ'కి చెప్పారు.

## మృతదేహాలను భద్రపర్చండి

(మొదటి పేజీ తరువాయి)

పోస్టుమార్టం చేశారన్నారు. ఎన్‌హెచ్‌ఆర్సీ నిబంధనలకు విరుద్ధంగా మావోయిస్టుల పట్ల పోలీసులు వ్యవహరించారని హైకోర్టుకు తెలిపారు. అనంతరం ప్రభుత్వం తరపు న్యాయవాది వాదిస్తూ, పోలీసులు భద్రత దృష్ట్యా మృతదేహాలను ఆసుపత్రికి తరలించామని కోర్టుకు తెలిపారు. కెఎంసి వైద్య నిపుణుల ఆధ్వర్యంలోనే పోస్టుమార్టం నిర్వహించారని స్పష్టం చేశారు. పోస్టుమార్టం ప్రక్రియను మొత్తం వీడియో తీశారని పేర్కొన్నారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు మావోయిస్టుల మృతదేహాలను భద్రపరచాలని పోలీసులకు ఆదేశాలిచ్చింది. అలాగే మృతదేహాలను కుటుంబ సభ్యులకు, బంధువులకు చూపించాలని తెలిపింది. ఈ విషయంపై తదుపరి విచారణను రేపటికి మంగళవారానికి హైకోర్టు వాయిదా వేసింది.

**విషపదార్థాల ప్రయోగం దుష్ప్రచారం : డిజిపి**

ములుగు జిల్లా పరిధిలో ఆదివారం జరిగిన ఎదురు కాల్పుల్లో విష పదార్థాలు ప్రయోగించి స్పృహ కోల్పోయిన తర్వాత కాల్పులు జరిపారని తెలంగాణ రాష్ట్ర పౌర హక్కుల సంఘం చేస్తున్న ఆరోపణలను రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ ఖండించారు. ఇది పూర్తిగా దుష్ప్రచారం అని స్పష్టం చేశారు ఎదురుకాల్పులకు కొద్ది రోజుల ముందు ఇన్ ఫార్మర్లు అనే నెపంతో ఇద్దరు ఆదివాసీలైన ఉయిక రమేష్ , ఉయిక అర్జున్ లను మావోయిస్టులు కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారని తెలిపారు. ఇటువంటి సంఘటనలను అడ్డుకునేందుకు పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులపై మావోయిస్టులు కాల్పులు జరిపారని డిజిపి అన్నారు. మావోయిస్టులు అత్యాధునికమైన ఆయుధాలను ఉపయోగించి పో లీసులపై కాల్పులు జరిపారని పేర్కొన్నారు. తత్ఫలితంగా పోలీసులతో జరిగి న ఎదురుకాల్పుల్లో ఏడుగురు సాయుధ మావోయిస్టులు మరణించారన్నారు. అదేవిదంగా, మృతదేహాల శవ పరీక్షలు హైకోర్టు, జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్ హెచ్ ఆర్ సి) సూచనల మేర కు జరుగుతున్నాయని తెలియజేశారు. దీంతోపాటు, కేసు దర్యాప్తు అధికారిగా వేరే జిల్లా డిఎస్‌పిని నియమించామని, దర్యాప్తు జరుగుతుందని డిజిపి డాక్టర్ జితేందర్ వివరించారు.

## 7న రాష్ట్ర వ్యాప్త 'ఆటోబంద్'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ఆటో డ్రైవర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని తెలంగాణ ఆటో, క్యాబ్స్ డ్రైవర్స్ సంఘాల జెఎసి కన్వీనర్ బి. వెంకటేశం (ఎ ఐ టి యు సి) హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ ఈ నెల 7న తెలంగాణ ఆటో,క్యాబ్స్ డ్రైవర్స్ సంఘాల జెఎసి రాష్ట్ర వ్యాప్తంగా 'ఆటోబంద్' నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఆటో బంద్‌లో భాగంగా హైదరాబాద్‌లోని సుందరయ్య పార్క్ నుండి ఇందిరాపార్క్ వరకు లక్ష మంది రవాణ రంగ కార్మికులతో మహా ప్రదర్శన, అనంతరం ఇందిరాపార్క్ వద్ద బహిరంగ సభను నిర్వహిస్తున్నామని వివరించారు. హైదరాబాద్, హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జెఎసి నాయకులు వి. ప్రవీణ్ (టియుసిఐ), ఎ.సత్తిరెడ్డి (టిఎడిఎస్), మీర్జా రఫాత్ బేగ్ (ఆటో ఓనర్స్ అసోసియేషన్), ఎస్.రామకృష్ణ (బిఆర్‌టియు), బి, తిరుమలేష్ గౌడ్, శ్రీనివాస్, శంకర్ రెడ్డి (క్యాబ్స్ యూనియన్) లతోకలిసి బి. వెంకటేశం 'ఆటోబంద్' గోడ పత్రికను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని ఇది వరకే అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ , వాటి పరిష్కరానికి ప్రభుత్వం చొరవ చూపడంలేదని విమర్శించారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకంతో ఆటో డ్రైవర్ల జీవనం, జీవనోపాధి అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో 20వేల కొత్త ఆటో పర్మిట్లు ఇవ్వాలని, ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ చెల్లించాలని, ప్రమాద బీమాను రూ.10లక్షలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జెఎసి నాయకులు ఎ.బిక్షపతి యాదవ్, సిహెచ్. జంగయ్య, ఎం. కృష్ణ, లింగం గౌడ్, ఎండి. జాకిర్ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com